


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ 19 బుధవారం మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 183

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Medak, Nizamabad, Krishna, Guntur, Easrt Godavari, West Godavari, Prakasam, Nellore, Srikakulam, Vizianagaram, Visakhapatanam, Kurnool, Chittoor, Kadapa, and Anantapur




# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం



- రాజకీయాలకు అతీతంగా బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం
- ఎస్సీ వర్గీకరణకు అండగా నిలిచిన సభ్యులందరికీ సీఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు
- ఉమ్మడి రాష్ట్రంలో దామోదరం సంజీవయ్యలాంటి దళితుడిని సీఎంగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది
- దళితుడు అయిన మల్లికార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ నియమించిందన్న సీఎం

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ అసెంబ్లీ వేదికగా ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించింది. రాజకీయాలకు అతీతంగా బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోద ముద్ర పడింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యేలు అభినందనలు తెలిపారు. అనంతరం సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అండగా నిలిచిన సభ్యులందరికీ సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాలకు తావు లేకుండా అన్ని పార్టీలు వర్గీకరణ బిల్లుకు మద్దతు తెలిపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మకమైన సందర్భం అని.. ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు జరిగాయని.. ఎందరో ఈ పోరాటంలో చనిపోయారని వాపోయారు. దళితులకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 1960 లోనే ఉమ్మడి రాష్ట్రంలో దామోదరం సంజీవయ్య లాంటి దళితుడిని ముఖ్యమంత్రిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని ఆయన కొనియాడారు. అలానే దళితుడు అయిన మల్లికార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ నియమించిందని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా న్యాయవాదితో సుప్రీం కోర్టులో వాదనలు వినిపించామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. న్యాయస్థానం తీర్పు ఇచ్చిన వెంటనే వర్గీకరణకు అనుకూలంగానే శాసనసభలో తీర్మానం చేశామన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం కూడా ఏర్పాటు చేశామని.. సబ్ కమిటీ సూచన మేరకు ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. వన్ మెన్ కమిషన్ ఇచ్చిన నివేదికను తూచ తప్పకుండా ఆమోదించామని వెల్లడించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఎవరికి అన్యాయం జరగదు అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను పెంచి వాటిని అమలు

# మళ్ళీ కరోనా?

- కోల్‌కత్తా మహిళకు కరోనా!
- అత్యంత అరుదైన హ్యూమన్ కరోనా వైరస్ హెచ్ కేయూ1 బారిన పడ్డారన్న వైద్యులు
- మహిళకు ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు

2




**కలకత్తా-నవభూమిబ్యూరో:** భారతదేశంలో మళ్లీ కరోనా కలకలం రేపింది. కలకత్తాలోని ఓ మహిళ అత్యంత అరుదైన హ్యూమన్ కరోనా వైరస్ హెచ్ కేయూ1 బారిన పడ్డారని తాజాగా ఒక విషయం వెలుగులోకి వచ్చింది. ఇది ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరిని మళ్లీ ఆందోళనకు గురిచేస్తుంది. ప్రస్తుతం కలకత్తాలో వైరస్ బారిన పడిన మహిళను ఐసోలేషన్ లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కోల్‌కత్తాలో మహిళకు హ్యూమన్ కరోనా వైరస్ గత 15 రోజులుగా ఆ మహిళ జలుబు, జ్వరం, దగ్గుతో బాధపడుతున్నట్లు సమాచారం. 45 సంవత్సరాల వయసు ఉన్న ఈ మహిళ హ్యూమన్ కరోనా వైరస్ బారిన పడినట్టు ఆమెకు నిర్వహించిన టెస్టుల ఆధారంగా గుర్తించిన వైద్యులు దక్షిణ కోల్కతాలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం మహిళ కోవిడ్ బారిన పడి చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలోనూ ఆందోళన కొనసాగుతుంది. 100 ఏళ్ల తర్వాత అరుదైన సూర్యగ్రహణం..ఈ రాశుల వారి జాతకాలు మారిపోతున్నాయ్ హ్యూమన్ కరోనా వైరస్ ఆందోళన మళ్లీ కరోనా వ్యాప్తి జరుగుతుందా? మళ్లీ లాక్ డౌన్ నాటి పరిస్థితులు వస్తాయా? అని ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా తలనొప్పి, జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలు

# మంచు లక్ష్మీ అరెస్ట్ తప్పదా..?

- మంచు ఫ్యామిలీకి బిగ్ షాక్ ..
- బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన మంచులక్ష్మీ
- ఇప్పటికే 11 మంది సెలబ్రెటీలపై కేసు
- తాజాగా మంచు లక్ష్మీ పేరు తెరపైకి...

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

సినీ సెలబ్రిటీలు బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ బెట్టింగ్ యాప్స్ వ్యవహారాన్ని తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై తెలంగాణ పోలీసులు నజర్ పెట్టారు. బెట్టింగ్ యాప్స్ ని ప్రమోట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొనే ప్రయత్నం చేస్తున్నారు పోలీసులు. దీనిలో భాగంగానే పోలీసులు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. తాజాగా 11 మంది సెలబ్రిటీలకు పోలీసులు షాకిచ్చారు. హర్షసాయి, పరేషాన్ బాయ్స్ ఇమ్రాన్ ఖాన్, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, విష్ణుప్రియ, యాంకర్ శ్యామల, రీతూ చౌదరి, బండారు షేషయాని సుప్రిత తదితరులపై పంజాగుట్ట పోలీసులు కేసులు

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం
# ఒక మైలురాయి

- నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఇది చారిత్రాత్మకమైన రోజు..దశాబ్దాల పోరాటానికి నిర్మాణాత్మక పరిష్కారం
- కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఎస్సీ వర్గీకరణకు మద్దతునిచ్చిందన్న ఉత్తమ్
- రాహుల్ ఎన్నికల ప్రచారాలలో ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన హామీ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ శాసనసభలో మంగళవారం ఎస్సీ (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) బిల్లు 2025 ఆమోదం పొందడం ఒక మైలురాయి నిర్ణయమని నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడానికి ఏర్పాటు చేసిన కేబినెట్ ఉప కమిటీకి ఛైర్మన్‌గా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో దశాబ్దాలుగా పరిష్కరించబడని డిమాండ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పేర్కొన్నారు. "ఇది చారిత్రాత్మకమైన రోజు. ఎస్సీ వర్గీకరణకు సంవత్సరాలుగా అన్ని వర్గాల మద్దతు ఉంది, కానీ ఎటువం టి నిర్మాణాత్మక పరిష్కారం సాధించ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కింద, మేము ఈ దీర్ఘకాల డిమాండ్‌ను పూర్తి చిత్తశుద్ధితో నెరవేర్చాము," అని ఆయన అసెంబ్లీలో ప్రసంగిస్తూ అన్నారు. వన్ మ్యాన్ కమిషన్ నియామకం చర్చ సమయంలో, ముఖ్యమంత్రి తరపున మంత్రి దామోదర్ రాజనర్సిం హ బిల్లును ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఎస్సీ వర్గీకరణకు మద్దతునిచ్చిందని, రాహుల్ గాంధీ తన ఎన్నికల ప్రచారాలలో ఈ విషయంపై స్పష్టమైన హామీ ఇచ్చారని ఉత్తమ్ కుమార్ రెడ్డి హైలైట్ చేశారు. మునుపటి ప్రభుత్వాలు ఏకగ్రీవ తీర్మానాలు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు

## విజయసాయిరెడ్డికి
# మళ్లీ సీఐడీ పిలుపు..!

- గత వైసీపీ ప్రభుత్వంలో కాకినాడ పోర్టు యజమాని కేవీరావును బెదిరించి తనవాళ్లకు వాటిని రాయించుకున్నారనే ఆరోపణలు
- ఈ ఆరోపణలపై ఒకసారి సీఐడీ విచారణ
- 25న మరోసారి విచారణకు రావాలని సీఐడీ నోటీసులు
- వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డేనని బాధ్యుడన్న విజయసాయి

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీలో రాజకీయాలకు గుడ్ బై చెప్పేసినా మాజీ వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డిని పాత కేసులు వెంటాడుతున్నాయి. గతంలో కాకినాడ పోర్టు వాటాల బదిలీకి యజమానుల్ని బెదిరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయసాయిరెడ్డిని ఇప్పటికే ఓసారి విచారించిన సీఐడీ అధికారులు.. మరోసారి విచారణకు రావాలని నోటీసులు పంపారు. దీంతో సాయిరెడ్డి మరోసారి విచారణకు హాజరయ్యేందుకు సిద్దమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కాకినాడ పోర్టు యజమాని కేవీరావును బెదిరించి తన బంధువులకు వాటిని రాయించుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొం టున్న విజయసాయిరెడ్డిని ఈ నెల 25న మరోసారి విచారణకు రావాలని సీఐడీ నోటీసులు పంపింది. కాకినాడ పోర్టుతో పాటు సెజ్ వ్యవహారంలోనూ ఆయన్ను ప్రశ్నించాల్సి ఉందని సీఐడీ తెలిపింది. ఈ వ్యవహారంలో విజయసాయిరెడ్డితో పాటు మొత్తం ఆరుగురిపై సీఐడీ కేసు నమోదైంది. దీనిపై గతంలో విచారణకు హాజరైన విజయసాయిరెడ్డిని సీఐడీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. అయితే విచారణ తర్వాత అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని చెప్పి పంపారు. అలాగే ఈ విచారణలో విజయసాయిరెడ్డి కాకినాడ పోర్టు వాటాల వ్యవహారంతో తనకు అస్సలు సంబంధం లేదని,

## తెలంగాణ
# నేడు బడ్జెట్



- అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న మల్లు భట్టి విక్రమార్క
- రూ. 3.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం
- మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న మంత్రి శ్రీధర్ బాబు

2

## యాదగిరిగుట్ట ఆలయానికి
# ధర్మకర్తల మండలి

- తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం
- 18 మంది సభ్యులతో వైటీడీ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు
- వారికి జీతభత్యాలు ఉండవన్న మంత్రి కొండా సురేఖ
- ఈవోగా ఐఏఎస్ అధికారి



2

# ఏపీలో 50 ఏళ్లకే పెన్షన్

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కీలక ప్రకటన..
- ఏపీ శాసనమండలిలో 50ఏళ్లకే పెన్షన్‌పై వైసీపీ సభ్యుల ప్రశ్నలు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే రూ. 4 వేల చొప్పున పెన్షన్ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్న మంత్రి
- గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ శాసనమండలిలో మరో కీలక అంశం నేడు ప్రస్తావనకు వచ్చింది. పెన్షనర్ల తగ్గింపు, 50 ఏళ్లకే పెన్షన్ హామీపై వైసీపీ సభ్యులు కూటమి ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించారు. ఈ క్రమంలోనే వారి ప్రశ్నలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే రూ. 4 వేల చొప్పున పెన్షన్ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నా మని వెల్లడించారు. గత ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు టైమ్ తీసుకుంటే.. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచామని గుర్తు చేశారు. ప్రస్తుతం అనర్హుల పెన్షన్లనే తొలగిస్తున్నామని క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం 60 ఏళ్ల వయసు, ఆపై దాటిన వారికి సామాజిక పెన్షన్లు అందుతున్నాయి. అయితే 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ 4 వేలు పెన్షన్ అందిస్తామని నాడు ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకోసం అర్హులైన నిరుపేదలు అందరికీ సామాజిక భద్రతా పింఛనులు అందేలా చూసేందుకై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుకు కూడా కృషి చేశారు. ఈ క్రమంలోనే పలువురు అనర్హులు పెన్షన్లు అందుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో జిల్లాల వారీగా వీరి లెక్కలను ప్రభుత్వం సేకరించింది. అర్హత లేకపోయినా పెన్షన్లు అందుకుంటున్న వారిని గుర్తించి పెన్షన్లను తొలగిస్తున్నారు. రాష్ట్రంలో 50 నుండి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు దాదాపు 15 లక్షలుగా ఉన్నట్లు గుర్తించారు. అయితే వారికి పింఛను

## కృష్ణా నదీ ప్రాజెక్టులపై
# తెలంగాణ పిటిషన్

- కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు
- 2 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు

హైదరాబాద్-నవభూమిబ్యూరో

కృష్ణా నదీ ప్రాజెక్టుల అంశంపై తెలంగాణ రాష్ట్రం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈరోజు విచారించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్లు దాఖలైన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని కూడా ఆదేశించింది.

కృష్ణా నది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

## తెలంగాణకు
# చల్లని కబురు

- 21 నుంచి ఐదురోజుల పాటు వర్షాలు
- పలు జిల్లాల్లో చెదురుమొదురు వానలు
- నేటి నుంచి 3 రోజుల పాటు పొగమంచు

3

హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. మార్చి నెల ప్రారంభం నుంచే ఉష్ణోగ్రతలు భారీగా పెరిపోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 9 గంటల తర్వాత బయటికి రావాలంటేనే జంకుతున్నారు. ఇక, సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఉంటోంది. పలు ప్రాంతాల్లో వడగాలులు కూడా మొదలయ్యాయి. దీంతో ప్రజలు పగటిపూట ఇంటి నుంచి బయటికి రావాలంటేనే భయపడిపోతున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా, వాతావరణ శాఖ తెలంగాణ ప్రజలకు చల్లని కబురు చెప్పింది. మార్చి

# స్టాక్ మార్కెట్ కళకళ..

- మదుపర్లకు కాసుల పంట..వరుసగా రెండో రోజూ లాభాల బాట
- అంతర్జాతీయమార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, దేశీయంగా ఫైనాన్షియల్ , మెటల్ రంగాలలో కొనుగోళ్ల జోరుతో మార్కెట్

2



**ముంబై-నవభూమిబ్యూరో:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు దుమ్మురేపాయి! వరుసగా రెండో రోజూ లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, దేశీయంగా ఫైనాన్షియల్ , మెటల్ రంగాలలో కొనుగోళ్ల జోరుతో మార్కెట్ కళకళలాడింది. సెన్సెక్స్ ఏకంగా 1131 పాయింట్లు ఎగిసి, 75,301 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 325 పాయింట్లు

# ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానం


3

## 44 ఏళ్ల నాటి దళితుల ఊచకోత కేసు
# ముగ్గురికి ఉరి

## ఎండల నుంచి ఉపశమనం.. తెలంగాణలో వర్షాలు, వాతావరణశాఖ వెదర్ అప్డేట్



హైదరాబాద్-నవభూమి:తెలంగాణలో ఎండలు దంచికొడు తున్నాయి. మాడు పగిలే ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. భానుడి భగభగలతో బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది జనవరి చివరి వారం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించటం మొదలుపెట్టాడు. ఇక మార్చి నుంచి అయితే ఎండల తీవ్రత మరింత పెరిగింది. ఉదయం 9 గంటల నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 10 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో రోడ్లపై జన సంచారం తగ్గిపోతుంది. రాత్రి వేళల్లోనూ ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతోంది.ఇలాంటి సమయంలో హైదరాబాద్ వాతావరణ శాఖ తెలంగాణ ప్రజలకు చల్లని కబురు చెప్పింది. ఎండల నుంచి ఉపశమనం కలిగేలా వెదర్ అప్డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో ఈనెల 21 నుంచి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈనెల 21 నుంచి 25 వరకు రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే ఛాన్స్ ఉందని చెప్పారు. అయితే ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదు. ఇక నేడు (మార్చి 18) రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని అన్నారు. రాబోయే మూడ్రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా.. ఉదయం సమయంలో పొగమంచు ఏర్పడే ఛాన్స్ ఉందని తెలిపారు. ఈ సమయంలో రెండ్రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని చెప్పారు. ఆ తర్వాత ఉష్ణోగ్రతల్లో స్వల్ప తగ్గుదల ఉంటుందని అన్నారు.మొత్తానికి భానుడి భగభగలతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఉపశమనం కలిగించే వార్త చెప్పినట్లయింది. ఈనెల 21 నుంచి వర్షాలు కురుస్తాయని చెప్పటంతో ప్రజలు కూడా రిలీఫ్‌గా ఫీలవుతున్నారు. హాట్ సమ్మర్‌లో కాస్త కూల్ వెదర్ రానుండటం పట్ల



## ఓరి నీ దుంప తెగ.. అత్తగారింట్లోనే పనికానిచ్చేసిన అల్లుడు.. లబోదిబోమన్న అత్త..!



**హైదరాబాద్-నవభూమి:** ఇదెక్కడి పోయే కాలంరా నాయనా. మానవ సంబంధాలన్నీ మనీ బంధాలవుతున్నాయి. జనాలు పూర్తిగా కమర్షియల్ అయిపోతున్నారు. అలా అని కష్టపడి చెమటోర్చి డబ్బు సంపాదిస్తున్నారా అంటే.. అబ్బే మనకు ఒళ్లు కందకుండా రాత్రికి రాత్రే కోట్ల వర్షం కురిసిపోవాలి కదా. మరి అలా రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలంటే.. అయితే ఏదైనా లాటరీ అయినా తగలాలి.. లేదా దోపిడీ అయినా చేయాలి. లాటరీ తగలాలంటే అదృష్టం కూడా ఉండాలి కాబట్టి దొంగతనం అయితే పక్కా అనుకుంటున్నారు కొంతమంది సోమరిపోతులు. దొంగలను సోమరిపోతులంటారేంటీ.. అది కూడా ఓ కళే.. చోరకళ అంటారా..? ఆ చోరకళను ప్రదర్శించి అడ్డంగా దొరికిపోయాడు ఓ వ్యక్తి. అది కూడా ఎవరో బయటి వాళ్ల ఇంటిని దోచేయటం రిస్క్ అనుకున్నాడో ఏమో.. స్వయంగా తన అత్తగారింట్లోనే పని కానిచ్చేశాడు ఓ సోమరిపోతు అల్లుడు.నిజామాబాద్ నగరంలోని రోటరీ నగర్‌కు చెందిన సంతోష్.. తన సొంత అత్తగారింట్లోనే చోరీకి పాల్పడ్డాడు. డబ్బులు అత్యవసరమయ్యాయో.. లేక అలవాట్లకు బానిసయ్యాడో.. లేక బాకీలు పీక మీదికొచ్చాయో.. లేక ఇంకేదైనా కారణం ఉందో.. మొత్తానికి దొంగతనం చేసేందుకు సిద్ధపడ్డాడు సంతోష్. ఇంటికి తాళం వేసి అత్త ఊరెళ్లిన విషయాన్ని గమనించిన సంతోష్.. సరైన సమయం చూసి రంగంలోకి దిగాడు. తన అత్తగారిల్లే కాబట్టి.. తాళం పగలగొట్టినా ఎవరూ అనుమానించరేమో. పైగా.. ఇంట్లో ఏది ఎక్కడ ఉంటుందో అల్లుడికి బాగా తెలియటంతో.. నేరుగా వెళ్లి బీరువాలోని 8 తులాల బంగారు ఆభరణాలు తీసుకుని బయటపడ్డాడు. బంగారం దొరికిన సంతోషంలో తాళం పగలగొట్టిన విషయాన్ని ఇక.. ఊరి నుంచి ఇంటికి వచ్చిన అత్త.. తాళం పగలగొట్టి ఉండటాన్ని చూసి.. దొంగలు పడినట్టుగా గుర్తించింది. ఇంట్లోకి వెళ్లి చూస్తే.. తన 8 తులాల బంగారం కనిపించలేదు. ఇంకేముంది లబోదిబోమంటూ గుండెలు బాదుకుంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో భాగంగా.. అల్లుడు సంతోషే దొంగతనానికి పాల్పడినట్టుగా గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో నిందితున్ని అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలిసిన ఇరుగుపొరుగు, బంధువులంతా ముక్కున వేలేసుకున్నారు. సొంత అత్తగారింట్లోనే అల్లుడు కన్నం పెట్టటమేంటీ విడ్డూరం కాకపోతే అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## 'కొత్త రైల్వే టెర్మినల్‌కు ఆ మహనీయుడి పేరు పెట్టండి'..

### రైల్వే మంత్రికి సీఎం రేవంత్ లేఖ



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ మహానగరంలో కొత్తగా నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కి లేఖ రాశారు. 'దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పునాది వేసిన పొట్టి శ్రీరాములు గారి త్యాగాలను స్మరిస్తూ చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు వారి పేరును పెట్టాలని తెలంగాణ ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. 'తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు, సంస్కృతికి గర్వకారణమైన పొట్టి శ్రీరాములు గారు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తారు. సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల కోసం ఆయన ఎనలేని కృషి చేశారు. సమాజంలో అన్ని వర్గాలకు సమాన హక్కులు ఉండాలని పోరాడిన పొట్టి శ్రీరాములు గారు చేసిన ఆమరణ నిరాహార దీక్ష వారి నిస్వార్థ త్యాగానికి, తెలుగువారికి గర్వకారణంగా నిలుస్తున్నారు. కొత్త రైల్వే టర్మినల్ ఏర్పాటు ద్వారా తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పనలో అదనపు ప్రయోజనం చేకూరింది. తెలంగాణ రైజింగ్ దార్శనికతకు ఇదెంతగానో తోడ్పడుతుంది. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న తమ లక్ష్య సాధనకు ఈ కొత్త రవాణా కేంద్రం ఉపయుక్తంగా చేశారు. అందుకు రైల్వే మంత్రి గారికి నా అభినందనలు.తెలుగు ప్రజల కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలకు గుర్తుగా చెర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు వారి పేరును పెట్టి గౌరవించుకోవలసిన అవసరం ఉంది. అది వారి అసమాన అంకిత భావానికి నివాళిగా భావిస్తున్నాం. మా విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని రైల్వే టెర్మినల్ స్టేషన్ పేరును మార్చాలని కోరుతున్నాం. ఈ విషయంలో మీరందించే సహకారం ఒక గొప్ప అడుగు అవుతుంది. తెలంగాణ ప్రజలు, తెలుగు మాట్లాడే ప్రజలందరూ దీనిని ఎంతగానో అభినందిస్తారు. మా విజ్ఞప్తి విషయంలో సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నాం.' అని సీఎం రేవంత్ లేఖలో పేర్కొన్నారు.

కాగా, తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టిన సంగతి తెలిసిందే. పొట్టి శ్రీరాములు బదులుగా సురవరం ప్రతాపరెడ్డి పేరును ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో పొట్టి శ్రీరాములుకు కూడా సరైన గౌరవం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని తాజాగా.. రైల్వే మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు.

## పోలీస్ అయిఉండి బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్.. ఊహించని షాక్..

**హైదరాబాద్-నవభూమి:**మలయాళంలో సూపర్ హిట్ అయిన రేఖ చిత్రం అనే సినిమాలో హీరో బెట్టింగ్ ఆడి లక్షలు గెలుస్తాడు. ఈ విషయం అధికారులకు తెలిసి కొన్ని నెలలు సస్పెండ్ చేస్తారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో పాటు సాధారణ జనం కూడా అతడ్ని వింతగా చూస్తారు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే.. నిజ జీవితంలోనూ ఓ కానిస్టేబుల్ బెట్టింగ్ యాప్స కారణంగా ఇబ్బందుల్లో పడ్డాడు. ఇప్పుడు ఉద్యోగం కూడా పోయే పరిస్థితి వచ్చింది. హబీబ్‌నగర్ పీఎస్‌లో పనిచేస్తున్న కిరణ్ గౌడ్ బెట్టింగ్ యాప్స ప్రమోట్ చేశాడు. అది కూడా యూనిఫామ్ వేసుకుని మరీ బెట్టింగ్ యాప్స ప్రమోట్ చేశాడు. అంతటితో ఆగకుండా టెలిగ్రామ్ ఛానల్‌లో బెట్టింగ్ యాప్స టిప్స కూడా చెప్పటం మొదలెట్టాడు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసింది. కిరణ్ గౌడ్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు

## టూరిస్టులకు గుడ్‌న్యూస్.. రాష్ట్రంలో తొలిసారిగా రోప్‌వే టూరిజం



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణను టూరిస్టు హబ్‌గా మార్చేందుకు సర్కార్ కీలక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా కొత్త టూరిజం పాలసీని రూపొందించాలని ఇటీవల అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దేశ విదేశాల్లోని పర్యాటకులను ఆకర్షించటమే లక్ష్యంగా పాలసీ ఉండాలన్నారు. ఇప్పటికే ఉన్న టూరిస్టు ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయటంతో పాటుగా.. కొత్తగా రాష్ట్రంలో టూరిస్టు ప్రాంతాలను ఎంపిక చేయాలని సూచించారు. సీఎం సూచనల మేరకు అధికారులు టూరిస్టు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో తొలిసారిగా రోప్‌వే పర్యాటకాన్ని టూరిస్టులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించటమే లక్ష్యంగా రోప్‌వే పర్యాటకంపై సర్కార్ ఫోక్స్ పెట్టింది.

తెలంగాణలో గోల్కొండ, వరంగల్ కోటల తర్వాత భువనగిరి కోటకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఏకశిల రాతిగుట్టపై నిర్మించిన భువనగిరి కోటకు ఎన్నో శతాబ్దాల చరిత్ర ఉంది. హైదరాబాద్ నగరానికి అతి దగ్గర్లో కేవలం 50 కి.మీ దూరంలో ఉన్న ఈ కోటను స్వదేశీదర్శన్ 2.0 పథకం కింద అభివృద్ధి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రూ.56.81 కోట్ల వ్యయంతో కోటను అభివృద్ధి చేసేందుకు తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తాజాగా టెండర్లు పిలిచింది. భువనగిరి ఖిల్లా పక్కనే ఉన్న హైదరాబాద్-వరంగల్ 165వ నేషనల్ హైవే నుంచి కోట వద్దకు దాదాపు కిలో మీటరు దూరం వరకు రోప్‌వే ఏర్పాటు చేయనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే.. రాష్ట్రంలో తొలి రోప్‌వేగా ఇది గుర్తింపు సాధించనుంది.ట్రెక్కింగ్ ప్రాధాన్యమున్న ప్రాంతాల్లో భువనగిరి కోట ఒకటి కాగా.. ప్రస్తుతం కోటపైకి చేరడానికి దాదాపు గంట సమయం పడుతోంది. తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన యాదగిరిగుట్టకు అతి సమీపంలోనే ఈ కోట ఉంటుంది. చాలా మంది టూరిస్టులు ఈ కోటను సందర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో టూరిస్టులకు కొత్త అనుభూతిని ఇచ్చేందుకు రోప్ వే నిర్మించేందుకు సిద్ధమయ్యారు. ఖిల్లాపైకి రోప్‌వే ఏర్పాటుతో పాటు కోటపై ఉన్న నీటి కొలను, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, ప్రవేశద్వారం, రోడ్లు, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తారు.మొత్తం రూ.15.20 కోట్ల వ్యయంతో రోప్ వే నిర్మించనుండగా.. 30 మీటర్ల వెడల్పుతో యాక్సెస్‌రోడ్డు, పార్కింగ్ నిర్మించనున్నారు. వీటికి రూ.10.73 కోట్లు ఖర్చు చేయనున్నారు. మరో రూ.10.37 కోట్లతో కోట ప్రవేశద్వారం, టూరిజం సదుపాయాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.9.40 కోట్లు, ఇతరత్రా ఏర్పాట్లకు: రూ.11.11 కోట్లు ఖర్చు చేయనున్నారు. త్వరలోనే ఈ రోప్ వే అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే రాష్ట్రంలో అద్భుత టూరిస్టు ప్లేస్‌గా భువనగిరి కోట నిలవనుంది.

## భారీ శుభవార్త.. కేవలం 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి..



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ ప్రభుత్వం.. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను సమర్థవంతంగా.. పారదర్శకంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ చర్యల ద్వారా ప్రజలకు వేగంగా సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌ను మరింత సులభతరం చేయడానికి.. ఏప్రిల్ మొదటి వారంలో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కోసం సమయం దాదాపు 45 నిమిషాల నుంచి 1 గంటవరకు పడుతుంది. ఈ వ్యవధిని తగ్గించడానికి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా.. ఒక్కో రిజిస్ట్రేషన్ 10 నుండి 15 నిమిషాలలో పూర్తి చేయగలుగుతారు. మొదట దీనిని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో పైలట్ ప్రాజెక్టుగా అమలులోకి తెస్తామన్నారు.స్లాట్ బుకింగ్ విధానంతో.. ప్రజలు ఎక్కువ సమయం వరకు ఎదురు చూడకుండా.. త్వరగా తమ డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ విధానాన్ని సమర్థంగా అమలు చేసేందుకు.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వాటిలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, చాట్‌బాట్ సేవలు కూడా ఉపయోగించాలని అధికారులకు మంత్రి సూచించారు.నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ జాబితాలోని భూముల రిజిస్ట్రేషన్ చేసినా.. వెంటనే సమాచారాన్ని అన్ని సంబంధిత కార్యాలయాలకు చేరుస్తామని చెప్పారు. నిషేధిత ఆస్తుల వివరాలను భూభారతి తరహాలో ప్రత్యేకంగా పోర్టల్‌ను ఏర్పాటు చేసి అందులో పొందుపరిచి రెవెన్యూ శాఖకు అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు.

భూముల క్రమబద్ధీకరణ కార్యక్రమం (ఎల్ఆర్ఎస్) మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఎంతో కాలంగా ఈ ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నారని.. వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలోని రిజిస్ట్రార్‌లు ప్రతి రోజు సమీక్షించాలన్నారు. సందేహాలుంటే ఉన్నత అధికారులతో మాట్లాడి.. సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులు ఎట్టిపరిస్థితిల్లో ఉండకూడదని పేర్కొన్నారు. అధికారుల తప్పుల వల్ల ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. కార్యాలయాలకే రిజిస్ట్రార్‌లు పరిమితం కాకుండా.. ప్రతి వారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించాలని మంత్రి ఆదేశించారు.

## బిల్ గేట్స్‌తో చంద్రబాబు .. ఏపీకి మరో శుభవార్త

**అమరావతి-నవభూమి:**బిల్‌గేట్స్ ప్రపంచానికి పరిచయం అక్కరలేని పేరు. ఎవరైనా ఆయనను ఒక్కసారి కలిసే అవకాశం మహాభాగ్యంగా భావిస్తారు. కానీ ఏపీ సీఎం చంద్రబాబుకు అంతకుమించి దొరికింది.

బిల్‌గేట్స్ ప్రపంచానికి పరిచయం అక్కరలేని పేరు. ఎవరైనా ఆయనను ఒక్కసారి కలిసే అవకాశం వస్తే మహాభాగ్యంగా భావిస్తారు. కానీ ఏపీ సీఎం చంద్రబాబుకు అంతకుమించి దొరికింది. బిల్‌గేట్స్ సహాయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పట్టించిన సీఎం చంద్రబాబు రేపు ఐదు కీలక రంగాల్లో ఒప్పందాలు చేసుకోబోతున్నారు. టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు ఇండియాలోనే బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే సీఎం చంద్రబాబు



సాఫ్ట్‌వేర్ రంగాన్ని ఓ మలుపు తిప్పిన ప్రపంచ ప్రఖ్యాత బిల్‌గేట్స్ దోస్తులు అయ్యారు. ఇద్దరు కలిసింది చాలా తక్కువసార్లే.

అయినా టెక్నాలజీకి మించి ఇద్దరి మధ్య బోలెడు బంధం ఏర్పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు తొలిసారి బిల్‌గేట్స్‌ను కలిసే ప్రయత్నం చేశారు. అందుకు బిల్‌గేట్స్ కార్యాలయం నుంచి నో అనే సమాధానం వచ్చిన చంద్రబాబు నిరాశపడలేదు. అయినా పట్టువదలకుండా ప్రయత్నించడంతో బిల్‌గేట్స్‌ను కలిసే అవకాశం దొరికింది. కానీ చంద్రబాబుకు పదినిమిషాలు మాత్రమే సమయం ఇచ్చారు. అయినా నిరాశపడకుండా అదే సదవకాశంగా తీసుకున్న చంద్రబాబు ఉమ్మడి ఏపీ మీద తనకు ఉన్న ప్రేమను, అభివృద్ధి చేయాలనే ఆకాంక్షను, అభివృద్ధి ప్రణాళికలను బిల్‌గేట్స్ ముందు ఆవిష్కరించారు. చంద్రబాబు ప్రజెంటేషన్‌కు ముగ్ధుడైన బిల్‌గేట్స్ చంద్రబాబుకు ఇచ్చిన పదినిమిషాల సమయాన్ని మరిచిపోయారు. అలా ఇద్దరి మధ్య 45 నిమిషాల సుదీర్ఘ సమావేశం జరిగింది.

## ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రపంచ సుందరి

### యాదగిరీశుడిని దర్శించుకున్న క్రిస్టినా పిస్జ్కోవా



**యాదగిరిగుట్ట-నవభూమి:** ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరీశుడి ఆలయాన్ని మిస్ వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిస్జ్కోవా మంగళవారం దర్శించుకున్నారు. తిరువీధుల్లో అఖండ దీపారాధన చేసి కొబ్బరికాయ సమర్పించి సనాతన హిందూ ధర్మం, ఆలయ విశిష్టత, సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. గర్భాలయంలోని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. హిందూ సంప్రదాయ చీరకట్టులో ఆలయం మొత్తం కలియతిరిగి ఇక్కడి శిల్పకళా సౌందర్యాన్ని ప్రశంసించారు. ఆమెకు ఆలయ ముఖ మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా, స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని ఈవో భాస్కర్‌రావు అందజేశారు. ఆమె వెంట ఐఏఎస్ కొర్ర లక్ష్మి, ఆలయ ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రఘు, పర్యవేక్షకుడు రాజన్‌బాబు, ఎస్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్ కే.శేషగిరిరావు, తదితరులు ఉన్నారు.

## తుర్కపల్లిలో ఆది మానవుల ఆవాసాలు

**తుర్కపల్లి-నవభూమి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి గుట్టలపై ఆది మానవుల ఆవాసాలు గుర్తించామని చారిత్రక పరిశోధకుడు, జనగామ జిల్లాకు చెందిన రెడ్డి రత్నాకర్‌రెడ్డి (డిస్కవరీ మ్యాన్) తెలిపారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లిలో గుట్టలను పరిశీలించారు. తుర్కపల్లి మండల కేంద్రం దట్టమైన అడవులు, అనేక లోయలతో కూడిన ప్రాంతమని, బృహత శిలా యుగం సంస్కృతికి చెందిన ఆది మానవులు ఈ ప్రాంతంలో ఆవాసాలు ఏర్పరచుకున్నారని తెలిపారు. గుట్టలపైన విశాలమైన ఉపరితలం కలిగిన సమతుల ప్రాంతంలో బృహత శిలా యుగం నాటి నిర్మాణాలు కనిపిస్తాయని, వీటిని డాల్మెన సమాధులుగా పిలుస్తారని వివరించారు.

## ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుంది

### రైతులతో కలిసి ఎండిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



**పెనపహాడ్-నవభూమి:** ఎండిపోయిన పొలాల రైతుల ఉసురు సీఎం రేవంతరెడ్డికి తప్పక తగులుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీషరెడ్డి అన్నారు. మండలంలోని దుబ్బతండా గ్రామంలో రైతు లూనావత అనిల్‌కు చెందిన ఏడు ఎకరాల వరి పొలం, రత్యాతండాకు చెందిన భూక్యా లింగ్యా రెండు ఎకరాల వరి పొలం పూర్తిగా ఎండిపోవడంతో ఆయన మంగళవారం వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంతరెడ్డి ఎన్నికల ముందు 420హామీలు, ఆరుగ్యారెంటీ పథకాలు ఇస్తామని చెప్పి ప్రజలను మాయ చేసి గద్దెపై కూర్చుని ఇప్పుడు వాటిని అమలుపరచడంలో విఫలమయ్యారని తెలిపారు. కాళేశ్వరం, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల నుం చి సాగునీరు అందించడంలో ప్రభుత్వం అసమర్థత గా వ్యవహరించడంతో వేలాదిఎకరాలు ఎండిపోయి రైతులు తలలు పట్టుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు ఇవ్వకపోగా, రుణమాఫీ చేయకపోగా, సన్నధాన్యానికి బోనస్ అందించక, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాటలకు మోసపోయిన రైతుల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుక లా తయారైందన్నారు. రేవంతరెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కంటే కేసీఆర్ ప్రభుత్వమే బాగుందని ప్రజలు పునరాలోచనలో పడ్డారని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలో పెనపహాడ్ తో పాటు మోతె, చివ్వెంల, ఆత్మకూరు(ఎస్), సూర్యాపేటరూరల్ మండలాల్లోని గ్రామాల్లో ఏగ్రామం వెళ్లినా ఎండిపోయిన పొలాలు దర్శనమిస్తున్నాయన్నారు. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని తెలిపారు. అసెంబ్లీలో ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తే తనను సస్పెండ్ చేశారన్నా రు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న సీఎం రేవంతరెడ్డి ప్రభుత్వం పాలకులను బట్టలు ఊడదీసి కొట్టే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపగాని వెం కటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాసగౌడ్, నెమ్మాది బిక్షం,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేంధర్, వెన్న సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం

(1వపేజీ తరువాయి) చేసే బాధ్యత తీసుకుంటామన్నారు రేవంత్ రెడ్డి. ఎస్సీలలో 59 ఉప కులాలు ఉండగా.. ఆ కులాలను మూడు గ్రూపులుగా విభజించామని ముఖ్యమంత్రి తెలిపారు. మొదటి గ్రూప్ లో 15 ఉప కులాలు ఉండగా.. వారికి ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చామన్నారు. రెండో గ్రూపులో 18 ఉప కులాలకు గాను 9 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్టు స్పష్టం చేశారు. మూడో గ్రూపులో 26 ఉపకులాలు ఉంటే.. వారికి ఐదు శాతం రిజర్వేషన్ ఇస్తున్నామని సీఎం ప్రకటించారు. అలానే 2026 జనాభా లెక్కలు వచ్చిన వెంటనే దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని సీఎం హామీ ఇచ్చారు.

## మంచు లక్ష్మీ అరెస్ట్ తప్పదా..?

(1వపేజీ తరువాయి)నమోదు చేశారు. తాజాగా ఈ లిస్ట్‌లో మంచు మోహన్ బాబు కూతురు మంచు లక్ష్మీ పేరు కూడా తెర మీదకు వచ్చింది.ఆమె ఓ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తోన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో మంచు లక్ష్మీ మాట్లాడుతూ..ఇది ఒక మంచి ప్లాట్ఫారం డబ్బు సంపాదించుకోవడానికి అందరికీ చక్కగా ఉపయోగపడుతుంది అంటూ యోలో 247 అనే బెట్టింగ్ యాప్‌ని ప్రమోట్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇప్పటికే బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సినీ సెలబ్రిటీలపై పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే.దీంతో ఇప్పుడు మంచు లక్ష్మీ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసిన వీడియో బయటకు రావడంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం ఒక మైలురాయి

(1వపేజీ తరువాయి)తీసుకోలేదని ఆయన గుర్తు చేశారు.తాను 1999 నుండి ప్రతి అసెంబ్లీ సమావేశాలను ఫాలో అవుతున్నట్లు చెప్పిన ఉత్తమ్...అప్పుడు కూడా ఎస్సీ వర్గీకరణ గురించి చర్చించారని అన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దానిని నిజం చేసిందని కొనియా డారు. పంజాబ్, హర్యానా , తమిళనాడు వంటి రాష్ట్రాల నమూనాలను అధ్యయనం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం చక్కటి ప్రణాళికను రూపొందించింది.అక్కడ కూడా ఇలాంటి వర్గీకరణలు ఉన్నాయి. ప్రభుత్వం వన్ మ్యాన్ కమిషన్‌ను నియమించింది, ఇది ఎస్సీ ఉప కులాలపై సమగ్ర అధ్యయనం చేసింది.జనాభా, అక్షరాస్యత, ఉపాధి, ఉన్నత విద్యలో ప్రవేశాలు, రిక్రూట్‌మెంట్ ట్రెండ్స్, ఆర్థిక సహాయం రాజకీయ ప్రాతినిధ్యం వంటి డేటాను సేకరించిందని ఉత్తమ్ చెప్పారు.

## నేడు తెలంగాణ బడ్జెట్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రేపు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఉదయం 11.14 గంటలకు శాసనసభలో భట్టి విక్రమార్క, శాసనమండలిలో మంత్రి శ్రీధర్ బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.బుధవారం ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ సమావేశం జరగనుంది. బడ్జెట్ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండో బడ్జెట్. సుమారు రూ.3.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశముంది.

## యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. దేవాదాయ చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పద్దెనిమిది మంది సభ్యులతో యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు (వైటీడీ) ఉంటుందని వెల్లడించారు. ఈ బోర్డు పదవీ కాలాన్ని రెండు సంవత్సరాలుగా నిర్ణయించామని, బోర్డు చైర్మన్, సభ్యులకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని స్పష్టం చేశారు.

వైటీడీకి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వం ద్వారా జరుగుతుందని మంత్రి తెలిపారు. ఐఏఎస్ అధికారి ఈవోగా ఉంటారని వెల్లడించారు. వైటీడీ బోర్డు విద్యా సంస్థలను స్థాపించవచ్చు, నిర్వహించవచ్చని తెలిపారు. యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక, వేద పాఠశాలలను స్థాపించుకోవచ్చని తెలిపారు.గతంలో యాదగిరిగుట్ట భక్తులకు సరైన వసతులు లేవని ఆమె అన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం వసతులను ఏర్పాటు చేసిందని తెలిపారు. యాదగిరిగుట్టను మరింత మెరుగుపరిచేందుకే పాలక మండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏటా రూ. 100 కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు.

## తెలంగాణకు చల్లని కబురు

(1వపేజీ తరువాయి)నెలలోనే ఐదు రోజులపాటు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తెలంగాణ రాష్ట్రంలో మార్చి 21వ తేదీ నుంచి వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మార్చి 21 నుంచి 25 వరకు మొత్తం 5 రోజులపాటు వానలు పడతాయని పేర్కొంది.ఇక, నేటి నుంచి 3 రోజులపాటు ఉదయం వేళ పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం నాటి వాతావరణంలో ఎలాంటి మార్పు లేదని పేర్కొంది. ఈరోజు ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉండనున్నాయి.. అయితే, ఆ తర్వాత క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

## కృష్ణా నదీ ప్రాజెక్టులపై తెలంగాణ పిటిషన్

(1వపేజీ తరువాయి)తెలంగాణ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

## అశ్రునయనాల నడుమ చక్రయ్య అంత్యక్రియలు

**నూతనకల్-నవభూమి:** సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో సోమవారం హత్యకు గురైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్ అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య గ్రామంలో జరిగాయి. సూర్యాపేటలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని నూతనకల్ మీదుగా పోలీసు బందోబస్తు మధ్య మిర్యాలకు తరలించారు. చక్రయ్యగౌడ్ గృహంలో ప్రజల సందర్శన అనంతరం అంతిమయాత్ర ప్రారంభమైంది. ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఆయన రెండో కుమార్తె తీగల సరిత తండ్రికి తలకొరివి పెట్టి దహన సంస్కారాలు పూర్తిచేశారు.

# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

3 హైదరాబాద్ బుధవారం 19 । మార్చి । 2025





## ప్రతిపక్షాలనూ మాట్లాడనిస్తే బాగుండేది.. ప్రధాని ప్రసంగంపై ప్రియాంకాగాంధీ

**న్యూఢిల్లీ-నవభూమి:**లోక్‌సభ లో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగంపై కాంగ్రెస్ ముఖ్య నాయకురాలు ప్రియాంకాగాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన నాన్‌స్టాప్‌గా మహాకుంభమేళా పై ఆశావాద ప్రసంగం చేస్తూ పోయారని, ఇంకెవరికీ మాట్లాడే అవకాశం ఇవ్వలేదని అన్నారు. ప్రతిపక్షాలకు కూడా మాట్లాడే అవకాశం ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలకు కూడా వారు మాట్లాడాల్సిన పాయింట్స్, సెంటిమెంట్స్ ఉంటాయని ప్రియాంకాగాంధీ అన్నారు. తాము కూడా తమ అభ్రియాలను వెల్లడించాలి కదా.. అని ప్రశ్నించారు.



కనీసం రెండు నిమిషాలైనా ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇస్తే బాగుండేదని అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. మహాకుంభమేళా విజయం అందరూ కలసికట్టుగా చేసిన కృషికి నిదర్శనమని అన్నారు. ఈసందర్భంగా భారత్ గొప్పతనాన్ని ప్రపంచం మొత్తం చూసిందని అన్నారు. ఈ విజయంపై దేశ ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటర్ ఐడీతో ఆధార్ లింక్.. సీఈసీ, కేంద్ర హెూంశాఖ కార్యదర్శి కీలక భేటీ..!



**న్యూఢిల్లీ-నవభూమి:**త్వరలోనే ఓటర్ ఐడీతో ఆధార్‌ను అనుసంధించనున్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కేంద్ర హెూంశాఖ కార్యదర్శి మంగళవారం భేటీ అయ్యారు. ఈ భేటీలోనే ఓటర్ ఐడీ, ఆధార్ అనుసంధానంపై చర్చించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో ఈసీలు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషీ న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో కేంద్ర హెూంశాఖ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవో, ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 నిబంధనల ప్రకారం.. ఓటర్ ఐడీకార్డును ఆధార్‌తో అనుసంధానంపై చర్చించారు.

భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ, ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులు త్వరలో ఈ విషయంలో మరింత చర్చలు జరపాలని నిర్ణయించారు. ఇటీవల నకిలీ ఓటర్ కార్డ్ విషయంలో పార్లమెంట్‌తో పాటు బయట గందరగోళం నెలకొన్నది. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సైతం ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇటీవల ఎన్నికల సంఘం దశాబ్దాల నాటి డూప్లికేట్ ఓటరు ఐడీ నెంబర్స్ సమస్యను రాబోయే మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓటర్ ఐడీతో ఆధార్ అనుసంధానంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

## 44 ఏళ్ల నాటి దళితుల ఊచకోత కేసు.. ముగ్గురు నిందితులకు ఉరిశిక్ష విధించిన ప్రత్యేక కోర్టు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**దాదాపు 44 ఏళ్లనాటి దళితుల ఊచకోత కేసులో ఉత్తరప్రదేశ్‌లోని ప్రత్యేక కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. సామూహిక హత్యల కేసులో ముగ్గురు దోషులకు కోర్టు మరణశిక్ష విధించింది. ఇద్దరు దోషులకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు, మరో దోషికి రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. ఫిరోజాబాద్‌లోని జస్రానాలోని దిహులి గ్రామంలో 1981 నవంబర్ 24న జరిగిన 24 మంది దళితుల ఊచకోత కేసులో కోర్టు తీర్పును వెల్లడించింది. ఆ తర్వాత నిందితులను మైన్‌పురి జిల్లా జైలుకు తరలించారు.

**అప్పీల్‌కు అవకాశం..**

ఈ కేసులో నిందితులైన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంప్‌లను భారీ భద్రత మధ్య మెయిన్‌పురి జిల్లా నుంచి పోలీసులు ఉదయం 11.30 గంటలకు ఏడీజే స్పెషల్ రాబరీ ఇందిరా సింగ్ కోర్టులో హాజరు పరిచారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరపున రోహిత్ శుక్లా కోర్టు ఎదుట వాదనలు వినిపించారు. మారణహెూమం కేసులో సాక్ష్యాలను పరిశీలించి.. నిందితులకు మరణశిక్ష విధించాలని కోర్టును కోరారు. కేసులో వాదనలు విన్న కోర్టు దోషులుగా తేలిన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంపాల్‌కు మరణశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. న్యాయమూర్తి తీర్పును ప్రకటించిన తర్వాత ముగ్గురు దోషులు కోర్టులోనే విలపించారు. వారి బంధువులు సైతం కంటతడిపెట్టారు. కోర్టు నిందితులకు 30 రోజుల్లోగా మరణశిక్షకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. కోర్టు తీర్పు నేపథ్యంలో 14 రోజుల పాటు దోషులు జైలులోని క్వారంటైన్ బ్యారక్‌లో ఉండనున్నారు. సమయానికి ఆహారం తీసుకుంటున్నారా? నిద్రపోతున్నారా? అని పరిశీలిస్తారు.

**అసలు ఏం జరిగిందంటే..!**

ఫిరోజాబాద్ జిల్లాలోని జస్రానా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని దిహులి గ్రామంలో 24 మంది దళితులను ఊచకోత కోశారు. ఈ సంఘటన 1981 నవంబర్ 18న సాయంత్రం 6 గంటలకు జరిగింది. దోపిడీ దొంగలు సంతోష్, రాధే ముఠా ఆయుధాలతో దిహులి గ్రామంలోకి ప్రవేశించి.. ఓ కేసులో మహిళల, పిల్లలతో పాటు పలువురిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అంతే కాకుండా దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో 24 మంది మరణించారు. ఈ ఘటనపై దిహులికి చెందిన లాయక్ సింగ్ 1981 నవంబర్ 19న జస్రానా పోలీస్ స్టేషన్‌లో దాఖలు చేశారు. రాధేశ్యామ్ అలియాస్ రాధే, సంతోష్ సింగ్‌తో పాటు 20 మందిపై జస్రానా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు మెయిన్‌పురి నుంచి అలహాబాద్ కోర్టులో కొనసాగింది. 19 అక్టోబర్ 2024న కేసును మళ్లీ మెయిన్‌పురి సెషన్ కోర్టుకు బదిలీ చేశారు. జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు ప్రత్యేక రాబరీ కోర్టులో విచారణ జరిగింది. ఈ ఘటనలో 20 మందిపై కేసు నమోదవగా.. విచారణ సమయంలోనే 13 మంది మరణించారు.

కేసు వివరాలు..మారణం హెూమానికి పాల్పడ్డారంటూ గ్యాంగ్ లీడర్ సంతోష్, రాధేశ్యామ్.. ముఠా సభ్యులు కమ్రుద్దీన్, శ్యామ్‌వీర్, కున్వర్‌పాల్, రాజే, భూరా, ప్రమోద్ రాణా, మల్కాన్ సింగ్, రవీంద్ర సింగ్, దుర్గ్‌పాల్ సింగ్ కుమారుడు యుధిష్ఠిర్, మాన్ని సింగ్ కుమారుడు యుధిష్ఠిర్, మాన్ని సింగ్ కుమారుడు పంచమ్, లక్ష్మీ, ఇందల్, రుఖ్న్, జ్ఞానచంద్ర అలియాస్ గిన్నా, కప్తాన్ సింగ్, రాంసేవక్, రాంపాల్‌పై కేసు నమోదైంది. లక్ష్మీ, ఇందల్, రుఖ్న్, జ్ఞానచంద్ర అలియాస్ గిన్నా, కప్తాన్ సింగ్, రాంసేవక్, రాంపాల్ తప్ప అందరూ మరణించారు. కోర్టులో డెత్ రిపోర్ట్ సైతం దాఖలైంది. లక్ష్మీ, ఇందల్, రుఖ్న్, గిన్నా ఇప్పటికీ పరారీలో ఉన్నారు. ఈ కేసులో పలువురిని సాక్ష్యులుగా చేర్చారు. ఇందులో కుమార్ ప్రసాద్ సాక్ష్యం కీలకంగా మారింది. ఆయన ప్రత్యక్ష సాక్షిగా ఉన్నారు. మారణహెూమంపై ఆయన ఊచకోత, దోపిడీపై సాక్ష్యం అందించారు. ఈ ఘటన 1981 నవంబర్ 18న జరిగింది. దిహులిలో 24 మందిని అదే రోజు రాత్రి జస్రానా కోర్టులో కేసు నమోదైంది. 1982 ఫిబ్రవరి 26 వరకు ప్రధాన నిందితులు రాధే, సంతోష్ సహా 15 మంది నిందితుల అరెస్టు అయ్యారు. 1982 ఫిబ్రవరి 26న కోర్టులో చార్జిషీట్ దాఖలైంది. 1982 మే 13న కోర్టులో నిందితులపై అభియోగాలు మోపారు. 1982 మే 13న హైకోర్టు ఆదేశాల మేరకు కేసు ప్రయాగ్‌రాజ్ సెషన్ కోర్టుకు బదిలీ అయ్యింది. 19 అక్టోబర్ 2024న కేసును మళ్లీ మెయిన్‌పురి సెషన్ కోర్టుకు బదిలీ చేశారు. తాజాగా ముగ్గురు దోషులకు కోర్టు మరణశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించింది.

## నాగ్‌పూర్‌లో అల్లర్లు ప్లాన్ ప్రకారమే జరిగాయి.. వీటంతటికీ కారణం అదే..: మహారాష్ట్ర సీఎం



**న్యూఢిల్లీ-నవభూమి:**నాగ్‌పూర్‌లో సోమవారం రోజు జరిగిన హింసాత్మక ఘటనలు, అల్లర్లతో తీవ్ర దుమారం రేగుతోంది. ఈ హింసను పథకం ప్రకారమే చేశారంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి బాంబ్ పేల్చారు. ముఖ్యంగా మొఘల్ చక్రవర్తి ఔరంగాజేబుపై ప్రజలు కోపం పెంచుకోవడానికి కారణం.. ఛావా సినిమానే అని తేల్చి చెప్పారు. అలాగే మహారాష్ట్ర ప్రజలంతా సహనంగా ఉండి.. రాష్ట్రంలో శాంతిని కాపాడాలని అసెంబ్లీ సాక్షిగా కోరారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలంటూ కొందరు ప్రజలు చేస్తున్న గొడవ దేశ వ్యాప్తంగా చర్చకు కారణం అవుతుంది. నేరుగా ప్రభుత్వానికి ఔరంగజేబు సమాధి తొలగించాలంటూ హిందూ సంఘాలు లేఖ రాశాయి. దీంతో మహారాష్ట్ర సర్కారు అక్కడ భద్రతను పెంచగా.. సోమవారం సాయంత్రం కొందరు నిరసన చేపట్టారు. ఈ క్రమంలోనే హింసాత్మక ఘర్షణలు చోటు చేసుకోగా.. 30కి పైగా వాహనాలు నిప్పంటించి మరీ ధ్వంసం చేశారు. ముఖ్యంగా కొన్ని అల్లరి మూకలు పోలీసులపైకి రాళ్లు రువ్వగా.. 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పోలీసులు సైతం నిరసన కారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఆపై 60 మంది ఆందోళన కారులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే నగరంలోని అనేక ప్రాంతాల్లో సెక్షన్ 144 విధించారు. ఇదంతా ఇలా ఉండగా నాగ్‌పూర్ హింసపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అసెంబ్లీలో మాట్లాడుతూ షాకింగ్ కామెంట్లు చేశారు. నాగ్‌పూర్‌లో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ నిరసనలు చేశాయని.. ఆ తర్వాతే కొందరు నిరసన కారులు వాహనాలను తగులబెట్టారని చెప్పారు. ఇదంతా చూస్తుంటే ప్లాన్ చేసే దాడికి పాల్పడినట్లు అర్థం అవుతుందన్నారు.

శాంతి భద్రతలను తమ చేతుల్లోకి తీసుకోవడానికి ఎవరికీ అనుమతి లేదని.. పోలీసులపై దాడులను అస్సలే సహించబోమని సీఎం వెల్లడించారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఇలాంటి దారుణం అయిన సంఘటనలను ఇంతకు ముందెన్నడూ చూడలేదని అన్నారు. ఛావా సినిమానే ప్రజల్లో.. ముఖ్యంగా మరాఠీల్లో ఔరంగాజేబుపై కోపాన్ని పెంచిదన్నారు. ఏది ఏమైనా ప్రజలంతా సహనంగా ఉండి.. రాష్ట్రంలో శాంతిని కాపాడాలని కోరారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా ఈ హింసాత్మక ఘటనను ప్రమాళిక బద్ధమైన కుట్రగా అభివర్ణించారు.

## ఆ విషయంలో మోదీ, ట్రంప్ ఆలోచనలు సేమ్..: తులసీ గబ్బార్డ్



**న్యూఢిల్లీ-నవభూమి:**అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అమెరికాకు తొలి ప్రాధాన్యం విధానాన్ని కేవలం యూఎస్ మాత్రమే ఎదగడానికి కాదని.. ఈ విషయంలో తమను అపార్థం చేసుకోవద్దని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరుగుతున్న 10వ రైసీనా డైలాగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ కామెంట్లు చేశారు. ముఖ్యంగా భారత ప్రధాని మోదీ, ట్రంప్ ఆ విషయంలో సేమ్ టు సేమ్ ఆలోచిస్తారని చెప్పారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడూ శాంతిని ఆకాంక్షిస్తూ.. ఐక్యత సాధించాలనే తాపత్రయం కల్గిన వ్యక్తి అని తులసీ గబ్బార్డ్ వ్యాఖ్యానించారు. అచ్చం ఆయనలాగే భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా శాంతి పునరుద్ధరణ కోసం కట్టుబడి ఉన్నారని వివరించారు. ఈ విషయంలో ఇద్దరు నేతలు సేమ్ టు సేమ్ అనిపిస్తారని చెప్పుకొచ్చారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజులకే ప్రధాని మోదీ వాషింగ్టన్ పర్యటన చేపట్టడం వారి మధ్య ఉన్న స్నేహ బంధంతో పాటు వారి ప్రాధాన్యాలను చాటి చెబుతుందని వెల్లడించారు.ఇరు దేశాల ప్రయోజనాల కోసం.. మోదీ, ట్రంప్‌లు ఉత్తమ సేవలు అందించాలని కృత నిశ్చయంతో ఉన్నారని తులసీ గర్బార్డ్ స్పష్టం చేశారు. అంతేకాకుండా అమెరికా ఫస్ట్ నినాదాన్ని తప్పుగా అర్థం చేసుకోవద్దని.. ట్రంప్ విధానాలను కొందరు తప్పుగా ఊహించుకుంటున్నారని అన్నారు. ఆయన ఇతర దేశాలతో ఘర్షణలు పెంచుకోవాలని భావిస్తున్నట్లు కూడా కొందరు అభిప్రాయ పడుతున్నారని చెప్పారు. కానీ ట్రంప్ అలాంటి వ్యక్తి కారని.. సమస్యను శాంతి యుతంగా పరిష్కరించుకోవడానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారని తులసీ గబ్బార్డ్ వెల్లడించారు.ఇదంతా ఇలా ఉండగా.. ప్రపంచ ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై చర్చిండానికి మూడు రోజుల పాటు నిర్వహించే 10 రైసీనా డైలాగ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి అనేక దేశాలకు చెందిన నేతలు వచ్చారు. ముఖ్యంగా న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సాన్, అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసీ గబ్బార్డ్, ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహాతో పాటు 125 దేశాలకు చెందిన 3500 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పెంపుడు కుక్కను కాపాడేందుకు చిరుత పులితో ఓనర్ ఫైట్.. చివరకు ఎవరు గెలిచారంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**అతడో సైకాలజిస్ట్. భార్యా పిల్లలతో హాయిగా జీవిస్తున్న అతడు ఓ కుక్కను కూడా పెంచుకుంటున్నాడు. సొంత బిడ్డలాగే సాకుతుండగా.. అనుకోకుండా ఆదివారం రోజు వారి ఇంటికి ఓ చిరుత పులి వచ్చింది. ఈక్రమంలోనే బయట ఉన్న కుక్కపై దాడి చేయబోయింది. దీంతో శునకం మొరగడం ప్రారంభించగా.. వెంటనే ఓనర్ సైకాలజిస్ట్ అక్కడకు చేరుకున్నాడు. పులిని చూసి భయంతో పరుగులు పెట్టకుండా.. తన పెంపుడు కుక్కను కాపాడుకోవడానికి ప్రయత్నించాడు. దాదాపు 15 నిమిషాల పాటు పులితో పోరాటం చేశాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియాలంటే మీరు ఈ కథ చదివేయాల్సిందే.మహారాష్ట్ర రత్నగిరి చిప్లున్ ప్రాంతంలో.. 55 ఏళ్ల ఆశిష్ మహాజన్ నివాసం ఉంటున్నాడు. అయితే అతడు సైకాలజిస్ట్ కాగా గతంలో పూణేలో ఉంటూ అక్కడే పని చేసేవాడు. కానీ ప్రశాంతమైన జీవితం గడపాలనే కోరికతో.. చిప్లున్ ప్రాంతానికి మకాం మార్చాడు. భార్యా పిల్లలతో పాటు ఇక్కడే కలిసి ఉంటూ హాయిగా జీవిస్తున్నాడు. అయితే మొదటి నుంచి కుక్కలు అంటే ఇష్టం ఉండగా.. ఓ శునకాన్ని కూడా పెంచుకుంటున్నాడు ఆశిష్ మహాజన్. కుక్కను కూడా సొంత బిడ్డలాగే చూసుకుంటూ.. ప్రేమను పంచుతున్నాడు.

ఇదంతా బాగానే ఉండగా.. మార్చి 16వ తేదీ ఆదివారం రోజు అనుకోకుండా వీరి ఇంటికి ఓ చిరుత పులి వచ్చింది. ఈక్రమంలోనే బయట ఉన్న పెంపుడు శునకాన్ని చూసి దానిపై దాడి చేయబోయింది. కానీ కుక్క విపరీతంగా మెరగడంతో.. ఆశిష్ మహాజన్ బయటకు వచ్చారు. టార్చి లైట్ వేసి మరీ ఏం జరుగుతుందో చూశారు. ముఖ్యంగా అక్కడ ఓ చిరుత పులి ఉండడం గమనించారు. తన ప్రాణాలు కాపాడుకోవడానికి భయంతో పరుగులు పెట్టకుండా.. తన పెంపుడు శునకాన్ని కాపాడాలని నిర్ణయించుకున్నారు.

ఈక్రమంలోనే తలుపులు తీసి బయటకు వచ్చి మరీ పులిపై దూకారు. పులి కూడా ఆశిష్ మహాజన్‌పై దాడి చేసింది. అయితే చప్పుడు ఎక్కువ కావడంతో.. ఆశిష్ మహాజన్ భార్య సుప్రియ అక్కడకు వచ్చారు. పులిని చూసిన వెంటనే.. ఇంట్లో ఉన్న ఓ పదునైన ఈటెను విసిరారు. అది అందుకున్న ఆశిష్ మహాజన్.. పులిపై దాంతో దాడి చేశారు. ముఖ్యంగా మెడ, ఛాతీపై గుచ్చారు. తీవ్ర గాయాలపాలైనా ఇంటి ఆవరణ ఇరుకుగా ఉండడంతో చిరుత పులికి పారిపోయే అవకాశం లేకపోయింది. దీంతో ఓనర్‌పై దాడికి పాల్పడుతూనే వచ్చింది.ఇలా పదే పదే దాడి చేయగా.. ఆశిష్ మహాజన్ గట్టిగా ఈనెను దాని ఒంట్లోకి దింపాడు. దీంతో చిరుత పులి అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయింది. అయితే ఈ పోరాటంలో ఆశిష్ మహాజన్‌కు కూడా గాయాలు కాగా.. అతడి భార్య సుప్రియ వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆశిష్ పరిస్థితి నిలకడగానే ఉండగా.. గాయాలకు చికిత్స అందిస్తున్నామని వైద్యులు చెబుతున్నారు. మరోవైపు పులిని చంపిన విషయం గురించి స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా.. హుటాహుటిన రంగంలోకి దిగారు. ముఖ్యంగా చిరుత పులి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అది రెండేళ్ల వయసు కల్గిన ఆడ చిరుత పులి అని చెప్పారు. అంతేకాకుండా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశిష్ మహాజన్ ఆస్పత్రి ఖర్చులు కూడా తామే భరిస్తామని రత్నగిరి డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ గిరిజా దేశాయ్ పాటిల్ వెల్లడించారు. అంతేకాకుండా ఈ ప్రాంత ప్రజలంగా చాలా జాగ్రత్తగా ఉండాలని.. అటవీ ప్రాంతానికి దగ్గర్లోనే ఈ గ్రామం ఉండడం వల్ల ఇలాంటి ఘటనలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.

## సుదీక్ష కోణంకి కేసులో షాకింగ్ ట్విస్ట్.. తమ కుమార్తె చనిపోయిందని ప్రకటించమంటూ తల్లిదండ్రుల అభ్యర్థన



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత సంతతికి చెందిన అమెరికా విద్యార్థిని సుదీక్ష కోణంకి కరేబియన్ దేశానికి విహార యాత్ర కోసం వెళ్లి.. అక్కడే అదృశ్యం అయిన విషయం అందరికీ తెలిసిందే. ఈ కేసు ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపుతుండంగా.. పోలీసులు ఆమె కోసం ఇంకా గాలిస్తూనే ఉన్నారు. ఈక్రమంలోనే ఆమె తల్లిదండ్రులు షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా తమ కుమార్తె కనిపించకుండా పోయి 12 రోజులు కావొస్తుండగా.. ఆమె చనిపోయినట్లు ప్రకటించాలని డొమినికన్ అధికారులను కోరుతున్నట్లు అక్కడి మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి. ముందు నుంచి తమ కూతురు కిడ్నాప్ అయిందేమోనని అనుమానం వ్యక్తం చేసిన ఆమె తల్లిదండ్రులే ఈ కామెంట్లు చేయడంతో అంతా షాక్ అవుతున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.అమెరికాలోని వర్జీనియాకు చెందిన 20 ఏళ్ల సుదీక్ష కోణంకి.. ఐదుగురు స్నేహితురాళ్లతో కలిసి ఇటీవలే విహార యాత్ర కోసం డొమినికా రిపబ్లిక్ దేశానికి వెళ్లింది. అక్కడే ప్యూంటా కానా పట్టణానికి వెళ్లిన ఆమె మార్చి 6వ తేదీన రియా రిపబ్లికా రిసార్ట్ వద్ద చివరి సారిగా కనిపించింది. తెల్లవారుజాము 3 గంటల వరకు స్నేహితులంతా కలిసి అక్కడే పార్టీ చేసుకోగా ఆ తర్వాత అందరూ హెూటల్‌కు వెళ్లిపోయారు. కానీ సుదీక్ష కోణంకి ఎంతకూ తిరిగి రాకపోవడంతో స్నేహితులంతా వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ముఖ్యంగా సుదీక్ష కోణంకి తల్లిదండ్రులు.. తమ కూతురు కిడ్నాప్ అయిందేమోనని అనుమానంగా ఉందని పోలీసులకు తెలిపారు. దీంతో అధికారులు సైతం డ్రోన్లు, హెలికాప్టర్ల సాయంతో సముద్రంలో వెతికి.. కిడ్నాప్‌కు గురైందేమోనన్న కోణంలో కూడా దర్యాప్తు చేశారు. ఈక్రమంలోనే షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా రెండ్రోజుల క్రితమే బీచ్ వద్ద ఆమె బట్టలు, చెప్పులు దొరకగా.. అవి ఆమెవే అని స్నేహితులు కూడా గుర్తించారు. అలాగే వారంతా పార్టీ చేసుకున్న ఓ బార్ సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా.. సుదీక్ష కోణంకి తన సీనియర్ అయిన 24 ఏళ్ల జాషువా స్టీవెన్ రిబెత్ కోలిసి బీచ్‌కు వెళ్లినట్లు గుర్తించారు. ఈక్రమంలోనే అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు.అయితే మార్చి 6వ తేదీ రోజు తామిద్దరం కలిసే బీచ్‌కు వెళ్లామని.. సుదీక్షతో పాటు తాను కూడా ఉన్నట్లు రిబె అంగీకరించాడని పోలీసులు చెప్పారు. కానీ బీచ్‌లో ఉండగా.. ఓ పెద్ద అల వారిని బలంగా తాకిందని, దాంతో తాను స్పృహ తప్పి పడిపోయాడని చెప్పినట్లు తెలిపారు. ఆ తర్వాత ఏం జరిగిందో అతడికి తెలియదని కూడా వెల్లడించారు. రిబె నిజమే చెప్పాడని.. అతడి తప్పేమీ లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈక్రమంలోనే సుదీక్ష తల్లిదండ్రులు దీనిపై స్పందించారు. ముఖ్యంగా ఈ కేసులో అధికారులు చేస్తున్న దర్యాప్తును తాము పూర్తిగా విశ్వసిస్తున్నామని వివరించారు.తమ కుమార్తె మృతిని అధికారికంగా ప్రకటించాలని.. సుదీక్ష మరణం విషయంలో ఎవరిపైనా అనుమానం లేదని వెల్లడించారు. అయితే మృతిని అధికారికంగా ప్రకటించడానికి కొన్ని చట్టపరమైన విధానాలను అనుసరించాల్సి ఉంటుందని అర్థం చేసుకున్నామని చెప్పారు. అలాగే ఈ విషయంలో అధికారులకు తాము పూర్తిగా సహకరిస్తామని లేఖలో పేర్కొన్నారు.

## ఒకరిని గదిలో పడేసి నలుగురు బెల్టులతో దాడి.. ఇన్‌స్టాలో వీడియో పెట్టిన నిందితులు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**ఓ గదిలో ఓ వ్యక్తిని కింద పడేసి నలుగురు వ్యక్తులు అతడిని తీవ్రంగా కొట్టారు. కింద పడిన వ్యక్తి చుట్టూ చేరి నలుగురు బెల్టుల తో, ప్లాస్టిక్ పైపుల తో చితకబాదారు. బాధితుడు తనను కొట్టవద్దని, విడిచిపెట్టండని వేడుకుంటున్నా ఆ నలుగురు వినిపించుకోలేదు. నాన్‌స్టాప్‌గా కొట్టారు. నలుగురు కొడుతుంటే మరో నిందితుడు ఈ తతంగాన్ని అంతా వీడియో తీశాడు. ఆ వీడియోను జతిన్ అనే ఇన్‌స్టా యూజర్ తన ఖాతాలో పోస్టు చేశాడు. దాంతో ఆ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఉత్తర ప్రదేశ్‌లోని ఔరారియా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి పాల్పడిన వ్యక్తుల తీరు పై నెటిజన్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటన పై పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. అయితే ఈ ఘటనపై తమకు ఇంతవరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

## తుపాకీతో బెదిరించి వ్యాపారి నుంచి రూ.80 లక్షలు దోపిడీ..




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధాని ఢిల్లీ లో నేరాలు పెరిగిపో తున్నాయి. దోపిడీలు, దొంగత నాలు, అత్యాచారాలు, హత్యలతో ఎప్పుడూ ఢిల్లీ పేరు వార్తల్లో వినిపిస్తూనే ఉంది. తాజాగా అక్కడ మరో భారీ దోపిడీ ఘటన చోటుచేసుకుంది. ఓ దొంగ ఒక వ్యాపారి నుంచి రూ.80 లక్షలు దోచుకుపోయాడు. మార్కెట్‌లో అందరూ చూస్తుండగా దొంగ తన పని పూర్తిచేసుకుని ఉడాయించాడు.వ్యాపారి బ్యాగులో రూ.80 లక్షలు ఉన్నాయని పసిగట్టిన దొంగ.. బ్యాంకు దగ్గరి నుంచి అతడిని అనుసరించాడు. చాందిని చౌక్‌లోని ఓ ఇరుకు రోడ్డులోకి వెళ్లిన తర్వాత తుపాకీతో కాల్పులు జరుపుతూ వ్యాపారి నుంచి బ్యాగు లాక్కున్నాడు. ఆ దొంగ వ్యాపారిని టార్గెట్ చేయకుండా నేలపై కాల్పులు జరుపుతూ వ్యాపారిని భయపెట్టాడు. బ్యాగు లాక్కున్న తర్వాత అందులో నుంచి రూ.80 లక్షలు తీసుకుని బ్యాగు అక్కడే పడేసి పారిపోయాడు.ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలన్ని అక్కడున్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఒక నిమిషంలో ముగిసిన ఈ దోపిడీ ఘటనను చూస్తూ అక్కడున్న వాళ్లు ప్రేక్షకపాత్ర వహించారు. అడ్డుకుంటే దుండగుడు ఎక్కడ తమపై కాల్పులు జరుపుతాడోనని వారు భయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వీడియోలో ఒక్కరే కనిపిస్తున్నా ఈ దోపిడీలో మొత్తం ఆరుగురి పాత్ర ఉన్నట్లు గుర్తించారు. దుండగుడు బ్యాగు గుంజుకుని బయటికి వెళ్లిన తర్వాత ఆరుగురు బైకులపై పారిపోయారని చెప్పారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

## వేల మందిని బలిగొన్న ఆ ఆక్రమణదారులను పొగడటం దారుణం : రాజస్థాన్ మంత్రి



**నాగ్‌పూర్-నవభూమి:**నాగ్‌పూర్ లో హింసాత్మక ఘటనలపై రాజస్థాన్ మంత్రి మదన్ దిలావర్ స్పందించారు. జాతీయవాదులు, దేశంపై భక్తి ఉన్న వాళ్లు ఎవరైనా నాటి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుసమాధిని కూల్చివేయాలని డిమాండ్ చేస్తారని ఆయన అన్నారు. ఔరంగజేబు, బాబర్ అక్బర్ అంతా ఆక్రమణదారులను, వేల మందిని హతమార్చిన హంతకులని విమర్శించారు. అలాంటి హంతకులను పొగడటం కరెక్టు కాదని దిలావర్ వ్యాఖ్యానించారు. ఇలాంటి ఆక్రమణదారులు, దోపిడీదారులు, గూండాల గుర్తులు, జ్ఞాపకాలను కచ్చితంగా తుడిచివేయాల్సిందేనని అన్నారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నగరంలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు వైరి వర్గాల మధ్య అక్కడ హింసాత్మ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో రాజస్థాన్ మంత్రి పైవిధంగా స్పందించారు.

## దుకాణాలపై పేర్లు తమిళంలో ఉండాల్సిందే..




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో జాతీయ విద్యా విధానంలోని (ఎన్ఈపీ-2020) త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోన్న విషయం తెలిసిందే. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాలని కేంద్రం స్పష్టం చేస్తోంది. మూడింట్లో రెండు భారతీయ భాషలు ఉండాలని చెబుతోంది. అయితే, కేంద్రం నిర్ణయంపై కొన్ని రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. హిందీని బలవంతంగా రుద్దడం ఏంటని..? మండిపడుతున్నాయి. ఈ విషయంలో ముఖ్యంగా కేంద్రం, తమిళనాడులోని అధికార డీఎంకే మధ్య గత కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ వివాదం వేళ కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది.



## షాకింగ్.. అహ్మదాబాద్‌లో 100 కిలోల బంగారం పట్టివేత

**గుజరాత్-నవభూమి:** గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో భారీగా బంగారం పట్టుబడింది. ఏటీఎస్ పోలీసులు, డీఆర్ఐ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అహ్మదాబాద్‌లోని పాల్డి ప్రాంతంలో గల ఓ ఇంట్లో దాదాపు 100 కిలోలకుపైగా బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా పెట్టిన పోలీసులు.. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. స్మగ్లింగ్ చేసిన పసిడిని పాల్డి ప్రాంతంలో గల అవిష్కార్ అపార్ట్‌మెంట్ (లో దాచిపెట్టినట్లు గుర్తించారు. ఈ మేరకు రైడ్స్ చేసిన 107 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో 88 కేజీలు బంగారు కడ్డీలు, 19.66 కిలలో ఆభరణాలు ఉన్నాయి. పట్టుబడిన ఈ బంగారం విలువ మార్కెట్లో రూ.100 కోట్లకుపైమాటే అని అధికారుల అంచనా. బంగారంతోపాటు రూ.2 కోట్ల నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## విద్యా సంక్షోభాన్ని కనీసం గుర్తించండి!

రాబోయే బడ్జెట్‌లో తెలంగాణలో గ్రామ గ్రామాన, పట్టణాలలోని వివిధ బస్తీలలోను విద్యకు పెద్దపీట వేయాలని గత నెల రోజులుగా విద్యార్థులు, తల్లిదండ్రులు రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డుల రూపంలోను సంతకాల సేకరణ ద్వారాను ప్రజా అభిప్రాయాన్ని సమీకరిస్తున్నారు. మరోవైపు విద్యా ప్రేమికులు, బుద్ధిజీవులు, ప్రొఫెసర్లు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు, తల్లుల సంఘాలు... వీరంతా సభలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అంతేగాక తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో కమిషన్ సభ్యులు ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా కలిసి విద్యా వ్యవస్థ మెరుగు కోసం నిధులను పెంచవలసిన ఆవశ్యకత గురించి ఒక నివేదికను సమర్పించిన విషయం తెలిసిందే. ఈ మధ్య జరిగిన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కమిషన్ సభ్యుడు రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పెద్దలు విద్య మీద చేస్తున్న ప్రకటనలు చూస్తే రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభంపై వారికి పూర్తిగా అవగాహన ఉన్నట్లు కనిపించదు. ప్రభుత్వ విద్య నిర్వీర్యం కావడానికి గత కొన్నేళ్ళుగా బడ్జెట్లలో దానికి సరిపడా నిధులు కేటాయించక పోవడమే కారణం అని ప్రభుత్వం ఇకనైనా గుర్తించాలి. ప్రభుత్వ విద్య బాగుపడే పరిస్థితి కానీ బాగుపరిచే రాజకీయ సంకల్పం కానీ కనుచూపు మేరలో కనిపించకనే పేద తల్లిదండ్రులు ప్రైవేటు బడుల బాట పట్టారనటానికి ప్రభుత్వ గణాంకాలే ఋజువు. 2023-24 యుడైస్ లెక్కల ప్రకారం ప్రభుత్వ బడిలో కేవలం 26 లక్షల మంది (43శాతం) విద్యార్థులు చదువుతుంటే, ప్రైవేటు బడులలో 34లక్షల మంది (57శాతం) చదువు"కొంటున్నారు". అదే ఏడాది ఒకటవ తరగతి చేరికలు చూసినట్లయితే దాదాపు 66శాతం మంది విద్యార్థులు ప్రైవేటు బడులలో చేరారు. ఇక పట్టణాలలో విపరీతంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ బడులను ఏర్పాటు చేయకపోవడం వల్ల హైదరాబాద్‌లో 81శాతం, మేడ్చల్‌లో 85శాతం, రంగారెడ్డిలో 70శాతం మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇలా ప్రైవేటు బడులకు పంపుతున్నవారిలో అధికశాతం ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబాలు కావు. ఈ ధోరణి ఒక్క రోజులో మారింది కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నుండే మొదలైంది. రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా కొనసాగుతున్నది. దీనికి రుజువు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి ఏటా తగ్గింపులే. తెలంగాణ ఏర్పడిన మొదటి సంవత్సరం విద్యకు 10శాతం కేటాయించారు. అలా మొదలైన తగ్గింపు, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ గత తొలి బడ్జెట్ వరకు కొనసాగుతూనే ఉన్నది. తక్కువ నిధుల వల్ల విద్యా ప్రమాణాలు మరింతగా దిగజారుతున్నాయి. గత సంవత్సరం బడ్జెట్ (2024-25)లో విద్యకు రూ.21,292వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది బడ్జెట్‌లో 7.3శాతం మాత్రమే. ఇందులో పాఠశాల విద్యకు కేటాయించింది రూ.17,942వేల కోట్లు (6.2శాతం) మాత్రమే. ఇన్ని వేల కోట్లు కేటాయించినట్లు కనిపించినా అందులో దాదాపు రూ.15వేల కోట్లు సిబ్బంది జీతాలకే ఖర్చు అవుతున్నాయి. ఇక మౌలిక సదుపాయాల కల్పనకు, పర్యవేక్షణకు, పాఠశాలలో వినూత్న ప్రయోగాలకు, పోటీ ప్రపంచంలో అవసరమైన కంప్యూటర్‌లకు, కృత్రిమ మేధకు సంబంధించిన పాఠ్యాంశాల బోధనకు సరిపడా నిధుల కొరత స్పష్టంగా కనిపిస్తున్నది. పోనీ ఇన్ని వేల కోట్ల జీతాలు చెల్లిస్తున్న ఉపాధ్యాయులతో కేవలం బోధనే చేయిస్తున్నారా అంటే అదీ లేదు. వారికి పలు బోధనేతర పనులు అప్పగిస్తున్నారు. ఇక పర్యవేక్షణ అధికారులు సంవత్సరాల తరబడి లేరు. ఉన్న ప్రధాన ఉపాధ్యాయులకు బోధన పని నుంచి ఉపశమనం కల్పించి పర్యవేక్షణ అధికారిగా అదనపు డ్యూటీ వేశారు. ఇవిగాక పదవీ విరమణ పొందిన టీచర్ల స్థానంలో మరో టీచర్ రావడంలో జాప్యం, వెనుకబడిన ప్రాంతాలలో ఉపాధ్యాయుల కొరత, గ్రామంలో ఉన్న విద్యార్థులకు అనుగుణంగా కాకుండా తగ్గిన విద్యార్థుల నమోదును బట్టి టీచర్ల నియామకం వంటి సమస్యలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో విద్య గురించి చర్చ జరిగినప్పుడల్లా రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చర్చను అటువైపు మళ్లించేది. ప్రస్తుత ప్రభుత్వం కూడా 20 ఎకరాలలో ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటిస్తున్నాయి. పనులు సాగుతున్నాయి కూడా. దాదాపు 1000 గురుకుల పాఠశాలలు కల్పించిన మాట వాస్తవమే. కానీ విద్యార్థులకు విద్యను అందించడానికి గురుకుల పాఠశాలలు ప్రత్యామ్నాయం కాదని పాలకులు గుర్తించాలి. కుటుంబంలో మొదటితరం చదువు వైపు వచ్చిన విద్యార్థులకు, ఆదరణ కరువైన పిల్లలకు గురుకులాలు నిర్వహించాలి. అంతే కానీ రాష్ట్రంలో ఉన్న 60 లక్షల మంది పిల్లలకు విద్యను అందించే సామర్థ్యం వాటికి లేదు. అంతకంతకూ తగ్గుతున్న బడ్జెట్ కేటాయింపులను బట్టి ప్రభుత్వం తమ పిల్లలకు చదువు చెప్పదలచుకోవడం లేదన్న అభిప్రాయానికి సమాజం చేరుకున్నది. అందువల్ల ప్రైవేటు బడులవైపు మొగ్గుచూపక తప్పలేదు. స్తోమత ఉన్నవాళ్ళకు ప్రైవేటు బడులతో ఇబ్బంది లేదు. కానీ రోజు కూలీలు, చిన్న వ్యవసాయ కుటుంబాల వారు, కౌలు రైతులు, పట్టణాలలో పేద బస్తీలలో నివసించే అసంఘటిత రంగ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలలో ఉన్న అతిపేదలు తల తాకట్టు పెట్టి మరీ తమ పిల్లలను ప్రైవేటు బడులకు పంపిస్తున్నారు. జూన్ నెల రాగానే కుటుంబాలలో ఒక గుబులు. పోయిన సంవత్సరం ఫీజుల బాకీతో సహా ప్రస్తుత సంవత్సరం ఫీజులు కట్టాలనే ఒత్తిడి. అందరిముందూ పిల్లలను అగౌరవపరిచే ప్రైవేటు బడుల దుస్సంప్రదాయాలు. ఇవన్నీ భరిస్తూ ఆ పేద కుటుంబాలు ఒక్కో విద్యార్థి మీద పెడుతున్న ఖర్చు లెక్కేస్తే ప్రభుత్వ విద్యా బడ్జెట్ కన్నా అధికంగానే ఉంటుంది. ఇన్ని కష్టాలు పడినా ప్రైవేట్ బడులలో నాణ్యమైన విద్య అందుతుందా అంటే అదీ లేదు! రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు బడ్జెట్లలో సరిపడా నిధులు కేటాయించకపోవటం వల్ల విద్యా వ్యవస్థ నేడు అతిపెద్ద సంక్షోభ దశకు చేరుకున్నది. ఈ సంక్షోభం నుండి బయటపడడానికి, తల్లిదండ్రులలో ప్రభుత్వ విద్య పట్ల సన్నగిల్లిన విశ్వాసాన్ని పెంచడానికి, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు 15శాతం బడ్జెట్‌ను కేటాయిస్తామన్న తమ హామీని నిలబెట్టుకోవాలి. 2025-26 బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేసి విద్య పట్ల రాజకీయ సంకల్పాన్ని ఋజువు చేసుకోవాలి.

# సేంద్రీయ సేద్యం - భవిష్యత్తు భద్రం





భారత దేశంలో 4000 సంవత్సరాల క్రితమే సేంద్రీయ సాగుకు సంబంధిన ఆధారాలు లభించాయి, బ్రిటిష్ వారి కాలంలో వ్యవసాయ స్వరూపం పూర్తిగా మారి కృత్రిమ ఎరువుల, యంత్రాల వాడకం మొదలైనది. భారతదేశంలో హరిత విప్లవం తరువాత వీటి వాడకం బాగా పెరిగింది.

ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల స్థానంలో సేంద్రీయ సాగు వైపు మొగ్గు చూపుతున్నాయి, సంప్రదాయ సాగులో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం ఎక్కువగా వుంటుంది అదే కాకుండా వ్యవసాయ అవసరాల కోసం ఎక్కువగా బాహ్య వనరులపై ఆధారపడడం , పనిముట్లు, యంత్రాల వినియోగం వల్ల వ్యయం అధికం కావడం వంటివి జరుగుతాయి, ఇంకా పర్యావరణం, జీవ వైవిధ్యం, నేల సారవంతతపై అత్యంత ప్రతికూల ప్రబావం చూపుతుంది...

ది వరల్డ్ అఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్ 2025 వార్షిక నివేదిక ప్రకారం..

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 9.9కోట్లహెక్టార్ల విస్తీర్ణంలో సేంద్రీయ సాగు జరుగుతోంది. 43 లక్షల మంది సేంద్రీయ రైతులు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వున్నారు అందులో అత్యధికంగా 24లక్షల మంది భారతదేశంలోనే వున్నారు.. తరువాతి స్థానాల్లో ఉగాండా (5లక్షలు), ఇథియోపియా (2లక్షలు) వున్నాయి విస్తీర్ణం పరంగా 5.3 కోట్ల హెక్టార్లతో ఆస్ట్రేలియా మొదటి స్థానంలో, 4.5లక్షల హెక్టార్లతో ఇండియా రెండో స్థానంలో వుంది. సేంద్రీయ ఉత్పత్తుల వినియగంలో అమెరికా, యురోపియన్, కెనడా, బ్రిటన్, స్విట్జర్లాండ్, టర్కీ వంటివి ముందు వరసలో వున్నాయి .భారతదేశంలో ప్రస్తుతం సేంద్రీయ పద్ధతులను అవలబించే సర్టిఫికేషన్ కలిగిన భూమి వైశాల్యం 10.17 మెగా హెక్టార్లుగా వుంది వీటి నుండి 2.9 మిలియన్ మెట్రిక్ టన్నుల సర్టిఫైడ్ సేంద్రీయ ఆహార పదార్థాలను ఉత్పత్తి చేస్తున్నారు వీటిలో ఎక్కువగా ఆహార ధాన్యాలు, చెరుకు, నూనే గింజలు, పత్తి, సుగంధ ద్రవ్యాలు, ఔషద మొక్కలు, కాఫీ, టీ, పండ్లు, డ్రై ఫ్రూట్స్ వంటివి వున్నాయి..

భారత దేశంలో సేంద్రీయ ఉత్పత్తులలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక ఒడిస్సా వంటి రాష్ట్రాలు మొదటి వరసలో వున్నాయి ..

సేంద్రీయ సాగులో ఈశాన్య రాష్ట్రాలు ముందుంటాయి 2016 లో సిక్కం ప్రపంచంలోనే తోలి సేంద్రీయ రాష్ట్రంగా నిలిచింది, వారి తెగలలో పూర్వ కాలం నుంచే సేంద్రీయ సాగుపై మక్కువ ఎక్కువగా ఉంటుంది.. సమస్త జీవకోటి మనుగడకి భూమే ఆధారం అలాంటి భూమిని, పంటలలో అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందులు వాడి విషతుల్యం చేస్తున్నారు దాని వలన భూసారం తగ్గి, భూమి కలుషితమై, నీటి కాలుష్యం, పర్యావరణ కాలుష్యము జరిగి, ఆరోగ్య సమస్యలు పెరిగాయి. వీటికి ప్రత్యామ్నాయంగా సేంద్రీయ వ్యవసాయం (ఆర్గానిక్ ఫార్మింగ్) అనేది ఎంతో ఉపయోగకరంగా మారింది..

**సేంద్రీయ వ్యవసాయం అంటే ఏమిటి?**

సేంద్రీయ వ్యవసాయం అనేది రసాయనిక ఎరువులు, పురుగుమందులు, ఇతర కృత్రిమ ఉత్పత్తులను ఉపయోగించకుండా, సహజసిద్ధమైన విధానాల్లో పంటలను పెంచే వ్యవసాయ పద్ధతి. ఇది సహజ ఎరువులు, జీవన ఎరువులు ప్రకృతికి అనుకూలమైన పద్ధతులు ఉపయోగించడం, దీని ద్వారా మట్టిసారాన్ని పెంచి, పర్యావరణాన్ని రక్షిస్తూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి దోహదపడుతుంది.

ఈ విధానం ప్రకృతి సమతుల్యతను కాపాడటం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, దీర్ఘకాలికంగా వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం వంటి ప్రయోజనాలను కలిగి ఉంటుంది. సేంద్రీయ వ్యవసాయంలో జీవ సమతుల్యం, అధిక దిగుబడుల కోసం సహజ పద్ధతులతో పాటు పోషకాలను కూడా వినియోగిస్తారు దీనిని ఇంటిగ్రేటెడ్ ఆర్గానిక్ ఫార్మింగ్ అంటారు.

అలా కాకుండా పూర్తిగా సహజ పద్ధతులతోనే వ్యవసాయం చేస్తే దానిని ప్యూర్ ఆర్గానిక్ ఫార్మింగ్ అంటారు.. రైతులు వారి ప్రాంతాలను, పంటలను బట్టి నచ్చిన విధానాన్ని అనుసరిస్తారు..

**సేంద్రీయ సేద్యం ముఖ్య లక్షణాలు:**

-రసాయన ఎరువుల స్థానంలో సహజ ఎరువుల వినియోగం. కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, పచ్చి రొట్టె ఎరువులు, గో ఆధారిత ఎరువులు మొదలైనవి వాడి మట్టిని సారవంతంగా మార్చడం.

**సహజ పురుగుమందుల ఉపయోగం:**

వెల్లుల్లి, మిరప, అరిటాకు, నిమ్మ, పచ్చి మిర్చి, వేపాకు, కషాయాలు వంటి స్వాభావిక పద్ధతులు పురుగుల నివారణకు సహాయపడతాయి.

**జీవన ఎరువుల వినియోగం:**

రైజోబియం, అజోటోబాక్టర్, పాస్ఫో బాక్టర్, పొటాష్ మొబైలైజింగ్ బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు భూమికి నత్రజని, భాస్వరం, పొటాషియం అందించడంతో పాటు భూసారాన్ని పెంచుతాయి, వీటితో పాటు ఇంకా చాలా జీవన ఎరువులు సేంద్రీయ వ్యవసాయంలో సహాయ పడతాయి..

**బహుళ పంటల సాగు (క్రాప్ రొటేషన్):**

ఒకే భూమిలో వివిధ రకాల పంటలు సాగుచేసి భూసారాన్ని కోల్పోకుండా కాపాడడం , దీర్ఘకాలం పాటు ఒకే రకమైన పంటను సాగు చేయడం వలన భూమిలో సారం క్షీణించి దిగుబడులు తగ్గడం, వ్యాధులు ప్రబలడం వంటివి జరుగుతాయి

**నీటి వినియోగాన్ని తగ్గించటం:**

సేంద్రీయ వ్యవసాయ విధానాల్లో తక్కువ నీటి వినియోగం ద్వారా నీటి వనరుల సంరక్షణ.

లిసేంద్రీయ సేద్యం ప్రయోజనాలు:లి

**భూమికి భద్రత**

రసాయన ఎరువుల వినియోగం లేకపోవడం వల్ల భూమి సహజ జీవచర్య కొనసాగుతుంది.

మట్టిలో సారం క్షీణించకుండా తేమను నిల్వ ఉంచుకుని, భూసారం పెరుగుతుంది.

**రైతులకు ఆర్థిక భద్రత:**

సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ డిమాండ్ ఎక్కువగా ఉండడం వల్ల అధిక ధరలు లభిస్తాయి. వ్యయం తక్కువగా ఉండడం వల్ల రైతులకు పెట్టుబడి తక్కువగా ఉంటుంది.

**ఆరోగ్యకరమైన ఆహారం:**

రసాయనాల ప్రభావం లేకుండా స్వచ్ఛమైన, పోషకభరితమైన ఆహారం అందుబాటులోకి వస్తుంది. దీని వలన క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత, కిడ్నీ వ్యాధుల వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి, ప్రజలలో చాలా వరకు అరోగ్య సమస్యలు కనుమరుగవుతాయి..

**పర్యావరణ పరిరక్షణ**

నీటి కాలుష్యం, గాలి కాలుష్యం, భూసార నాశనం తగ్గిపోతాయి.

కార్బన్ ఉద్గారాలు తగ్గడం వల్ల వాతావరణ మార్పులను ఎదుర్కోవచ్చు.

**బహుళ పంటల ద్వారా స్థిరమైన ఆదాయం**

ఒకే భూమిలో వివిధ రకాల పంటలు సాగుచేయడం వల్ల విస్తృత ఆదాయం పొందే అవకాశం వుంటుంది

లిసేంద్రీయ వ్యవసాయంలో ఉపయోగించే పద్ధతులులి

**కంపోస్ట్ ఎరువు**

పశువుల పేడ ,ఎండు ఆకులు, వ్యవసాయ వ్యర్థాలు కలిపి తయారు చేసే సహజ ఎరువు, దీని ద్వార భూసారం పెరుగుతుంది, మొక్కల పెరుగుదల మెరుగుపడుతుంది.

జీవామృతం, బిజామృతం, వేస్ట్ డీకంపోజర్, పంచగవ్య వంటివి వాడడం

**వర్మీ కంపోస్ట్**

వాన పాముల సహాయంతో తయారు చేసే ఎరువు మట్టికి పోషకాలు అందించే విధానం. ఇది మట్టిలో సూక్ష్మజీవుల పెరుగుదలను పెంచి, భూసారాన్ని మెరుగుపరుస్తుంది. వర్మి వాష్ కూడా చాలా ఉపయోగకరంగా వుంటుంది

**జీవన ఎరువులు**

రైజోబియం, అజోటోబాక్టర్, పాస్ఫో బాక్టర్, పొటాష్ మొబైలేఇజింగ్ బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు భూమికి నత్రజని, భాస్వరం, పొటాషియం అందించడంతో పాటు భూసారాన్ని పెంచుతాయి. అలాగే జీవన ఎరువులు అయిన ట్రైకోడేర్మా , సుడోమొనస్ , మైల్లోరైజా , పాసిలోమైసిస్ , బాసిల్లస్ , వెర్టిసిలియం, బవేరియా, మెటరిజాం వంటివి సహజ పద్ధతుల్లో పురుగులను, తెగుళ్లను అరికట్టి నేల సావంతతను పెంచి పంట ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి

**సహజ పురుగుమందులు**

వెల్లుల్లి, మిరప, నిమ్మ, అరిటాకు, వేపాకు, వంటి కొన్ని సహజ పదార్థాలతో పురుగుమందులు తయారు చేయడం. బ్రహ్మాస్త్రం, నీమస్త్రం , అగ్న్యాశ్రం వంటివి వాడడం , లింగాకర్షక బుట్టల వల్ల కూడా రసం పీల్చే పురుగులను సమర్థవతంగా అరికట్టవచ్చు..

**పచ్చి రొట్టె ఎరువులు (గ్రీన్ మనరింగ్)**

శెనగలు, మినుములు , జనుము, పిల్లి పెసర వంటి నత్రజని నిర్ధారక మొక్కలను పెంచి, పంట కోసిన తర్వాత భూమిలో కలపడం కలపడం వలన భూమిలో పోషకాలు పెరిగి భూమి సారవంతంగా మారుతుంది.

సేంద్రీయ సేద్యంలో సవాళ్లు - పరిష్కారాలు:లి

**దిగుబడి తక్కువగా ఉండడం**

సేంద్రీయ వ్యవసాయంలో మొదట దిగుబడి తక్కువగా వస్తుంది అనే కానీ 2-3 సంవత్సరాల తరవాత దిగుబడి పెరుగుతోంది, నాణ్యత కూడా పెరుగుతోంది, పెట్టుబడి తగ్గుతుంది , దీర్ఘ కాలంలో రైతుకు, సమాజానికి చాలా మేలు జరుగుతుంది.

ప్రారంభ దశలో తగ్గిన దిగుబడిని అధిగమించేందుకు రైతులకు అవగాహన కల్పించాలి. మట్టిలో పోషకాలను మెరుగుపరిచే విధానాలను ప్రోత్సహించాలి. మార్కెట్ సమస్యలు: సేంద్రీయ ఉత్పత్తులకు ప్రధాన సమస్యం రైతుకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడం, సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ లో మంచి డిమాండ్ వుంది.

**-జి. అజయ్ కుమార్**

# నల్లజాతి సూర్యుడు హజ్రత్ బిలాల్ (రజిఅన్ )



అది అరేబియా గడ్డ. మండే ఎండలకు, పాషాణ హృదయాలకు అడ్డా. ఎటుచూసినా ఖురైష్ సర్దారుల దాష్టీకాలకు, అగ్రవర్ణ అహంకారం తలకెక్కిన అరబ్బుల ఆగడాలకు అంతే లేని కాలం.. నల్లజాతి వారిని బానిసలుగా నడిబజారులో నిలబెట్టి వేలం వేసి పశువులను కొన్నట్టు కొని ఇంత తిండి పెట్టి జీవితాంతం ఊడిగం చేయించుకుని వృద్ధాప్యం వచ్చాక వదిలేసే దుష్ట కాలం. అరబ్బుల ముందు నల్లజాతి నీగ్రోలు అణిగిమణిగి ఉండాలి. తల ఎత్తి మాట్లాడకూడదు. కనీసం చెప్పులు వేసుకుని నడవకూడదు. శరీరంలో నడుముకు తప్ప శరీరంపై దుస్తులు ధరించరాదు. నల్లజాతి వారి కష్టాలకు, కన్నీళ్లకు అంతేలేదు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ఓ విప్లవ స్వరం వినిపించింది. ఆయనే దైవ ప్రవక్త ముహమ్మద్ (స). ఆయన సందేశం ఏమంటే మానవులంతా ఒక్కటే. మానవులందరి దైవం ఒక్కడే. మనుషులంతా పుట్టుక రీత్యా అందరూ సమానులే. ఎవరూ అధికులు కాదు. ఎవరూ అల్పులూ కాదు. నల్లజాతి వారు బానిసలు కాదు. వారు అరబ్బులకు సమానులు అనే ప్రవక్త మాట ఖురైష్ సర్దారులకు కంటగింపైంది.. ఎవరైనా ప్రవక్తను అనుసరిస్తే దారుణంగా శిక్షించే వారు. ఇటువంటి క్లిష్ట సమయంలో నేను ప్రవక్తను అనుసరిస్తాను అని ఒక నల్లజాతి సూరీడు మక్కాలో నినదించటం ఆరంభించాడు. ఆయనే హజ్రత్ బిలాల్ రజిఅన్.


ఇథియోపియా నుండి కొనుగోలుపై వచ్చిన నీగ్రో బానిస రబాహ్, హమామా దంపతులకు తొలి చూరు బిడ్డ బిలాల్. బాల్యం నుండే మంచి దేహదారుఢ్యంతో నేరేడు పండు రంగులో నిగనిగలాడేవారు. అగ్రవర్ణ అహంకారి ఉమయ్య వద్ద బానిసగా ఉండేవారు. ప్రవక్త ముహమ్మద్ స ఇచ్చిన ఏకేశ్వరరాధన, సామాజిక సమానత్వ పిలుపు బిలాల్ ఆలోచనలు మార్చాయి. అవును! మనిషి సాటి మనిషికి ఎందుకు దాస్యం చేయాలి. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే భావన ఏమిటి ?అనే ఆలోచనలో ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. అలా బాధ పడి మౌనంగా ఉంటే చరిత్ర బిలాల్ ను పట్టించుకునేది కాదు. కలిమా చదివి ప్రవక్తను అనుసరించాలని నిర్ణయించుకున్నారు. కలిమా చదివి అగ్రవర్ణ బానిసత్వం నుండి విముక్తి పొందిన అమ్మార్ను ఖురైష్ సర్దారులు బంధించారు. అహంకారి ఉమయ్య ఏయ్ బిలాల్ అమ్మార్ను కొరడాతో కొట్టు అని ఆదేశించాడు. ఒక బానిసను మరో బానిసతో కొట్టిస్తానని హుంకరించాడు. బిలాల్ కళ్లు చింత నిప్పులయ్యాయి. అమ్మార్ ను కొట్టేదేలేదు. నేనూ కలిమా చదువుతున్నాను. అషహదు లాయిలాహ యిల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్ (దైవం ఒక్కడే. ముహమ్మద్ దైవ ప్రవక్త అని సాక్ష్యం ఇస్తున్నాను )అని బిగ్గరగా పలికాడు. అంతే.. ఖురైషు సర్దారుల కోపం కట్టలు తెంచుకుంది. ముహమ్మద్ ప్రారంభించిన ఈ ఉద్యమం బానిసల్లోను, దళితుల్లోనూ పాకుతోంది. ఇక సహించేదిలేదని కేకలు వేసుకుంటూ బిలాల్ను బంధించారు. మండుటెడారిలో నడుముకు ఉన్న గుడ్డ తప్ప మరేమీ లేని బిలాల్ను పరుండబెట్టి బరువైన బండరాయిని ఛాతీపై ఉంచారు. బండ వేడికి చర్మం కాలి కమురు వాసన వస్తుంది.. ఏయ్ బిలాల్ ఇప్పటికైనా ప్రవక్త బాటను వీడుతావా! లేదా? అని గద్దించారు. ఎన్ని హింసలు పెట్టినా కలిమా చదువుతూ స్పృహ తప్పేవారు. మెడకు తాడు కట్టి లాగే వారు. అయినా బిలాల్ విశ్వాసంపై స్థిరంగా నిలబడ్డారు. విషయం తెల్సుకున్న ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అబూబకర్ సిద్ధిఖ్ రజిఅన్ ను పిలిచి బిలాల్ ను అతని యజమానికి రొక్కం చెల్లించి బానిసత్వం నుండి విముక్తి కలిగించి తీసుకురమ్మని పంపించారు. అలా విముక్తి పొందిన బిలాల్ నిత్యం ప్రవక్త ప్రారంభించిన విముక్తి ఉద్యమంలో ప్రథమంగా నిలబడ్డారు.. ఇస్లామియా చరిత్రలో తొలి అజాన్ పలికిన ముఅజ్జిన్ గా నియమితులయ్యారు. పవిత్ర కాబా మస్జీదు గోడపై ఎక్కి ప్రవక్త కోరిక మేరకు తొలి అజాన్ ఇచ్చారు. ఈ గౌరవం బిలాల్ కు దక్కటం కొంతమంది అగ్రవర్ణ మనస్థత్వం ఉన్న అరబ్బులకు నచ్చలేదు. గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఏమిటీ నిన్నటి వరకూ అరబ్బుల బానిసగా ఉన్న వ్యక్తికి ఇంత గౌరవమా !అని గొణుక్కోసాగారు. ప్రవక్త గమనించి చూడండి వంశాలు, గోత్రాల, వర్ణాల అహంకారాలన్నీ నా పాదాల కింద తొక్కేశాను. మీరు నా సహచరులే ఐతే వాటిని వెలికి తీయకండి అని మందలించారు... అందరూ పశ్చాత్తాపంతో కన్నీరు కార్చారు.. హజ్రత్ ఉమర్ అంతటి వారు బిలాల్ ను ఓ మా సర్దార్ ఆజ్ఞాపించండి అని అనేవారు. బిలాల్ విముక్తి మొత్తం నల్లజాతికి ఆదర్శంగా నిలిచింది. ప్రవక్త వెంట నల్లజాతి వారు నడవటానికి స్ఫూర్తి ఇచ్చింది. అలా తన జీవితమంతా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రారంభించిన విముక్తి ఉద్యమంలో నడిచారు. ప్రవక్త పరమపదించాక శోకతప్తులై తొలి ఖలీఫా అబూబక్ర్ వద్ద సెలవు తీసుకొని పీడిత, తాడిత ప్రజల విముక్తి యుద్ధంలో పాల్గొనేందుకు సిరియా వెళ్తానని కోరారు. జీవితమంతా ఎంతో కష్టాలకోర్చారు. ఇకనైనా మక్కాలో విశ్రాంతి తీసుకోరాదా! అని కోరగా పీడిత, తాడిత ప్రజల విముక్తి యుద్ధానికే అంకితమని విశ్రాంతి ని తిరస్కరించారు. అబూబక్ర్ అనుమతించగా యావత్తు ప్రజలు అశ్రునయనాలతో బిలాల్ ను సాగనంపగా సిరియాలోని దమాస్కస్లో ప్రవక్త బోధనలు ప్రజలకు పరిచయం చేస్తూ అక్కడే కన్నుమూశారు... ఇన్నాలిల్లాహి వ ఇన్న ఇలైహి రాజివూన్..

**-కవి కరీముల్లా సామాజిక వ్యాసం**



## నిస్వార్థంగా మెలగాలి

భక్తి



పనులను (కర్మలను) ఎలాంటి స్వార్థం లేకుండా ఆచరించడం అత్యుత్తమైన లక్షణమని, అటువంటి నిస్వార్థమైన కర్మలు సర్వోన్నతమైన శక్తిని కలిగి ఉంటాయని శ్రీకృష్ణుడు చెప్పాడు. నిస్వార్థమైన చర్యల గురించి వివరించడానికి వర్షాన్ని ఆయన ఉదాహరణగా తీసుకున్నాడు. వేడి కారణంగా నీరు ఆవిరై మేఘాలు ఏర్పడతాయి. అనుకూలమైన పరిస్థితుల్లో అది వర్షం రూపంలో తిరిగి భూమి మీదకు వస్తుంది. అంటే వర్షం అనేది ఒక ఆవృత్తి (సైకిల్)లో భాగం. నిస్వార్థ కర్మలను 'యజ్ఞం'గా శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. మహా సముద్రాలు నీటిని ఆవిరి చేసి, మేఘాలు ఏర్పడడానికి సహాయపడతాయి. వర్షంగా మారడం కోసం మేఘాలు కరుగుతాయి, తమనుతాము త్యాగం చేసుకుంటాయి. ఈ రెండూ యజ్ఞరూపమైన నిస్వార్థ కర్మలు. ఇవి అత్యంత శక్తిని గలిగి ఉంటాయనీ, ఆరంభంలో సృష్టికర్త ఈ శక్తిని ఉపయోగించి సృష్టిని చేశాడనీ, ప్రతి ఒక్కరూ దీన్ని ఉపయోగించుకొని పరమ శ్రేయస్సును పొందాలని సూచించాడనీ 'భగవద్గీత' మూడో అధ్యాయంలో శ్రీకృష్ణుడు వివరించాడు. ఇదంతా యజ్ఞరూపమైన నిస్వార్థ కర్మ ద్వారా మన అస్తిత్వంతో మనల్ని అనుసంధానించుకొని... దాని శక్తిని ఉపయోగించుకోవడమే. వర్షానికి సంబంధించిన ఈ పరస్పర అనుసంధాన ప్రక్రియలో.. మేఘాలు గర్వంతో నీటిని నిల్వ (జమ) చేసుకుంటే ఆ ఆవృత్తికి భంగం కలుగుతుంది. "ఇలా భంగం కలిగించేవారు దాచుకొనేవారు దొంగలు. వర్షం తాలూకు నిస్వార్థ కర్మ కొనసాగినప్పుడు... మేఘాలు మళ్ళీ, మళ్ళీ ఏర్పడుతూనే ఉంటాయి" అని శ్రీకృష్ణుడు చెబుతూ... పరస్పరం సహాయం చేసుకొనేవారిని దేవతలుగా సంబోధించాడు. సముద్రం వర్షం ద్వారా నీటిని తిరిగి పొందినట్టే... నిస్వార్థ కర్మలు ఎన్నిటినో తిరిగి ఇస్తాయి. కాబట్టి దాచుకోకుండా ఆవృత్తిలో భాగం కావాలనీ, అది అన్ని పాపాలనుంచి మిమ్మల్ని విముక్తి చేస్తుందనీ, దాచుకోవడమే అసలైన పాపం అని ఆయన స్పష్టం చేశాడు. స్వార్థ కర్మలు మనల్ని కర్మబంధనంలో బంధిస్తాయని హెచ్చరించాడు. అనుబంధం పెంచుకోకుండా కర్మలను యజ్ఞంలా నిర్వహించాలని సూచించాడు. ఈ భౌతిక ప్రపంచంలో ఒకరిపై మరొకరు ఆధారపడడం తప్ప మరో మార్గం లేదు. ఇక్కడ ప్రతి వస్తువు, ప్రతి జీవి ఒక ఆవృత్తిలో లేదా మరొకదానిలో భాగం. అది మరో వస్తువు మీద లేదా మరొకరిమీద ఆధారపడి ఉంటుంది. మనలోని ఒక భాగం ఇతరులలో... ఇతరులలోని ఒక భాగం మనలో ఉంటుందనే అవగాహన కీలకం.

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

9 | హైదరాబాద్ | బుధవారం | 19 । మార్చి । 2025


## రక్తదానంతో క్యాన్సర్ రక్ష

వయసు పైబడేకొద్దీ రక్తాన్ని ఉత్పత్తి చేసే మూల కణాల్లో సహజసిద్ధ ఉత్పరివర్తనాలు చోటుచేసుకుంటూ ఉంటాయి. వాటిలో కొన్ని ఉత్పరివర్తనాలు లుకేమియా ముప్పును పెంచుతాయి. అయితే క్రమం తప్పకుండా రక్తదానం చేసే వారిలో ఈ ఉత్పరివర్తనాలు క్యాన్సర్‌కు దారి తీయకుండా ఉంటాయని లండన్‌లోని ఫ్రాన్సిస్ క్రిక్ యూనివర్శిటీ పరిశోధకులు కనిపెట్టారు. క్రమం తప్పకుండా రక్తదానం చేసేవారి శరీరంలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతూ మూల



కణాలు మరింత సమర్థంగా మారిపోతూ ఉంటాయనీ, వీరిలో ఆరోగ్యకరమైన, మరింత ప్రభావవంతమైన రక్తకణాలు తయారవుతూ ఉంటాయనీ పరిశోధకులు సూచిస్తున్నారు. గుండె ఆరోగ్యంలో రక్తం చిక్కదనం కీలక పాత్ర పోషిస్తూ ఉంటుంది. చిక్కని రక్తం, రక్తప్రవాహాన్ని కొంతమేరకు కుంటు పరిచి, అధిక రక్తపోటుకూ, అంతిమంగా గుండెజబ్బులకూ దారి తీస్తుంది. కానీ క్రమం తప్పక రక్తదానం చేసేవారిలో రక్తపోటు స్థిరంగా ఉంటూ, గుండెజబ్బులు, గుండెపోట్ల ముప్పు తగ్గుతుందని కూడా పరిశోధకులు వివరిస్తున్నారు.

# చమట పొక్కులకు చెక్



వేసవిలో పిల్లలను వేధించే ప్రధాన సమస్య... చమట పొక్కులు. ఈ సమస్య నుంచి పిల్లలకు ఉపశమనం కలగడం కోసం కొన్ని చిట్కాలను పాటించవచ్చు. అవేంటంటే...

శరీరంపై చమట ఆరిపోవడం లేదా, చర్మపు ముడతల్లో చమట, మట్టి పేరుకుపోవడం మూలంగా చమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు ఈ కాలంలో ఇబ్బంది పెడతాయి. సాధారణంగా మామిడి పండ్లు తినడం వల్ల వేడిచేసి సెగ గడ్డలు మొదలయ్యాయని అందరూ అనుకుంటూ ఉంటారు. కానీ సెగ గడ్డలకు కారణం చర్మం మీద చమట ఇంకిపోయి, చర్మ రంధ్రాలు మూసుకుపోయి, ఇన్‌ఫెక్షన్ తలెత్తడమే! చమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, సెగ గడ్డలు పిల్లలను వేధించకుండా ఉండాలంటే రోజుకు రెండు పూటలా స్నానం చేయిస్తూ ఉండాలి. వీటికి తోడు ఈ అదనపు జాగ్రత్తలు కూడా పాటించాలి.

**చల్లని వాతావరణం:** చల్లనీటి స్నానంతో శరీర ఉష్ణోగ్రత తగ్గి, ఉపశమనం కలుగుతుంది. అలాగే పిల్లలు గాలి ధారాళంగా చొరబడే వీలున్న చల్లని గదుల్లోనే ఉండాలి

**దుస్తులు:** తేలికగా, చమటను పీల్చుకునే, గాలి చొరబడే వీలున్న మెత్తని దుస్తులనే పిల్లలకు వేయాలి

**ఉపశమనం:** పొక్కిన ప్రదేశంలో దురద, మంటలను తొలగించడం కోసం చల్లని తడి వస్త్రాన్ని కప్పి ఉంచవచ్చు. లేదా వస్త్రంలో మంచు ముక్కలను ఉంచి, కాపడం పెట్టుకోవచ్చు

**ఆయింట్‌మెంట్లు:** జిడ్డుగా ఉండే తైలాలు, ఆయింట్‌మెంట్లు పూయకూడదు

**గోకకూడదు:** చమట పొక్కులు వచ్చిన ప్రదేశాల్లో దురద సహజం. కాబట్టి పిల్లలు అదే పనిగా గోక్కునే ప్రయత్నం చేస్తారు. దాంతో పుండ్లు పడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఉపశమనం దక్కడం కోసం ఆయా ప్రదేశాల్లో సున్నితంగా రుద్దాలి

**ఓట్‌మీల్:** చర్మం మంట తగ్గడం కోసం స్నానం నీళ్లకు ఓట్‌మీల్ జోడించాలి

**సోడా ఉప్పు:** చర్మరంధ్రాలు తెరుచుకుని, ఇన్‌ఫ్లమేషన్ తగ్గడం కోసం రెండు స్పూన్ల సోడా ఉప్పును స్నానం చేసే నీళ్లలో కలుపుకోవాలి

**నియంత్రణ ఇలా...**

**నీళ్లు:** శరీరంలో నీరు తరిగిపోకుండా చూసుకుంటే చమట పొక్కుల సమస్య తలెత్తకుండా ఉంటుంది. కాబట్టి పిల్లలు సరిపడా నీళ్లు తాగుతున్నారో లేదో గమనించుకుంటూ ఉండాలి

**అలసట:** ఎండలో ఎక్కువసేపు ఆడుతూ చమటలు పట్టకుండా చూసుకోవాలి

**పౌడర్:** అదనపు చమటను పీల్చుకునేలా చమట పట్టే వీలున్న ప్రదేశాల్లో టాల్కమ్ పౌడర్ చల్లాలి. అయితే అవసరానికి మించి పౌడర్ చల్లితే, చర్మ రంధ్రాలు మూసుకుపోయి చమటపొక్కులు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి పౌడర్‌ను పరిమితంగా వాడుకుంటూ, రెండు పూటలా స్నానం చేయిస్తూ ఉండాలి

**వైద్యులను ఎప్పుడు కలవాలి?**

మూడు రోజులు దాటినా చమట పొక్కులు తగ్గనప్పుడు. చమట పొక్కుల తీవ్రత అంతకంతకూ పెరుగుతున్నప్పుడు చమట పొక్కులు చీము పట్టినప్పుడు. చమట పొక్కులకు జ్వరం తోడైనప్పుడు

# నడకలో నలతలు



నాడీ నష్టానికి సూచనే! దీర్ఘకాలికంగా అత్యధిక చక్కెరలను కలిగి ఉన్నప్పుడు ఈ పరిస్థితి తలెత్తుతుంది. కాళ్లలోని రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు కూడా కాళ్ల నొప్పులు వేధిస్తూ ఉంటాయి. కాబట్టి నొప్పులకు కారణాన్ని తెలుసుకోవాలి

అలసట: క్రమం తప్పక నడక అలవాటు ఉన్నప్పటికీ, కొత్తగా అలసట మొదలైనా, కొద్ది దూరానికే ఓపిక నశిస్తున్నా వెంటనే అప్రమత్తం కావాలి. చక్కెర పెరిగినా, తగ్గినా అలసట, నిస్సత్తువలు వేధిస్తాయి. నిరంతరం అలసట వేధిస్తున్నా, సరిపడా విశ్రాంతి తీసుకున్నప్పటికీ నిస్సత్తువగా ఉంటున్నా, శరీరం చక్కెరను సమర్థవంతంగా నిర్వహించడం లేదని అర్థం.

అరచేతులు, పాదాల్లో తిమ్మిర్లు: అధిక చక్కెర రక్తప్రసరణను ప్రభావితం చేసి, నాడులను దెబ్బతీస్తుంది. దాంతో అరచేతులు, పాదాల్లో నొప్పి, తిమ్మిర్లు వేధిస్తాయి. దీన్నే న్యూరోపతీ అంటారు. ఈ లక్షణాలతో పాటు సూదులు గుచ్చినట్టు కూడా అనిపించవచ్చు

నొప్పులు: కాళ్లలో నొప్పులు వేధిస్తాయి. ఇది కూడా

పాదాల్లో వాపులు: నడక ముగించుకున్న తర్వాత పాదాలు, కాలి గిలకలూ వాస్తుంటే రక్తంలో చక్కెర మోతాదులు హెచ్చుతగ్గులకు లోనవుతున్నట్టు అర్థం చేసుకోవాలి. మధుమేహం మూత్రపిండాల పనితీరును దెబ్బతీస్తుంది. ఫలితంగా శరీరంలో నీటి నిల్వ పెరిగి, పాదాలు, కాలి గిలకల్లో వాపులు మొదలవుతాయి.

# టమాటాల నిల్వ ఇలా!



టమాటాలను శుభ్రంగా కడిగి నీళ్లు లేకుండా తుడవాలి. ఆ తర్వాత వాటిని చిన్న చిన్న ముక్కలుగా తరిగి.. వాటిని ఒక మూకుడులో వేసి ఉడికించాలి. ఇలా ఉడికిన మిశ్రమాన్ని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. దీనిలో తగినంత ఉప్పు, చక్కెర, వెనిగర్ వేసి కలపాలి. ఈ సాస్‌ను గాజు సీసాలో పోసి రిఫ్రిజరేటర్‌లో పెడితే చాలా కాలం నిల్వ ఉంటుంది. లేత పసుపు రంగులో ఉన్న టమాటాలను సన్నని చక్రాలుగా కోసి ఎండలో పెట్టాలి. టమాటా ముక్కల్లో నీరంతా పోయి బాగా ఎండేలా చూసుకోవాలి. తరవాత వీటిని గాలి చొరబడని డబ్బాలో పోసి ఉంచుకుంటే నాలుగు నెలల వరకూ నిల్వ ఉంటాయి. టమాటాలను బాగా ఉడికించి తొక్కలు తీసేయాలి. వీటిని మిక్సీలో వేసి బాగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని ఐస్‌ట్రేలలో వేసి ఫ్రిజర్‌లో పెట్టాలి. ఇవి బాగా గట్టి పడిన తర్వాత జిప్‌లాక్ బ్యాగుల్లోకి మార్చుకోవాలి. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.

పచ్చి టమాటాలను నీటిలో కడిగి, తడి లేకుండా పల్చని గుడ్డతో తుడిచి.. జిప్‌లాక్ బ్యాగుల్లో వేసి ఫ్రీజర్‌లో పెట్టుకుంటే చాలా కాలం నిల్వ ఉంటాయి. టమాటాలను చిన్న ముక్కలుగా కోసి ఒక గాజు సీసాలో వేయాలి. ముక్కలు మునిగేవరకు ఆలివ్ ఆయిల్ పోయాలి. ఇందులో సన్నగా తరిగిన వెల్లుల్లి ముక్కలు, వెనిగర్ వేసి కలపాలి. వెనిగర్ వల్ల టమాటా ముక్కలు తాజాగా ఉంటాయి. ఈ ముక్కలను పాస్తా, వెజిటబుల్ సలాడ్, శాండ్‌విచ్‌ల తయారీలో వాడుకోవచ్చు.

దోరగా పసుపు రంగులో ఉండే టమాటాలను తెచ్చుకుని శుభ్రంగా కడిగి, తడి లేకుండా తుడవాలి. వీటిని సన్నని పొడవైన ముక్కలుగా కోయాలి. వీటిని బాగా ఎండబెట్టాలి. బాగా ఎండిన టమాటా ముక్కలను మిక్సీ జార్‌లో వేసి మెత్తని పొడిలా గ్రైండ్ చేయాలి. ఈ టమాటా పొడిని గాజు సీసాలో పోసి మూత పెట్టి రిఫ్రిజరేటర్‌లో పెట్టుకుంటే చాలా కాలం నిల్వ ఉంటుంది.

# పొట్ట చెత్తబుట్ట కాదు

మీ పొట్ట చెత్తబుట్ట కాదు. అడ్డమైన చెత్త పదార్థాలతో దాన్ని నింపేయకండి. అది ఒక దేవాలయం లాంటిది. బతుకు చక్రం నడవడానికి కావాల్సిన శక్తి అక్కడ ఉత్పత్తి అవుతుంది. ఆ రహస్యాన్ని అర్థం చేసుకోండి. దాని ప్రయోజనాలను గుర్తించండి. ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేశారంటే వ్యాధులు దాడిచేస్తాయి. అప్పుడు మందులనే ఆహారంగా తీసుకోవలసిన దుర్గతి పడుతుంది. అందుకే.. 'ఏం తింటున్నాం? ఎంత తింటున్నాం' అన్న స్పృహతో ఉండాలి. మన పెద్దలు చెప్పిన ఆహార నియమాలను పాటించాలి. పౌష్టికాహార నిపుణుల సూచనలతో ముందుకు సాగాలి. జీవిత రథయాత్ర సాఫీగా సాగిపోవడానికి అనుసరించాల్సిన ఆహార నియమాల గురించి అవగాహన ఉండాలి. "దీపూ, ఎలా ఉన్నావు?""బానే ఉన్నాను డాక్టర్". "నేను చెప్పినట్టు చేశావా? ఉదయం నాలుగు చపాతీలు, సాయంత్రం నాలుగు చపాతీలు తీసుకోమన్నాను. తీసుకున్నావా? అలాగే తాజా పండ్ల రసం ఒక గ్లాసు తీసుకోమన్నాను. దాంతోపాటు రోజుకు కనీసం నాలుగు లీటర్లు నీళ్లు మరిచిపోకుండా తాగమన్నాను. నేను చెప్పిన ఆరోగ్యసూత్రాలను పాటించావా?"

" ఆ.. పాటించాను డాక్టర్..".

"వారం దాటిందనుకుంటాను. నువ్వు ఏమైనా బరువు తగ్గావా?"" లేదు డాక్టర్.."

"అదేంటి?""లేదు డాక్టర్. మరి కాస్త పెరిగాను. ఇప్పుడు నేను.." తను పెరిగిన బరువు గురించి చెప్పింది దీపు.

" అదెలా? చాలామందికి ఇదే సిఫారసు చేశాను. మంచి రిజల్ట్‌తో తిరిగి వచ్చారు. ఇంతకూ నేను చెప్పిన ప్రణాళికను అమలుచేశావా?"

"ఆ డాక్టర్ ఉదయం నాలుగు చపాతీలు, రాత్రి నాలుగు చపాతీలు తీసుకోమన్నారు. దానితో లంచ్‌కి ముందు ఒకసారి, డిన్నర్ తర్వాత ఇంకోసారి తీసుకున్నాను. స్విగ్గీలో ఆర్డర్ పెట్టాను. టైమ్‌కి వచ్చేసేవి".

ఈ మాటలకు స్పృహ తప్పి పడిపోవటం డాక్టర్ వంతయ్యింది. ఇది సరదాకు అల్లిన కథయినా చాలామంది వ్యక్తులు ఇలాగే ప్రవర్తిస్తున్నారు. తగిన ఆహార నియమాలను పాటించటం లేదు. శరీరాన్ని క్రమబద్ధంగా ఉంచుకోవటం లేదు. డైటింగ్‌లు, ఉపవాసాలు అంటున్నారు. అవైనా సరిగ్గా చేస్తున్నారా అంటే సంతృప్తికరమైన సమాధానం కనిపించదు. ప్రజలు తమ వ్యక్తిగత అభిరుచుల మేరకు వివిధ ఆహారాలను ఇష్టపడతారు. కొంతమంది రోజువారీ ఆహారాన్ని ఎక్కువ తీసుకుంటే, మరికొంతమంది ఆహారం తక్కువ తీసుకుని చిరుతిళ్లు ఎక్కువ తింటారు. బరువు పెరిగిపోతామన్న భయంతో ముద్ద ముద్ద లెక్కపెట్టుకుని తినే వాళ్లూ ఉంటారు. కొంతమంది గిర్నీలో మాదిరిగా నోట్లో ఏదో ఒకటి వేసుకుని ఎప్పుడూ నములుతూ కనిపిస్తారు. తినే పదార్థం ఏమిటనే అంశంపైన వాళ్లకు పెద్దగా పట్టింపు ఉండదు.

కానీ, ఎవరైనా తాము తినే పదార్థాన్ని ఎంచుకోవటంలోనూ, దాన్ని సరిగ్గా తినటంలోనూ ఓ పద్ధతిని, మర్యాదని పాటిస్తే ఆరోగ్యానికి పూచీ లభిస్తుంది.

ఎంత తింటున్నామనే కంటే ఏం తింటున్నామనేది ముఖ్యం. ఇది నిపుణులు మనకు చేస్తున్న సూచన కాదు. హెచ్చరిక! కొంతమంది జీవించటానికి తింటే, తినటం కోసమే జీవించే వాళ్లు ఉన్నారు. కొంతమంది ఏది తిన్నా బాగా ఇష్టంగా తింటారు. దాంతో అది వారికి బాగా వంటపడుతుంది. రకరకాల హొటళ్లు, రెస్టారెంట్‌లతో మార్కెట్లో కొత్త కొత్త రుచులు ప్రవేశిస్తున్నాయి. ఇందులో ఆరోగ్యానికి మేలుచేసే వాటికంటే రకరకాల మసాలాలతో కూడి ఆరోగ్యానికి చేటు చేసేవే ఎక్కువ. ఈ మధ్య కాలంలో యూట్యూబర్లు రకరకాల ఆహార పదార్థాలపై విశ్లేషణలు చేస్తూ ప్రజల జిహ్వాకు సవాలు విసురుతున్నారు.

**చిన్న చిన్న భోజనాలు...** శరీరం సమతుల్యంగా ఉండటానికి అందులో కార్బొహైడ్రేట్లు, కొవ్వులు, ప్రొటీన్లు, మినరల్స్, లవణాలు, విటమిన్లు అనే ఐదు భాగాలు సరైన మొత్తంలో ఉండాలి. ఒక వ్యక్తి ఎంత ఆహారం తీసుకోవాలనేది ఆ వ్యక్తి బరువు, ఎత్తు, జెండర్, అతను చేసే పనిపైన ఆధారపడి ఉంటుంది. శారీరక శ్రమ చేసేవాళ్లు కొంచెం అధికంగా ఆహారం తీసుకుంటారు. సాధారణమైన అంచనాల ప్రకారం రోజూ పురుషులు 2,500 క్యాలరీలు, స్త్రీలు 2,000 క్యాలరీలు, పిల్లలు 1200 నుంచి 1400 క్యాలరీల ఆహారం తీసుకోవాలి. ఒకేసారి భారీగా తినటం కంటే చిన్న చిన్న భోజనాలు రోజులో ఎక్కువసార్లు తినటం వల్ల శరీరంలో కొవ్వు పెరగకుండా ఉంటుంది. అలాగే మధ్యాహ్నం, రాత్రి భోజనాల మధ్య ఆరుగంటల విరామం ఉండేలా చూసుకోవాలి. ఇలా చేయటం వల్ల ఆహారం జీర్ణం కావటానికి తగినంత సమయం దొరుకుతుంది.

**సంప్రదాయ విధానాలు**

గతంలో ఆహారం తినటానికి అరటి ఆకులను, తామర ఆకులను, మోదుగు ఆకులను వాడేవాళ్లు. ఈ ఆకుల్లో తినటం వల్ల అవి పరోక్షంగా లాలాజాలాన్ని ఉత్పత్తి చేసేవి. ఫలితంగా జీర్ణక్రియ వృద్ధి అయ్యేది. అలాగే ఇప్పటి మాదిరిగా డైనింగ్ టేబుల్ మీద కూర్చుని భోజనం చేయటం ఉండేది కాదు. అందరూ హాయిగా నేల మీద కూర్చుని భోజనం చేసేవాళ్లు. దీనివల్ల పొట్టలో మూడింట రెండు వంతుల భాగం వంగుతుంది. ఫలితంగా మన ఉదరం నాలుగు లీటర్ల నీటిని తనలో ఇముడ్చుకోగలుగుతుంది. ఉష్ణగతికశాస్త్రం.. అంటే లా ఆఫ్ థెర్మోడైనమిక్స్ ఇక్కడ




పనిచేస్తుంది. అది అద్భుతాలను చేస్తుంది. దానివల్ల కొవ్వు దూరమవుతుంది. ఊబకాయం తగ్గుతుంది. కాబట్టి, పద్మాసనం వేసుకుని భోజనం చేయాలి.

**ఏడు తెల్లటి పదార్థాలకు దూరం**

రకరకాల కాయగూరలతో ఆహారాన్ని రంగుల మయంగా చేసుకోవాలి. అన్నట్టు ఏడు రకాలైన తెల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మనం దూరం పెట్టాల్సిన ఆ ఏడు తెల్లటి పదార్థాలు ఏవంటే.. చక్కెర, ఉప్పు, పాస్తా, మైదా, చక్కెరలు జోడించిన పాల పదార్థాలు, బాగా మరపట్టిన బియ్యం, ఆలుగడ్డ చిప్స్. ప్రముఖ క్రీడాకారులు, సినిమా నటులు, ఇతర సెలెబ్రిటీలు ఎక్కువ కార్బొహైడ్రేట్లు కలిగిన పాలిష్డ్ బియ్యానికి దూరంగా ఉంటారు. ఉదాహరణకు ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఎక్కువగా కూరగాయలు, కినోవా, పాలకూర ఉన్న ఆహారం తింటాడు. ఉడికించి, ఆవిరిలో వండిన మిరియాలపొడి, ఉప్పు, నిమ్మరసంతో కూడిన ఆహారం ఎక్కువగా తింటాడు.

**మొలకలు మంచివేనా?**

గోధుమలు, మక్కజొన్న, రాగి, ఇతర రకాల పప్పులు,



తృణధాన్యాలు, బార్లీ, పెసర, శనగ, పల్లీ, బటానీ, సోయాబీన్ వంటి వాటిని మొలకలుగా ఉపయోగించుకోవచ్చు. ఆల్ఫాల్ఫాను మొలకలన్నిటిలో రారాజుగా చెప్పుకోవచ్చు. ఇందులో అత్యధికస్థాయిలో ఖనిజాలు, ఎ, బి, సి, ఇ, కె విటమిన్లు, అమైనో ఆమ్లాలు ఉంటాయి. మొలకలు తయారు చేసుకోవడం చాలా సులువైన ప్రక్రియ. మనం ఎంచుకున్న గింజలను శుభ్రమైన నీరున్న పాత్రలో నానబెట్టాలి. తగినంత గాలి పోయే విధంగా ఏర్పాటుచేసి మూతపెట్టాలి. దాదాపు 8 నుంచి 12 గంటల తర్వాత, నీటిని మొత్తం తొలగించాలి. అంతే మొలకలు సిద్ధం. పోషక విలువలు యథాతథంగా అందాలంటే మొలకలను పచ్చిగానే తీసుకోవాలి.

**రోజుల్లో కిలోలు కరుగుతాయా?**

పదిహేను రోజుల్లో 2 నుంచి 5 కిలోల బరువు తగ్గే చిట్కా ఉంది. 'ఇది శాస్త్రీయమాల? ఆయుర్వేదం లేదా అలోపతి వైద్యవిధానాలు సిఫారసు చేశాయా?' అనే ప్రశ్నలు తలెత్తడం సహజం. అయితే, దీని వెనక ప్రాచీన భారతీయ సంప్రదాయ రుజువులు ఉన్నాయి. కొన్ని తరాల వారు దాన్ని ఆచరించి మంచి ఫలితాలను అందుకున్నారు. అవసరమైన వాళ్లు ప్రయత్నించి చూడొచ్చు. ప్రకృతి మనకు 32 దంతాల అమరికను ఊరకే ఇవ్వలేదు. కానీ, మనం దాని ప్రయోజనాన్ని విస్మరిస్తున్నాం. జంతువులా ఆహారాన్ని గబుక్కున మింగేస్తున్నాం. దానివల్ల అది అరగటానికి ఎక్కువ శక్తిని వెచ్చిస్తున్నాం. జంతువులకు నెమరువేసుకునే వెసులుబాటు ఉంది. మనుషులకు ఆ సౌలభ్యం లేదు. కానీ ఆహారాన్ని బాగా నమిలి తింటే అది బరువు తగ్గటానికి ఉపకరించే ప్రక్రియగా మారుతుంది. మీరు నోట్లో పెట్టుకునే ప్రతి ముద్దనూ దవడలకు రెండు వైపులకీ తీసికెళ్లి 32 సార్లు నమలాలి. ఆ తర్వాతే ఆహారాన్ని ఒక్క గుటకలో మింగేయాలి.

**ఊబకాయం తగ్గించుకోవచ్చా?**

మనం తినే ఆహారంపైన పరిమితి విధించుకునే సందర్భంలో మన మనసు దానికి అంగీకరించదు. అయితే, మన బుద్ధి పూర్తిగా సహకరించకపోతే మనం పనీ చేయలేం. అందుకే చాలామంది బరువు తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతారు. కొన్ని సందర్భాల్లో మునుపటి కంటే ఎక్కువ కొవ్వు వాళ్లలో చేరుతుంది. అందుకే మనస్ఫూర్తిగా ఆహార నియంత్రణ పాటించటానికి సిద్ధం కావాలి. డైటింగ్ చేస్తున్న సమయంలో మనసులో ఆయా ఆహారపదార్థాల గురించిన చింతనను పక్కన పెట్టాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని గుర్తించాలి.

**ఎలాంటివి తినాలి?**

గతంలో అతిథులను ఇంటికి ఆహ్వానించినప్పుడు వారికి షడ్రసోపేతమైన విందు ఇచ్చామని చెప్పుకొనేవారు. అంటే, షడ్రుచులతో కూడిన భోజనం వారికి అందించారని దీని అర్థం. అసలు షడ్రుచులు అంటే ఏమిటి? తీపి (మధురం), పులుపు (ఆమ్లం), ఉప్పు (లవణం), కారం (కటువు), చేదు (తిక్తం), వగరు (కషాయం). తరతరాలుగా ఆయుర్వేద నిపుణులు పోషకవిలువలను కాపాడుకునేలా ఆహారపదార్థాలను స్వీకరించాలని, జీర్ణప్రక్రియని ఉత్తేజపరిచేలా శిక్షణ ఇవ్వాలని చెబుతూ వస్తున్నారు. అందుకు వారంలో కనీసం ఒక రోజైనా మీ భోజనంలో ఈ ఆరు రుచులు ఉండేలా చూసుకోవాలి. ఈ ఆరు రుచులు అదనంగా ఉండే వాత, కఫ, పిత్తాలను తొలగించటానికి పరిష్కారం చూపుతాయి. ప్రతి మనిషి శరీరం వాత, కఫ, పిత్తాల సమాహారం. కాబట్టి, మీ శరీర తత్త్వానికి అనుగుణంగా ఆహారంలో మార్పులు చేసుకోవాలి.

**32 సార్లు నమిలితే**

దవడలు రెండు వైపులా ఆహారాన్ని నములుతున్నప్పుడు, ఎడమ భాగం మెదడులో కుడివైపుని, కుడి భాగం మెదడులో ఎడమవైపుని చైతన్యపరుస్తాయి. అంటే.. మెదడు రెండు వైపులా చైతన్యానికి గురవుతుంది. మరే సందర్భంలోనూ ఇది సాధ్యం కాదు. 32 సార్లు నమలకుండా ఏ ఒక్క చిన్న భాగం లోపలకు వెళ్లకూడదన్న విధానం వల్ల మొత్తం ఆహారం అంతా గుజ్జు మాదిరిగా తయారవుతుంది. దానికి లాలాజలం కూడా జత కూడుతుంది. లాలాజలంలో జీర్ణశక్తిని పెంచే 'టయలిన్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఇలా చేయడం వల్ల మనకు తెలియకుండానే తిన్న ఆహారం 30 శాతానికి వచ్చేస్తుంది. దాంతోపాటు 200 మిల్లీ లీటర్ల లాలాజలంతో కూడి ఆహారం పొట్టలోకి వెళుతుంది. జీర్ణప్రక్రియ తేలికగా, తక్కువ శక్తితో పూర్తవుతుంది. దీనివల్ల మలబద్ధకం అన్న సమస్య ఉత్పన్నం కాదు..

**మొబైళ్లు, టీవీలకు దూరంగా**

భోజనం చేసే సమయంలో దిక్కులు చూడటం, ఇతరులతో మాట్లాడటం, చదవటం, వినటం లాంటివి చేయకూడదు. వీడియోలు, ఆడియోల ద్వారా వినోదం పొందాలని చూడొద్దు. భోజనం చేయటానికి ముందు మనసును పూర్తిగా దానిపైనే లగ్నం చేయాలి. లక్షలాది మంది తినటానికి తిండి లేక పస్తులు ఉంటున్న పరిస్థితిలో మనకు ఆహారం వండి, వడ్డించిన వ్యక్తులకు కృతజ్ఞత చూపాలి. భారతీయ సంస్కృతి కూడా 'అన్నదాతా సుఖీభవ' అని దీవిస్తుంది. అలాగే తినేటప్పుడు మంచినీళ్లు తాగే అలవాటును పూర్తిగా పక్కన పెట్టాలి. భోజనం అయ్యాక ఓ అరగంట తర్వాత నీరు సేవించండి. అప్పుడే మన శరీరం ఆహారాన్ని వేగంగా శోషించుకుంటుంది.

ఉపవాసం ప్రయోజనం.. జంక్ ఫుడ్ విపరీతంగా తినడం, వేళాపాళా లేని ఆహారపు అలవాట్లు అనారోగ్య కారకాలు. వారానికి ఓసారి ఉపవాసం ఉండటం మంచిదే. అప్పుడప్పుడు కడుపును ఖాళీ చేయటానికి మన పెద్దవాళ్లు ఉపవాసాన్ని సిఫారసు చేసేవారు. పాత రోజుల్లో చంటి పిల్లలతో ఆముదం తాగించటం ఇందులో భాగమే. ఉపవాసం పేరుతో భోజనం చేయకుండా ఇష్టమైన ఫలహారాలను దండిగా లాగించటం మంచి పద్ధతి కాదు. ఉపవాసం.. అంటే దైవానికి సమీపంగా ఉండటం. తక్కువ తిని మనసును భగవంతునిపైన లగ్నం చేయటానికి ఇదో మార్గం.

**పండ్లరసాల చికిత్స**

జ్యూస్ థెరపీగా పిలిచే ఈ విధానంలో వారానికి ఓసారి ఆయా వ్యక్తులకు అనుకూలంగా ఉండే విధంగా, ఆహారం స్వీకరించకుండా పొట్టకు పూర్తి విశ్రాంతి ఇవ్వాలి. అది దాని శక్తిని కోల్పోకుండా పండ్లరసాలను అందించాలి. 24 గంటల జ్యూస్ థెరపీలో, నిద్రపోయే సమయాన్ని పక్కన పెట్టి.. ప్రతి రెండు గంటలకోసారి వివిధ రకాల పండ్లరసాలను స్వీకరించాలి. ఎవరికి వారు స్వయంగా దీనిపైన నిర్ణయాలు తీసుకోవటం కాకుండా, వారివారి ఆరోగ్య పరిస్థితి ప్రకారం తగిన వైద్య సలహాలను పొందిన తర్వాతే జ్యూస్ థెరపీ ఆచరించటానికి సిద్ధం కావాలి.

**పోషకాల సలాడ్**

సంపూర్ణ పోషకాలతో ఉండే సలాడ్‌లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆహార నిపుణుల మాట. ఇందుకు సంబంధించిన వివరాలు మీకు ఆన్‌లైన్‌లో ఎక్కడైనా లభిస్తాయి. సలాడ్ తయారీకి అవసరమైన పదార్థాలు మిరియాలు, పల్లీలు, తురిమిన క్యాబేజీ ఆకులు, కొత్తిమీర, కరివేపాకు, దానిమ్మ, నిమ్మ, తేనె, ఎండుద్రాక్ష, శొంఠి, పచ్చిమిర్చి, పిస్తాపప్పు, ఖర్జూరం, తురిమిన కొబ్బరి, వాల్‌నట్, బాదం మొదలైనవి. మరో రకం సలాడ్‌కి అవసరమైన పదార్థాలు తాజా కీరదోసకాయ, పెద్ద ఉల్లిపాయ, పల్లీలు, మొలకెత్తిన పెసలు, శొంఠి, కాప్సికం (ఎరుపు/ఆకుపచ్చ), ఆలివ్ ఆయిల్.

తినే ఆహారాన్ని ఔషధంలా భావించాలి. సరైన పోషక విలువలతో కూడిన పదార్థాలను స్వీకరించాలి. అప్పుడే మనకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. మందులనే ఆహారంగా తీసుకోవలసిన దుస్థితి నుంచి బయట పడతాం. ఆ సత్యాన్ని గ్రహించి ఆహారంలో తగిన మార్పులు చేర్పులు చేసుకోవాలి.

**పెద్దలు చెప్పిన ఆహార సూత్రాలు**

1 సరైన సమయంలో తినాలి. ఎక్కువగా పండ్లు, తాజా కూరగాయలు తీసుకోవాలి. చిరుతిండ్లు వద్దు.

2 ఆకలి వేసినప్పుడే భోజనం చేయాలి. అలాగని తప్పనిసరి తంతుగా ఏదో మొక్కుబడిగా మెక్కకూడదు.

3 ఆహారాన్ని దుర్వినియోగం చేయొద్దు. అవసరమైన మేరకే తినాలి. అదనపు ఆహారాన్ని పొట్టలోకి నెట్టకండి.

4 వారంలో ఒక్క రోజైనా తప్పనిసరిగా ఉపవాసం ఉండాలనే నియమాన్ని ఆచరించాలి.

5 డైటింగ్‌ను పాటించాలని అనుకుంటే పౌష్టికాహార నిపుణుడిని, వైద్యుడిని సంప్రదించాలి.

6 ప్రతిరోజూ ఉదయం నిద్ర లేచిన వెంటనే కాలకృత్యాలు తీర్చుకుని అర లీటరు నీళ్లు, లేదా నిమ్మరసం కలిపిన నీటిని తాగాలి.

7 భోజనం సమయంలో మీ ఆలోచనలన్నీ తినటంపైనే కేంద్రీకరించాలి.

8 రోజూ భోజనం పూర్తయ్యాక కనీసం ఒక పండైనా తినటానికి ప్రయత్నించాలి.

9 పడుకోవటానికి కనీసం రెండు గంటల ముందే భోజనం ముగించాలి.

10 తినే సమయంలో మీ ఒత్తిళ్లను, విచారాలను దూరంగా పెట్టాలి. అవి తిండిపైన ప్రభావం చూపకూడదు.

11 రాత్రి సమయంలో మాంసాహారానికి దూరంగా ఉండాలి.

**సహాయ మీడియా**

# స్టాక్ మార్కెట్లు జంప్..! 1,130 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్..!



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా లాభపడ్డాయి. చాలారోజుల రోజుల తర్వాత సెన్సెక్స్ వెయ్యిపాయింట్లకుపైగా లాభపడింది. దాంతో సెన్సెక్స్ 75వేల పాయింట్ల ఎగువ ముగియగా.. నిఫ్టీ 23వేల పాయింట్లకు చేరువైంది. ప్రపంచ మార్కెట్లలో సానుకూల పవనాలు, బ్యాంకింగ్ రంగంలో కొనుగోళ్లతో మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 74,608.66 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ప్రారంభంలోనే సెన్సెక్స్ 400 పాయింట్లకుపైగా లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత సూచీలు పెరుగుతూ వచ్చాయి.ఈ క్రమంలో సెన్సెక్స్ ఇంట్రాడేలో 74,480.15 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 75,385.76 పాయింట్ల గరిష్ఠానికి చేరుకుంది. చివరకు 1,131.30 పాయింట్ల లాభంతో 75,301.26 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 325.55 పాయింట్లు పెరిగి.. 22,834.30 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,715 షేర్లు లాభపడ్డాయి. 1,153 షేర్లు నష్టపోగా.. మరో 117 షేర్లు మారలేదు. నిఫ్టీలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎంఅండ్ఎం, శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, టాటా మోటార్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా తదితర షేర్లు నష్టపోయాయి. అన్ని రంగాల సూచీలు ఆటో, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, పవర్, రియాల్టీ, మీడియా ఇండెక్స్ రెండు నుంచి మూడుశాతం వరకు పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి రెండుశాతానికిపైగా పెరిగాయి.



## ఇన్వెస్టర్లకు శుభవార్త.. త్వరలో అమెజాన్ ఐపీఓ కూడా..




**న్యూఢిల్లీ-నవభూమి:**ఇన్వెస్టర్లకు గుడ్ న్యూస్ రాబోతుంది. ఎందుకంటే అమెరికాకు చెందిన ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్ కూడా ఇండియాలో తన భారతీయ విభాగాన్ని సపరేట్ చేసి స్టాక్ మార్కెట్లో ఐపీఓకురావాలని చూస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే కంపెనీ వర్గాలు చర్చలు ప్రారంభించినట్లు తెలిసింది.ఈ క్రమంలో అమెజాన్ తన వాల్ స్ట్రీట్ బ్యాంకింగ్ భాగస్వామి జేపీ మోర్గాన్‌తోపాటు భారతదేశంలోని పెట్టుబడి బ్యాంకులతో చర్చలు ప్రారంభించిందని ఓ నివేదిక తెలిపింది.ఈ నేపథ్యంలో గత వారం అమెజాన్ ఇండియా దీని కోసం 8 నుంచి 10 పెట్టుబడి బ్యాంకులను ఆహ్వానించింది. భారత నిబంధనల ప్రకారం, దేశీయ కంపెనీలు మాత్రమే ఇన్వెంటరీ ఆధారిత ఇ-కామర్స్ మోడల్ కింద పనిచేస్తాయి. తద్వారా వేగవంతమైన డెలివరీలు, షిప్పింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది.అయితే, విదేశీ సంస్థలు కొనుగోలుదారులు, విక్రేతల మధ్య మధ్యవర్తిగా పనిచేసే మార్కెట్ ప్లేస్ మోడల్ విధానాన్ని అనుసరించాలి. ఈ నియంత్రణ అంతరం చాలా కాలంగా అమెజాన్‌కు సవాలుగా మారింది. మరోవైపు ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ జియోమార్ట్ వంటి స్వదేశీ కంపెనీలతో సమర్థవంతంగా పోటీ పడే సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది.

2030 నాటికి..ఈ నిర్ణయం ద్వారా అమెజాన్ ప్రధానంగా స్థానిక డేటా అవసరాలు, భారతదేశంలో ప్రత్యక్ష జాబితాను నిర్వహించగల సామర్థ్యాన్ని కల్గి ఉంటుందని నివేదిక తెలిపింది. ఈ క్రమంలో మార్కెట్లో ఖర్చులు తగ్గిపోయి, వ్యాపారం పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే భారతదేశంలో ఈ-కామర్స్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇంటర్నెట్ వ్యాప్తి, డిజిటల్ చెల్లింపు పరిష్కారాలు పెరుగుతున్నాయి. దీంతో ఈ పరిశ్రమ 2030 నాటికి 350 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈ విభాగంలో అపారమైన వృద్ధి అవకాశం ఉందని చెబుతున్నారు.

వ్యూహాత్మక చర్యలు..ఈ నేపథ్యంలో భారతదేశంలో తన వ్యాపారాన్ని విస్తరించడానికి అమెజాన్ వ్యూహాత్మక చర్యలు తీసుకుంటోంది. కంపెనీ ఇటీవల బెంగళూరులో తన క్విక్-కామర్స్ సర్వీస్ అమెజాన్ నౌను ప్రారంభించింది. దీని వల్ల వేగవంతమైన డెలివరీతో వినియోగదారులకు ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు జరుగుతాయి. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి కంపెనీలు వచ్చిన నేపథ్యంలో మార్కెట్లో పోటీ ఎక్కువైంది.ఫ్లిప్‌కార్ట్ కూడా..అంతేకాదు ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్ తన స్వస్థలాన్ని భారతదేశానికి మార్చే ప్రక్రియలో ఉంది. 2025 లేదా 2026 ప్రారంభంలో IPOకి రావాలని ప్లాన్ చేస్తోంది. అమెజాన్ తన స్పిన్‌ఆఫ్‌తో ముందుకు సాగితే, అది భారత మార్కెట్లో తన పట్టును బలోపేతం చేసుకోనుంది. దీంతో స్థానిక మార్కెట్లో ఆయా సంస్థల మధ్య పోటీ మరింత పెరిగే అవకాశం ఉంది.

## ఈ జనరేషన్‌కు ఆ సామర్థ్యాలు లేవు.. ఓ సంస్థ సీఈఓ కామెంట్స్ వైరల్



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుతం జనరేషన్ గురించి సోషల్ మీడియాలో తెగ చర్చ నడుస్తోంది. తాజాగా వీరి గురించి బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ CEO ఆశిష్ గుప్తా కీలక విషయాలను వెల్లడించారు. ఆశిష్ లింక్డ్‌ఇన్‌లో చేసిన ఒక పోస్ట్‌లో జనరేషన్ గురించి కీలకమైన అంశాలను ప్రస్తావించారు. ఈ జనరేషన్ రీల్స్ చేయడం, డిజిటల్ ట్రెండ్స్, వైరల్ కంటెంట్ సృష్టించడంలో చాలా నైపుణ్యం కలిగివుంటారు. కానీ, వీరికి ప్రాథమిక గణితం, ఆర్థిక అక్షరాస్యత, మంచి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం చాలా తక్కువగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆ పోస్ట్‌లో ఆశిష్ గుప్తా తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. ఇటీవల ఒక ప్రముఖ సంస్థలో క్యాంపస్ నియామక ప్రక్రియలో, BBA, BCA వంటి డిగ్రీలతో ఉన్న కొత్త గ్రాడ్యుయేట్లను నియమించుకోవడంపై ఆయన చర్చించారు. ఈ సందర్భంలో 50 మందికి పైగా విద్యార్థులను ఒక గణిత ప్రశ్నను అడిగినట్లు చెప్పారు. ఒక కారు మొదట 60 కి.మీ. 30 కి.మీ వేగంతో, తర్వాతి 60 కి.మీ, 60 కి.మీ వేగంతో ప్రయాణిస్తే, దాని సగటు వేగం ఎంత? అని అడిగినట్లు తెలిపారు. ఈ ప్రశ్నకు కేవలం ఇద్దరు విద్యార్థులే సరైన సమాధానం ఇచ్చారని వెల్లడించారు. కానీ మిగిలినవారు మాత్రం దీనిని సరైన విధంగా పరిష్కరించడానికి చాలా ఇబ్బంది పడినట్లు చెప్పారు.

**డిజిటల్ ట్రెండ్స్ గురించి..**దీనిని బట్టి చూస్తే సోషల్ మీడియా ప్రభావం ప్రస్తుతం జనరేషన్ పై ఏ మేరకు ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవచ్చున్నారు. ఈ జనరేషన్ ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, వైరల్ కంటెంట్, డిజిటల్ ట్రెండ్‌ల గురించి మాత్రమే ఆలోచిస్తున్నారని ప్రస్తావించారు. కానీ ప్రాథమిక గణిత సమస్యలను పరిష్కరించడం లేదా ఆర్థికంగా సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాలు మాత్రం వీరికి లేవని అనిపించినట్లు వెల్లడించారు.విమర్శలు వచ్చినప్పుడు..అంతే కాదు జనరేషన్ ఉద్యోగులకు కొన్ని ఇతర సవాళు కూడా ఉంటాయని గుప్తా తెలిపారు. ఉదాహరణకు 65 శాతం యజమానులు వారిలో హక్కుల దృక్పథాన్ని కల్కి ఉంటారని అన్నారు. ఆ క్రమంలో ఈ జనరేషన్ వ్యక్తిగత విమర్శలు ఎదుర్కొన్నప్పుడు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అలాంటి సమయాల్లో వారు తమ అభిప్రాయాలను వ్యక్తీకరించడం, వాటిని సరిగా స్వీకరించడం కూడా కష్టంగా మారుతుందని గుప్తా భావించారు.

## మారుతి, టాటా వాహన ధరలు పెంపు

**న్యూఢిల్లీ-నవభూమి:** వాహన ధరలు ఏప్రిల్ నుంచి పెంచుతున్నట్టు మారుతి సుజుకీ, టాటా మోటార్స్ ప్రకటించాయి. పెరిగిన ముడిసరకు వ్యయాల భారం కొంతమేరకైనా తగ్గించుకునేందుకు ఈ చర్య తీసుకున్నట్టు రెండు కంపెనీలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. తమ కార్ల ధరలు 4 శాతం మేరకు పెంచుతున్నట్టు మారుతి ప్రకటించగా తమ వాణిజ్య వాహనాల ధరలు 2 శాతం పెంచుతున్నట్టు టాటా మోటార్స్ తెలిపింది.

# ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న F29 సిరీస్‌తో F సిరీస్ ప్రజాదరణను పెంచుకున్న ఒప్పో ఇండియా



**న్యూఢిల్లీ-నవభూమి:** డ్యూరబుల్ ఛాంపియన్ ఒప్పో F29 సిరీస్‌ను మార్చి 20, 2025న ఒప్పో ఇండియా విడుదల చేస్తోంది. లక్షలాది మంది డ్రైవర్లు, డెలివరీ భాగస్వాములు, దుకాణదారులు, వ్యాపార యజమానులను కలిగి ఉన్న భారతదేశ గిగ్ ఎకానమీ డిమాండ్లను తీర్చేందుకు మన్నిక, విశ్వసనీయత పనితీరు ఆధారిత స్మార్ట్‌ఫోన్‌లను అందించడంలో .ఒప్పో తన వ్యూహాత్మక నిబద్ధతను %F%29 సిరీస్ హైలైట్ చేస్తుంది.రూ.25,000 కన్నా తక్కువ ధరకే లభించే విభాగంలో ఒప్పో F% సిరీస్ అగ్రస్థానంలో ఉంది.

ప్రతి కొత్త ఎడిషన్ దాని ముందుతరం మోడల్ నిర్దేశించిన మన్నిక, నాణ్యతా ప్రమాణాలపై F సిరీస్‌ను రూపొందించగా, F25 PROతో పోలిస్తే OPPO F27 Pro విడుదలైన తర్వాత మొదటి ఆరు నెలల్లో దాని అమ్మకాలలో 30% ఆకట్టుకునే వృద్ధితో ఇది నిరూపితమైంది. ఈ సిరీస్‌కు మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక నాగ్‌పూర్ వంటి ప్రాంతాలలో చక్కని డిమాండ్ ఇప్పటికీ కొనసాగుతోంది. అదనంగా, కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం, మన్నిక, ఉత్పత్తి నాణ్యతపై ఒప్పో దృష్టి సారించడం ద్వారా నీరు ధూళి నిరోధకతకు అత్యంత ప్రాధాన్యత కలిగిన బ్రాండ్‌గా గుర్తింపు పొందింది.భారతదేశంలో పరీక్షించి, భారతదేశం కోసం తయారు చేశారు.ఒప్పో ఇండియాగ్రేటర్ నోయిడా ఫెసిలిటీలో తయారవుతున్న F%29 సిరీస్ - 180g తూకంతో తేలికగా కేవలం 7.55mm పల్చగా- భారతదేశంలో తయారు కావడమే కాకుండా, అత్యధిక స్థాయి ధూళి, నీటి ప్రవేశానికి వ్యతిరేకంగా ధృవీకరించే IP66, IP68 IP69 రేటింగ్ కోసం భారతదేశంలోని SGS ద్వారా పరీక్షించారు. దీని IP66 రేటింగ్ శక్తివంతమైన వాటర్ జెట్‌లకు వ్యతిరేకంగా రక్షణ కల్పిస్తుందని ధృవీకరిస్తుందిబీ తడి పరిస్థితుల్లో పనిచేసే వినియోగదారులకు, విక్రేతల నుంచి నిర్మాణ కార్మికుల వరకు అనువైనది. అదే విధంగా IP68 రేటింగ్ దీనిని 1.5 మీటర్ల నీటిలో 30 నిమిషాల పాటు మునిగి ఉన్నా ఎటువంటి హాని కలుగదని భరోసా ఇస్తుందిబీ దీని అర్థం నీటితో నిండిన గుంతలు కిచెన్ సింక్‌లలో ప్రమాదవశాత్తు పడిపోయినప్పుడు తట్టుకునేలా దీన్ని తయారు చేశారు. అయితే దాని IP69 ¹ంటింగ్ 80C వరకు అధిక పీడనం, అధిక-ఉష్ణోగ్రత నీటి జెట్‌లను తట్టుకోగలదని సూచిస్తుంది. ఇది పారిశ్రామిక సెట్టింగ్‌లలో లేదా అత్యంత తేమతో కూడిన వాతావరణ పరిస్థితులలో పనిచేసే వారికి సరైనది అని చెప్పవచ్చు.డ్యామేజ్-ప్రూఫ్ 360ళీ ఆర్మర్ బాడీఇది ఊహించని డ్రాప్స్ దెబ్బలను తట్టుకునే 360 ఆర్మర్ బాడీని ఒప్పో F29 సిరీస్ కలిగి ఉంది. అదే విధంగా .ఒప్పో F29 సిరీస్‌లోని స్పాంజ్ బయోనిక్ కుషనింగ్, పడిపోయినప్పుడు నష్టాన్ని తగ్గించేందుకు ప్రభావాన్ని గ్రహిస్తుంది. అయితే దాని ఎలివేటెడ్ బ్యాటరీ కవర్ సైడ్ ఫ్రేమ్ అదనపు రక్షణ పొరను జోడిస్తాయి. అదే సమయంలో,.ఒప్పో F29 సిరీస్‌లోని కొత్త రైజ్డ్ కార్నర్ డిజైన్ కవర్ నాలుగు మూలలను దెబ్బతినకుండా రక్షిస్తుంది.స్మార్ట్‌ఫోన్‌లోని లెన్స్ ప్రొటెక్షన్ రింగ్, దృఢత్వం కలిగిన గాజుతో తయారు చేశారు. ఇది గీతలు పడకుండా ఉండటానికి కెమెరా లెన్స్ కన్నా ఎత్తులో ఉంటుంది. అలాగే, దాని మదర్‌బోర్డును రక్షించే స్మార్ట్‌ఫోన్ అంతర్గత ఫ్రేమ్‌ను ఏరోస్పేస్-గ్రేడ్ అల్యూమినియం మిశ్రమలోహానికి అప్‌గ్రేడ్ చేశారుబీ ఇది దాని మునుపటి ఫోన్ కన్నా నిర్మాణ సమగ్రతను 10% పెంచుతుంది.

**ఆల్ రౌండ్ డ్యూరబుల్ ఛాంపియన్**


నీరు ధూళి నిరోధకతకులి అత్యంత ప్రాధాన్యత కలిగిన బ్రాండ్ .ఒప్పో కాగా, దాని F29 సిరీస్‌ను 14 మిలిటరీ స్టాండర్డ్ పరీక్షలకు గురిచేసింది. ఇవి అధిక ఉష్ణోగ్రత, తక్కువ ఉష్ణోగ్రత, షాక్, వర్షం, గడ్డకట్టే నీరు, ఇసుక, ధూళి, ఉప్పు పొగమంచు, సోలార్ రేడియేషన్, తేమ, కంపనం, ద్రవ కాలుష్యం, మోల్డ్, ౯లోడ్‌లను పరీక్షించే యాక్సలరేషన్ నిరోధకతకు వ్యతిరేకంగా రక్షణను ధ్రువీకరిస్తాయి.

**సరికొత్త హంటర్ యాంటెన్నా ఆర్కిటెక్చర్**

పరిశ్రమలో-మొట్టమొదటి హంటర్ యాంటెన్నా ఆర్కిటెక్చర్‌తో మొబైల్ కనెక్టివిటీలో సిరీస్ విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుంది. ఇది సిగ్నల్ బలాన్ని 300% పెంచుతుంది.

# భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఫ్యాషన్ లీజర్ బ్రాండ్ నొబెరో ఇప్పుడు హైదరాబాద్‌లో ఆఫ్‌లైన్‌లో అందుబాటులోకి









**న్యూఢిల్లీ-నవభూమి:**TMRW House of Brands నుంచి ప్రయాణాలకు అనువైన ఫ్యాషన్ లీజర్TM బ్రాండ్ Nobero నేడు ఒక ముఖ్యమైన మైలురాయికి చేరుకుంది. ఈ బ్రాండ్ హైదరాబాద్ శరత్ సిటీ మాల్‌లో తమ మొట్టమొదటి ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. నొబెరో ప్రారంభించిన మొట్టమొదటి ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ అవుట్‌లెట్, బ్రాండ్ ఉత్తమ కలెక్షన్‌ను ప్రదర్శించేందుకు కేంద్రంగా మారనుంది. అదే సమయంలో, ఈ కేంద్రం వ్యూహాత్మకంగా తయారు చేసే ఉత్తేజకరమైన కొత్త ఉత్పత్తులు, కేటగిరీ లాంచ్‌లకు సరైన వేదికను అందిస్తుంది. మొదటి స్టోర్‌ను ప్రారంభించిన నొబెరో 2026 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశవ్యాప్తంగా 25 స్టోర్‌లను ప్రారంభించాలన్న లక్ష్యంతో తన ప్రతిష్టాత్మక ఆఫ్‌లైన్ ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. "నొబెరో హైపర్ గ్రోత్‌ను పెంచడంలో భాగంగా, ఫ్యాషన్ లీజర్ విభాగంలో ప్రముఖ కేటగిరీ సృష్టికర్తగా, వినియోగదారులకు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ షాపింగ్ సౌలభ్యాన్ని అందించడం బ్రాండ్ ప్రయాణంలో తదుపరి దశ" అని TMRW హౌస్ ఆఫ్ బ్రాండ్స్ సీఈఓ, సహ వ్యవస్థా పకుడు ప్రశాంత్ ఆలూరు పేర్కొన్నారు. అన్ని బ్రాండ్‌లు D2C, ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ అవుట్‌లెట్‌లు, ప్రముఖ ఇ-కామర్స్ మార్కెట్ ప్లేస్‌లలో ఉన్నతమైన షాపింగ్ అనుభవాన్ని అదించాలన్న TMRWలో మా వ్యూహానికి ఇది అనుగుణంగా ఉంది. హైదరాబాద్ శరత్ సిటీ మాల్‌లో విలక్షణమైన రిటైల్ అనుభవాన్ని కలిగి ఉన్న నొబెరో, ఇప్పుడు ఆఫ్‌లైన్ క్లబ్‌లో సరికొత్తగా చేరుతోంది! గత కొన్ని త్రైమాసికాల్లో వేగవంతమైన వృద్ధితో, TMRW పోర్ట్‌ఫోలియోలోని అన్ని బ్రాండ్‌లకు ఓమ్ని-ఛానల్ ఉనికిని అందించేలా 30 స్టోర్‌లను మేము ప్రారంభించాము. అదే విధంగా 2026 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 125oo స్టోర్‌లకు ఈ సంఖ్యను పెంచుకునేందుకు మేము దూకుడుతో విస్తరణ వేగాన్ని కొనసాగిస్తాము" అని వివరించారు. విలక్షణమైన డిజైన్ భాష, క్రియాత్మక సౌకర్యానికి గుర్తింపు కలిగిన నొబెరో, భారతదేశం వ్యాప్తంగా నమ్మకమైన మిలీనియల్ వినియోగదారుల మదిలో ఫ్యాషన్ ఫార్వర్డ్ అథ్లెయిజర్ విభాగంలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, వారి వృత్తిపరంగా, వెలుపల జీవితాన్ని జాగ్రత్తగా చూసుకోవడం పట్ల వారి ప్రాధాన్యతను స్పష్టంగా సూచిస్తున్నాయి. ఈ అభిప్రాయాలను తెలుసుకుని, బ్రాండ్ తనను తాను నిరంతరం తిరిగి ఆవిష్కరించుకుంటూనే ఉంది. ఫలితం స్టైలిష్‌గానే కాకుండా, కానీ సౌకర్యవంతం గానూ ఉంటుంది.నొబెరో సహ వ్యవస్థాపకుడు కార్తిక్ వెంకట్ మాట్లాడుతూ, "ఈ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ అవుట్‌లెట్ ద్వారా నొబెరోను మా వినియోగదారులకు మరింత చేరువుగా తీసుకువెళుతున్నందుకు మేము చాలా ఉత్సాహంగా ఉన్నాము. మా వినియోగదారులు బ్రాండ్ ఉత్పత్తులు, స్ఫూర్తిని చేరువగా ఆస్వాదించడం, వ్యక్తిగత పరస్పర చర్యలు ఆఫ్‌లైన్‌లోకి వెళ్లడం వెనుక ఉన్న మా ముఖ్య ప్రేరణ. ఈ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ అవుట్‌లెట్‌తో మేము 3 ప్రధాన లక్ష్యాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము:ఆలోచనాత్మకంగా రూపొందించిన డిజైన్ భాష ద్వారా మా 'ట్రావెలర్ బ్రాండ్' కథకు వాస్తవ రూపాన్ని ఇస్తాము. మేము ప్లాన్ చేసిన కొన్ని అత్యంత ఉత్తేజకరమైన కొత్త ఉత్పత్తి లాంచ్‌ల కోసం దీన్ని 'రన్‌వే'గా చేసుకుంటాము. వినియోగదారుల నుంచి రియల్-టైమ్ అభిప్రాయాన్ని పొందేందుకు, నొబెరో-అనుభవాన్ని మెరుగుపరచేందుకు ఈ ప్లాట్‌ఫారాన్ని వినియోగించుకుంటాము.

## ఈ చెట్టు ఆకులు అమ్మితే ఏడాదంతా డబ్బే డబ్బు..



**న్యూఢిల్లీ-నవభూమి:**సర్వస్వం ధారపోసి పంటలు పండిస్తుంటారు రైతులు. వాతావరణ పరిస్థితులు, దళారులు, మార్కెట్ డిమాండ్ వీటన్నింటిని దాటుకున్న తర్వాత పెట్టిన పెట్టుబడి తిరిగొస్తేనే గొప్ప. కానీ, ఈ మధ్య చాలామంది యువత టెక్నాలజీని వ్యవసాయానికి జోడిస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. లక్షల్లో జీతాలొచ్చే ఉద్యోగాలు వదిలేసి సొంతూళ్లలో వ్యవసాయదారుడిగా స్థిరపడుతున్నారు. సక్సెస్ అవుతున్న వారిలో నూటికి తొంభై మంది పాటించే ఏకైక సూత్రం.. సరైన పంటను ఎంపిక చేసుకోవడం. మార్కెట్లో ఏ పంటకు మంచి డిమాండ్ ఉంది. ఎంత ఆదాయం వస్తుంది అని తెలుసుకున్న తర్వాతే పక్కా ప్లానింగ్‌తో సాకులోకి దిగుతున్నారు యువరైతులు. అలాంటి ఓ వినూత్న వాణిజ్య పంట గురించి ఇప్పుడు వివరంగా చెప్పుకుందాం.ఈ చెట్టుకు ఎంత డిమాండ్ అంటే..కామినీ చెట్టు. దీని గురించి మీరెప్పుడైనా విన్నారా.పేరు వినకపోయి ఉండచ్చేమో కానీ కచ్చితంగా ఎక్కడైనా చూసే ఉంటారు. ఎందుకంటే ఈ చెట్టు ఆకులు,పూలు పెళ్లి వేడుకలు, ఇతర ఫంక్షన్లు, అలంకరణలు ఇలా చాలాచోట్ల అధిక మొత్తంలో వినియోగిస్తున్నారు. అంతేకాదు.. ఆయుర్వేద మందులు, వంటల తయారీలో, స్కిన్ కేర్, హెయిర్ కేర్ ఉత్పత్తుల్లో కూడా వాడుతుంటారు. ఇన్ని చోట్ల వాడుతున్నారు కాబట్టే మార్కెట్లో ఈ చెట్టు ఆకులు, పూలకు ఊహించనంత డిమాండ్ ఉంది. అదీగాక ఈ చెట్టు ఆకులు, పూలు త్వరగా కుళ్లిపోవు. వాడిపోవు.ఎక్కువ సమయం తాజాగానే ఉంటాయి.తక్కువ ఖర్చు.. దీర్ఘకాలిక లాభాలు..ఇది గమనించే బెంగాల్‌కు చెందిన ఓ యువకుడు ఈ కామినీ చెట్లు పెంచి ఏడాది తిరక్కుండానే లక్షలు సంపాదించాడు. తక్కువ ఖర్చుతో నాటే కామినీ పంట దీర్ఘకాలం పాటు మీకు ఆదాయాన్ని అందిస్తూనే ఉంటుంది. నాటిన తర్వాత క్రమం తప్పకుండా నీరు, ఎరువులు ఇస్తే సరిపోతుంది. ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాల్సిన పనిలేదు. మెయింటెనెన్స్ ఖర్చు చాలా స్వల్పం. ఒకసారి నాటాక ప్రతి సంవత్సరం చెట్టు నుంచి కొమ్మలను తీసుకోవచ్చు. ఒక కొమ్మను నరికితే దాని స్థానం మరిన్ని కొమ్మలు పుట్టుకొస్తాయి. ఆకులన్నీ గంపగుత్తగా ఒకేసారి బరువు తూచి మార్కెట్లో అమ్ముకోవచ్చు. ఈ పంట సాగు కోసం ఏమేం అవసరం అవుతాయి. లాభాలు, మార్కెటింగ్ తదితర వివరాలు చూద్దాం.పెట్టుబడి : ఒక ఎకరాకు కనీస పెట్టుబడి- రూ.25,000

సంవత్సర లాభం : రూ.3 లక్షలు (10 టన్నులు అమ్మితే)

5 ఏళ్లలో వచ్చే లాభం: రూ.72 లక్ష లు (కనీసం)

మార్కెటింగ్ : కిలోకు రూ.30. ఆన్‌లైన్ ప్లాట్ ఫాంల ద్వారా వీటిని మార్కెటింగ్ చేసుకోవచ్చు.మీరు చేసే బిజినెస్ స్థాయిని బట్టి అవసరమయ్యే లైసెన్సులు, పంటకు ఇన్సూరెన్స్ చేయించాలి. స్థానికంగా ఉన్న వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని పంట సాగు చేస్తే మరీ మంచిది.

## ఖజానాకు కాసుల గలగల


**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు (మార్చి 16 నాటికి) ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 13.13 శాతం వృద్ధితో రూ.21.26 లక్షల కోట్లకు చేరాయి. ముందస్తు పన్ను చెల్లింపులు పుంజుకోవడం ఇందుకు దోహదపడిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం నాలుగు వాయిదాల్లో ముందస్తు పన్ను వసూళ్లు రూ.10.44 లక్షల కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో వసూలైన రూ.9.11 లక్షల కోట్లతో పోలిస్తే 14.62 శాతం వృద్ధి నమోదైంది. 2024-25 చివరి విడత ముందస్తు పన్ను చెల్లింపుల గడువు శనివారం నాటితో ముగిసింది. ఈ సారి కార్పొరేట్ కంపెనీల ముందస్తు పన్ను చెల్లింపులు వార్షిక ప్రాతిపదికన 12.54 శాతం వృద్ధితో రూ.7.57 లక్షల కోట్లకు, కార్పొరేటేతర ముందస్తు పన్ను చెల్లింపులు 20.47 శాతం వృద్ధితో రూ.2.87 లక్షల కోట్లకు పెరిగాయి. ఐటీ చట్టంలోని సెక్షన్ 208 ప్రకారం.. సంబంధిత ఆర్థిక సంవత్సరానికి రూ.10,000కు పైగా పన్ను చెల్లించాల్సి ఉన్న వ్యక్తులు (వేతనజీవులు సహా) కూడా ముందుస్తుగానే పన్ను చెల్లించాల్సి ఉంటుం ది. 2024 ఏప్రిల్ 1 నుంచి ఆదివారం నాటి (తేదీ 16) వరకు వ్యక్తిగత ఆదాయ పన్ను సహా మొత్తం కార్పొరేటేతర పన్నుల నికర ఆదాయం 17 శాతం పెరిగి రూ.11.01 లక్షల కోట్లకు చేరింది. కార్పొరేట్ పన్ను నికర రాబడి మాత్రం 7 శాతం వృద్ధితో రూ.9.69 లక్షల కోట్లకు పరిమితమైంది. సెక్యూరిటీ లావాదేవీ పన్నుల నికర ఆదాయం 56 శాతం పెరిగి రూ.53,095 కోట్లుగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.4.60 లక్షల కోట్ల రిఫండ్స్ జారీ చేయడం జరిగింది. కాగా, స్థూల పన్ను వసూళ్లు 16.15 శాతం వృద్ధితో రూ.25.86 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్నుల రూపంలో రూ.22.37 లక్షల కోట్లు సమకూరవచ్చని కేంద్రం అంచనా.

### ఆదాయం రూ.10 కోట్ల పైమాటే..

**న్యూఢిల్లీ-నవభూమి:** ఆదాయపు పన్ను శాఖ తాజా డేటా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 28 వరకు 9.11 కోట్ల మంది ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) సమర్పించారు. అందులో 8.56 కోట్ల రిటర్నుల ఈ-వెరిఫికేషన్ పూర్తయిందని.. రూ.3.92 లక్షల కోట్ల

# భారీగా పడుతున్న డాలర్ విలువ..

## బంగారం ధరల్లో భారీ మార్పు.. ఇప్పుడు కొనొచ్చా?




**న్యూఢిల్లీ-నవభూమి:** కొంతకాలంగా అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు.. ముఖ్యంగా సుంకాల విధింపు నేపథ్యంలో అక్కడ ఆర్థిక మాంద్యం భయాలు పెరిగిపోయాయి. ఇంకా.. ట్రేడ్ వార్ అంచనాలు పెరిగిపోయాయి. దీంతో స్టాక్ మార్కెట్లు పడిపోతుండటంతో పాటుగా.. డాలర్ విలువ తగ్గుతోంది. తాజాగా యూఎస్ డాలర్ మరోసారి భారీగా తగ్గింది. డాలర్ ఇండెక్స్ విలువ జనవరిలో అత్యధికంగా 110కి చేరగా.. అక్కడి నుంచి 6.40 శాతం పడిపోయింది. ఈ క్రమంలోనే తాజాగా 5 నెలల కనిష్టానికి డాలర్ దిగొచ్చింది. ఈ క్రమంలోనే మరోవైపు బంగారం ధరలు పెరుగుతున్నాయి.

సాధారణంగానే బంగారం ధరలకు, డాలర్‌కు మధ్య విలోమ సంబంధం ఉంటుంది. అంటే డాలర్ విలువ పెరిగితే బంగారం ధర తగ్గుతుంది. ఇదే సమయంలో డాలర్ విలువ పతనమైతే.. గోల్డ్ రేటు తగ్గుతుంటుంది. ఇప్పుడు అదే జరుగుతోంది. డాలర్ విలువ పడిపోతుండగా.. గోల్డ్ రేట్లు ఆల్ టైమ్ గరిష్టాలకు చేరాయి. మార్చి 18న మరో కొత్త గరిష్ట స్థాయిని నమోదు చేసింది.

ప్రస్తుతం వార్త రాస్తున్న సమయంలో మార్చి 18 సాయంత్రం 6 గంటలకు స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు (31.10 గ్రాములు) 3035 డాలర్లపైకి చేరింది. ఇవాళ ఉదయం చూసినట్లయితే ఇది 3 వేల డాలర్ల దగ్గర మాత్రమే ఉండేది. ఒకవైపు ఆర్థిక అనిశ్చితి.. అమెరికా మాంద్యం భయాలు.. డాలర్ పతనం.. ఇవన్నీ బంగారాన్ని సురక్షిత పెట్టుబడి సాధనంగా మరింత బలం చేకూరుస్తోంది. ఈ క్రమంలోనే పసిడిపై పెట్టుబడులు పెరిగి బంగారం ధర మరింత పెరిగేలా చేస్తోంది. తాజాగా చేరిన ధర జీవన కాల గరిష్టం కావడం విశేషం.దేశీయ మార్కెట్లలో చూస్తే ఎంసీఎక్స్ బంగారం ధరలు ఏప్రిల్ 4 కాంట్రాక్టులకు సంబంధించి.. మార్చి 18న రూ. 88,672 వద్ద ఆల్ టైమ్ గరిష్ట స్థాయిని తాకాయి. అయితే ఇప్పుడు భవిష్యత్తులో బంగారం ధరల్ని నిర్ణయించేది యూఎస్ ఫెడ్ పాలసీ అని చెబుతున్నారు. అవును.. ఫెడ్ వడ్డీ రేట్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అంతా ఎదురుచూస్తున్నారు. ఫెడ్ వడ్డీ రేట్లను గతేడాది సెప్టెంబర్ నుంచి వరుసగా 3 సమీక్షల్లో 100 బేసిస్ పాయింట్లు తగ్గించి 4.25 శాతానికి చేర్చింది. జనవరిలో యథాతథంగానే ఉంచింది. ఇప్పుడు ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగానే ఉంచుతుందని భావిస్తున్నారు. ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తే గనుక.. మళ్లీ బంగారం ధరలు మరింత గరిష్టాలకు చేరొచ్చనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుతానికి మాత్రం గోల్డ్ ఇంకా సానుకూలంగానే ఉందని.. సమీప భవిష్యత్తులో 3100 డాలర్లకు చేరొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇది బంగారంపై ఇన్వెస్ట్ చేసే వారికి లాభాలు చేకూర్చుతుందని అంటున్నారు. భౌతికంగా కొనుగోలు చేసేవారికి మాత్రం ఇప్పట్లో కష్టమేనని అంటున్నారు.

## నెలకు రూ. 15 వేలతో ఇలా చేతికి కోటి.. ఈ సిప్ ఫార్ములా తెలుసా.. ఎన్నేళ్లు పడుతుంది?




**న్యూఢిల్లీ-నవభూమి:** పెట్టుబడుల విషయానికి వస్తే మనకు మార్కెట్లో ఎన్నో ఆప్షన్లు కనిపిస్తాయి. ఇక వీటిల్లో రిస్క్ ఉన్నప్పటికీ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా చాలా మంది చూస్తారు. వీటిల్లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ బెస్ట్ ఆప్షన్స్ అని నిపుణులు చెబుతుంటారు. గత కొంత కాలంగా స్టాక్ మార్కెట్ డౌన్ ఉన్న నేపథ్యంలో.. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు తగ్గిపోయాయి. అయినా.. లాంగ్ రన్‌లో మెరుగైన రాబడి అందుతుందని అంటుంటారు. సిప్ అంటే.. రెగ్యులర్ ఇంటర్వెల్స్‌లో నిర్దిష్ట మొత్తం పెట్టుబడి పెట్టుకుంటూ పోవాల్సి వస్తుంది. ఇక్కడ సిప్ నెలవారీగా లేదా త్రైమాసిక ప్రాతిపదికన లేదా వార్షిక ప్రాతిపదికన ఉండొచ్చు. ఇది ఇన్వెస్టర్ ఆసక్తిని బట్టి ఉంటుంది. మ్యూచువల్ ఫండ్లలో సిప్ పెట్టుబడులపై ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి.వీటిల్లో మనం ఎప్పుడైనా బయటికి రావొచ్చు. ఎప్పుడైనా కావాలంటే పెట్టుబడుల్ని ఉపసంహరించుకోవచ్చు. కేవలం ఈఎల్ఎస్ఎస్ మ్యూచువల్ ఫండ్లకు మాత్రం మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. మిగతావి మనం లాభాలు ఎప్పుడు వచ్చినా తీసుకునేందుకు వీలుంటుంది. అయితే మ్యూచువల్ ఫండ్లలో కూడా ఒక క్రమపద్ధతిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించొచ్చు. ఇదే 15x15x15 సిప్ ఫార్ములా. దీని గురించి ఇప్పుడు చూద్దాం.ఇది సాధారణంగా రూ. కోటి ఫండ్ సృష్టించేందుకు ఉద్దేశించిందని చెప్పొచ్చు. అది కూడా 15 సంవత్సరాల్లోనే. ఈ రూల్ గురించి ఇప్పుడు చూద్దాం. ఈ ఫార్ములా ప్రకారం.. అన్నీ 15 సంఖ్యతోనే ముడిపడి ఉంటాయి. దీంట్లో నెలకు రూ. 15 వేల చొప్పున సిప్ చేయాలన్నమాట. ఇంకా వార్షిక రాబడి సగటున 15 శాతం అంచనా వేయాలి. ఇక 15 ఏళ్ల పాటు సిప్ పెట్టుబడి పెట్టాలి. మనం ఇప్పుడు ఈ లెక్కన రిటర్న్స్ ఎలా ఉంటాయో తెలుసుకుందాం.మీరు నెలకు రూ .15 వేల సిప్ చేస్తూ పోతే.. 15 ఏళ్లలో మీ మొత్తం పెట్టుబడి రూ. 27 లక్షలు అవుతుంది. ఇక 15 శాతం వార్షిక రాబడి చొప్పున లాభం రూ. 74.52 లక్షలకుపైగా వస్తుంది. అప్పుడు చేతికి మొత్తం రూ. 1.01 కోట్ల వరకు వస్తుంది. ఇక్కడ రిటర్న్స్ 15 శాతానికి మించి ఉంటే ఇంకా ఎక్కువ రాబడి ఆశించవచ్చు. మ్యూచువల్ ఫండ్స్‌లో చాలా పథకాలు సగటున 15 శాతానికి మించి రిటర్న్స్ ఇచ్చినవి ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు కూడా స్టాక్ మార్కెట్‌తో లింక్ అయి ఉంటాయి కాబట్టి.. ఇక్కడ రిస్క్ ఉంటుంది. అయితే దీర్ఘకాలం ఇన్వెస్ట్ చేయడం ద్వారా రిస్క్ తగ్గించుకోవచ్చుని.. మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అంటుంటారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ బుధవారం 19 ı మార్చి ı 2025



## 52 సార్లు దుబాయ్‌కు వెళ్లొచ్చిన రాన్య రావు.. గోల్డ్ స్మగ్లింగ్ కేసులో సంచలన నిజాలు..



**బెంగళూరు-నవభూమి:**బంగారం స్మగ్లింగ్ చేస్తూ దొరికిపోయిన కన్నడ నటి రాన్య రావు కేసులో సంచలన నిజాలు బయటకు వస్తున్నాయి. 14 కేజీల స్మగ్లింగ్ బంగారంతో రెండు వారాల క్రితం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో దిగిన రాన్యా రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో విదేశాల నుంచి 17 బంగారు బిస్కెట్లు తీసుకువచ్చినట్లు ఆమె అంగీకరించినట్లు ఎఫ్ఐఆర్ ద్వారా తెలిసింది. ఏడాది కాలంగా తాను చేసిన విదేశీ టూర్ల గురించి కూడా ఆమె చెప్పింది.డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ఈ కేసులో కీలక సమాచారాన్ని కోర్టుకు అందజేశారు. ఆ సమాచారం ప్రకారం.. రాన్య గత రెండేళ్లలో 52 సార్లు దుబాయ్ వెళ్లి వచ్చింది. అందులో 26 సార్లు ఆమెతో పాటు నటుడు తరుణ్ రాజు కూడా ఉన్నాడు. వీరు ప్రతిసారి ఉదయం దుబాయ్‌కు వెళ్లడం, సాయంత్రానికి తిరిగి రావడం చేసేవారు. వీరి ప్రయాణ వివరాలు పోలీసులకు అనుమానం కలిగించాయి. వీరిద్దరూ గోల్డ్ స్మగ్లింగ్ చేస్తున్నట్టు పోలీసులకు అనుమానం వచ్చింది. ముందుగా రాన్యను అరెస్ట్ చేశారు.అనంతరం తరుణ్ రాజును కూడా బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లోనే బంగారంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో బెయిల్ కావాలని విజ్ఞప్తి చేస్తూ తరుణ్ రాజు కోర్టును ఆశ్రయించాడు. అతడికి బెయిల్ ఇవ్వకూడదని డీఆర్ఐ వాదించింది. కాగా, రాన్య, తరుణ్ రాజు మధ్య చాలా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సాక్ష్యాలను కూడా పోలీసులు సేకరించినట్టు తెలుస్తోంది.

## అమెరికా నుంచి లేడీ డాక్టర్ బహిష్కరణ... వైరల్‌గా బైబై రాషా!



**అమెరికా-నవభూమి:**కిడ్నీ మార్పిడి స్పెషలిస్టుగా పనిచేస్తున్న లెబనీస్ మహిళా డాక్టర్ కు.. హెజ్ బొల్లాతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అమెరికా తమ దేశం నుంచి బహిష్కరించింది. అమెరికా తమ దేశం నుంచి ఓ మహిళా డాక్టర్ ను బహిష్కరించింది. ఇందులో భాగంగా... రోడ్ ఐలాండ్ లో కిడ్నీ మార్పిడి స్పెషలిస్టుగా పనిచేస్తున్న లెబనీస్ డాక్టర్ రాషా అలవీని దేశం నుంచి బహిష్కరించింది. హెజ్ బొల్లాతో ఈమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ అమెరికా ఈ నిర్ణయం ప్రకటించింది. ఈ సందర్భంగా వైట్ హౌస్ పోస్ట్ వైరల్ గా మారింది. అవును... కిడ్నీ మార్పిడి స్పెషలిస్టుగా పనిచేస్తున్న లెబనీస్ మహిళా డాక్టర్ కు.. హెజ్ బొల్లాతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అమెరికా తమ దేశం నుంచి బహిష్కరించింది. ఈ నేపథ్యంలో వైట్ హౌస్ ఓ పోస్ట్ చేసింది. ఇందులో భాగంగా... డొనాల్డ్ ట్రంప్ ఆమెకు బై చెబుతున్నట్లుగా ఉన్న ఫోటోను షేర్ చేస్తూ.. "బైబై రాషా" అంటూ రాసుకొచ్చింది. %ూశ్రీంశీ =ఘుు% - అధ్యక్షుడి సన్నిహితుడు అరెస్ట్... చైనాలో ఏమి జరుగుతోంది? వాస్తవానికి లెబనాన్ పర్యటనకు వెళ్లిన రాషా ఫిబ్రవరి 23న జరిగిన హెజ్ బొల్లా మాజీ అధినేత హసన్ నస్రల్లా (64) అంత్యక్రియలకు హాజరైనట్లు చెబుతున్నారు. దీంతో.. గతవారం బోస్టన్ లోగాన్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ చేరుకున్న ఆమెను అమెరికా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నస్రల్లా అంత్యక్రియలు హాజరైనట్లు ఆమె అంగీకరించినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో.. ఆమె ఫోన్ లో నస్రల్లాతో పాటు ఇతర హెజ్ బొల్లా నేతల ఫోటోలు ఉన్నాయని చెబుతున్నారు. అయితే.. ఆమె లెబనాన్ నుంచి బోస్టన్ చేరుకునే ముందు వాటిని డిలీట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయంపై అధికారులు ఆమెను ప్రశ్నించగా.. ఆమె అంగీకరించిందని అంటున్నారు. ఈ పాక్ మహిళ గుర్తున్నారా? విచారణలో భాగంగా ఈ విషయాలపై ఆమెను ప్రశ్నించగా.. వారి రాజకీయ కార్యకలాపాల గురించి కాకుండా మతపరమైన, ఆధ్యాత్మిక బోధనల విషయంలో మాత్రమే తాను హెజ్ బొల్లా నేతలను ఫాలో అవుతున్నట్లు ఆమె పేర్కొన్నారని చెబుతున్నారు. అయితే... హెజ్ బొల్లాతో సంబంధాలు ఉన్నాయని తెలియడంతో ఆమెను దేశం నుంచి బహిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. కాగా... 34ఏళ్ల రాషా బ్రౌన్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ గా పనిచేయడానికి హెచ్-1బీ వీసా ద్వారా అమెరికాకు వెళ్లారు. అయితే.. ఆమెను హెజ్ బొల్లా మద్దతుదారుగా గుర్తించినట్లు చెబుతోన్న అమెరికా అధికారులు.. ఆమెను దేశం నుంచి వెంటనే బహిష్కరించడానికి చర్యలు చేపట్టారు. అయితే.. దీన్ని ఆమె తరుపు న్యాయవాదులు వ్యతిరేకిస్తూ.. న్యాయపోరాటానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## మీరు గొడవపడ్డానికి మెట్రో రైలే దొరికిందా మహా తల్లులు..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఈ మధ్య కాలంలో జనాలకు ఓపిక బాగా తగ్గిపోయింది. కొంతమంది ప్రతీ చిన్న విషయానికి అనవసరమైన దానికంటే ఎక్కువగా స్పందిస్తూ ఉన్నారు. గొడవలు పెట్టుకుంటు న్నారు. మగవాళ్ల సంగతి పక్కన పెడితే ఆడవాళ్లు కూడా ఆగ్రహంతో ఊగిపోతున్నారు. తాజాగా, ఢిల్లీ మెట్రో రైలులో ఓ ఇద్దరు ఆడవాళ్ల మధ్య గొడవ జరిగింది. అందరి ముందు జుట్లు పట్టుకుని కొట్టుకున్నారు. వారిని విడిపించడానికి తోటి ప్రయాణికులు తెగ శ్రమించాల్సి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. కొద్దిరోజుల క్రితం ఓ ఇద్దరు ఆడవాళ్లు ఢిల్లీ మెట్రో రైలులో ప్రయాణిస్తూ ఉన్నారు. మెట్రో రైలులోని లేడీస్ కోచ్‌లో వారు ప్రయాణిస్తూ ఉన్నారు. కొద్ది సేపటి ఓ మహిళ మరో మహిళపై పడింది. దీంతో గొడవ మొదలైంది.

ఆ గొడవ కాస్తా చినికి చినికి గాలి వానలా అయింది. ఇద్దరూ ఒకరి జుట్టు ఒకరు పట్టుకుని కొట్టుకున్నారు. ఆ తర్వాత రెడ్ డ్రెస్ ధరించిన మహిళ బ్లూ కలర్ డ్రెస్ ధరించిన మహిళ జుట్టు పట్టుకుని లాగుతూ ఉంది. పక్కన ఉన్న వాళ్లు విడిపించడానికి ఎంత ప్రయత్నించినా ఆమె వదిలిపెట్టలేదు. కొద్ది సేపటి తర్వాత బ్లూ డ్రెస్ ఆమె .. రెడ్ డ్రెస్ మహిళనుంచి తప్పించుకుంది. వెంటనే ప్రత్యర్థి మహిళ జట్టుపట్టుకుంది. అటు, ఇటు లాగిపడేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోపై మిశ్రమ స్పందన వస్తోంది. 'ఢిల్లీ మెట్రో ప్రయాణికులకు ఫ్రీ ఎంటర్ టైన్ మెంట్ అందిస్తోంది'..'అది ఢిల్లీ మెట్రో కాదు... ఓ ఫైట్ క్లబ్' అంటూ కామెంట్లు చేస్తున్నారు.

వివాదాలకు కేరాఫ్ అడ్రస్..ఢిల్లీ మెట్రో వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. తరచుగా ఏదో ఒక గొడవతో వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. ఢిల్లీ మెట్రోలో మహిళలు గొడవ పడటం ఇది తొలిసారి కాదు. గతంలో కూడా చాలా సార్లు గొడవలు జరిగాయి. ఇక, ప్రేమికులు మెట్రోలో రెచ్చిపోయి ప్రవర్తిస్తుంటారు. ప్రతీ నిత్యం ఏదో ఒక వింత సంఘటన జరుగుతూనే ఉంటుంది. అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి. నిజం చెప్పాలంటే .. ఢిల్లీ మెట్రోలో ప్రయాణించే వారికి ఎంటర్‌టైన్‌మెంట్‌కు ఎలాంటి కొరత ఉండదు. ఈ విషయాన్ని జనాలే స్వయంగా చెబుతున్నారు.

## పోలీసులపై బీజేపీ నేత ఆగ్రహం.. కుక్కల వ్యాన్‌లో ఎక్కమంటారా..

**చెన్నై-నవభూమి:**టాస్మాక్‌లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ నుంగంబాక్కంలోని ఆ సంస్థ ప్రధానకార్యాలయం ముట్టడించేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించారు. పోలీసుల అనుమతి లేకుండా నిరసన ర్యాలీలు చేస్తున్న పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ సీనియర్ నేత నుంగంబాక్కం టాస్మాక్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల బెదిరింపులకు భయపడనంటూ ఆయన ముందుకు కదిలారు.

దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేసి పోలీసుల వ్యాన్‌లో ఆయనను ఎక్కించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన హెచ్ రాజా తనను కుక్కల వ్యాన్‌లో తీసుకెళతారా.. అని వారిపై మండిపడ్డారు. ఆ వ్యాన్ పోలీసుల వ్యాన్ అని ఎంతచెప్పినా ఆయన వినలేదు. చివరకు పోలీసులు అతడిని బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించి తరలించారు.

## బట్టతలని హేళన చేసిన భార్య.. కఠిన నిర్ణయం తీసుకున్న భర్త



**బెంగళూరు-నవభూమి:**బట్టతల ఉందని భార్య హేళన చేయడంతో భరించలేకపోయిన భర్త.. కఠిన నిర్ణయం తీసుకున్నాడు. భార్య తరుచూ సూటిపోటి మాటలతో వేధింపులకు గురిచేయడంతో అతడు తట్టుకోలేకపోయాడు. దీంతో అతడి మనసు విరిగి.. బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య వేధింపులతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన మరో ఘటన బెంగళూరు సమీపంలోని చామరాజనగరలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చామరాజనగర తాలూకా ఉడిగాల గ్రామానికి చెందిన పరశివమూర్తి (32) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాసిన అతడు... భార్య మమత తనను ఏవిధంగా వేధింపులకు గురిచేసిందీ వివరించాడు.భార్య మమత తరచుగా తనకు బట్టతల ఉందని ఎగతాళి చేస్తూ..జుట్టులేని నీతో బయటకు వెళ్లడానికి నాకు సిగ్గుగా ఉందని సూటిపోటి మాటలతో మనసు నొచ్చుకునేలా వ్యవహరించేది. వృత్తిరీత్యా డ్రైవర్ అయిన పరశివమూర్తికి జుట్టు పూర్తిగా రాలిపోయింది. దీనిని ఆమె తరుచూ గుర్తుచేస్తూ సూటిపోటి మాటలతో పరశివమూర్తి మనసు నొచ్చుకునేలా ప్రవర్తించేది. ఇదే సమయంలో అతడిపై వరకట్న వేధింపులకు పాల్పడుతున్నాడని తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే మమత.. అభ్యంతరకరమైన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేది.ఈ విషయంపై తరుచూ ఇరువురి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఎంతగా చెప్పినా భార్య తీరు మార్చుకోకపోవడంతో పరశివమూర్తి కలత చెందాడు. దీనికి తోడు తప్పుడు కేసులు పెట్టడంతో భరించలేకపోయాడు. చివరకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాను రాసిన సూసైడ్ నోట్‌లో బట్టతల ఉందని తరుచూ ఎగతాళి చేస్తున్నట్లు పేర్కొన్నాడు. కాగా, ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని,. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం కోసం తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని అతడి కుటుంబసభ్యులకు అప్పగించారు. సూసైడ్ నోట్, తల్లిదండ్రుల ఫిర్యాదుతో భార్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండేళ్ల కిందటే మమతతో పరమశివమూర్తికి వివాహం జరిగిందని కుటుంబసభ్యులు తెలిపారు. పెళ్లినాటికే అతడికి బట్టతల ఉండేదని, ఈ విషయం తెలిసే ఆమె వివాహం చేసుకుందని వివరించారు.

### రన్యా రావు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో భారీ ట్విస్ట్..

## తెలుగు నటుడు అరెస్ట్



**బెంగళూరు-నవభూమి:**కన్నడ నటి రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో తెలుగు నటుడు తరుణ్ రాజ్ కొండూరు అలియాస్ విరాట్ కొండూరు ను పోలీసులు మంగళవారం ఉదయం అరెస్ట్ చేశారు. దుబాయ్ నుంచి 14 కిలోల బంగారం తీసుకొస్తూ రెండు వారాల కిందట బెంగళూరు విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులకు చిక్కిన రన్యా రావు.. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆమె సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి కె .రామచంద్రరావు పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. దీనిపై కర్ణాటక ప్రభుత్వం కూడా విచారణకు ఆదేశించింది. డీజీపీ (పోలీస్ హౌసింగ్ బోర్డు) రామచంద్రరావును తప్పనిసరి సెలవుపై పంపింది. ఈ క్రమంలో ఐఏఎస్ అధికారి గౌరవ్ గుప్తా నేతృత్వంలోని దర్యాప్తు బృందం విచారించింది. ఈ మేరకు ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

ఈ కేసుకు సంబంధించి నివేదికను ప్రభుత్వానికి బుధవారంలోగా సమర్పించాల్సి ఉండటంతో. విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఈ క్రమంలో వారికి కీలక ఆధారం లభించింది. గోల్డ్ స్మగ్లింగ్ వెనుక సూత్రధారి తెలుగు నటుడు తరుణ్ రాజ్ ఉన్నట్టు గుర్తించారు.2019 నుంచి తరుణ్, రన్యా రావు మధ్య సంబంధాలు ఉన్నట్లుగా తేలింది. ఇరువురూ కలిసి పలుసార్లు దుబాయ్ వెళ్లినట్టు సమాచారం. దుబాయ్‌లో కస్టమ్స్ తనిఖీలకు పట్టుబడకుండా అమెరికా పాస్‌పోర్ట్ ఉపయోగించినట్టు డీఆర్ఐ గుర్తించింది. అలాగే, రన్యారావు సైతం ఈ పాస్‌పోర్ట్ సాయంతోనే బంగారం అక్రమంగా తరలించిన ట్టు దర్యాప్తులో గుర్తించారు.

బంగారం కొని, అమ్మడానికి దుబాయ్‌లో ఇద్దరూ కలిసి వీరా డైమండ్స్ ట్రేడింగ్ పేరుతో సంస్థను 2023లో స్థాపించినట్టు తేలింది. ఇందులో ఇరువురికి చెరో 50 శాతం వాటాలు ఉన్నట్టు వెల్లడయ్యింది. రన్యా రావు ప్రాథమిక పెట్టుబడిదారు కాగా.. లావాదేవీలన్నీ తరుణ్ చూస్తున్నట్టు బట్టబయలైంది. దుబాయ్‌కు బంగారం దిగుమతి చేసుకుని.. స్థానిక మార్కెట్‌లో విక్రయించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోబెంగళూరు పోలీసులు తరుణ్ రాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. రన్యా రావు ఈ వెంచర్‌కు ఏకైక ఆర్థిక మద్దతు దారుగా ఉన్నారు, కంపెనీని స్థాపిం చడానికి ఆమె సుమారు రూ.8-10 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఇందులో తరుణ్ ఆపరేషనల్ భాగస్వామిగా కీలక పాత్ర పోషించారు. దుబాయ్‌లోని డీలర్లకు చెల్లింపులు విదేశీ కరెన్సీలో జరిగాయని అధికారులు నిర్ధారించారు. అయితే, దుబాయ్‌కు చెందిన ఒక డీలర్ డబ్బు తీసుకుని, హ్యాండ్ ఇవ్వడంతో వారికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది, దీని ఫలితంగా రూ.1.7 కోట్ల మేర నష్టం వాటిల్లింది. రన్యా ఈ మొత్తాన్ని భారత్ నుంచి దుబాయ్‌కు హవాలా మార్గం ద్వారా బదిలీ చేసినట్లు తేలింది. కాగా, తరుణ్ రాజ్ పరిచయం అనే సినిమాతో పరిచయ మయ్యారు. ఆ తర్వాత మరో మూడు సినిమాల్లో నటించాడు.

## నోటికొచ్చినట్టు మాట్లాడేందుకు ఇది ఆర్ఎస్ఎస్ ఆఫీసు కాదు..



**బెంగళూరు-నవభూమి:** నోటికొచ్చి నట్టు మాట్లాడేందుకు ఇదేం ఆర్ఎస్ఎస్ ఆఫీసుకాదని మంత్రి ప్రియాంకఖర్గేవిరుచుకుపడ్డారు. శాసనసభలో సోమవారం మంత్రి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఎన్నికలలో ఓడించింది కాంగ్రెస్ లేదా సావర్కర్ అనే అంశంపై తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే అరవింద బెల్లద్ మాట్లాడుతూ.. కేబినెట్ నుంచి తొలగించింది ఎవరని, ఎన్నికలలో ఓడించింది ఎవరని, సమాధికి స్థలం ఇవ్వకుండా చేసింది ఏ పార్టీ అని ప్రశ్నిం చారు. మంత్రి ప్రియాంక ఖర్గే జోక్యం చేసుకుని 1952లో అంబేడ్కర్ రాసిన లేఖలో తనను ఓడించింది సావర్కర్ అంటూ రాసుకున్నారని, సదరు లేఖను ప్రదర్శిస్తే రాజీనామా చేస్తారా..? అని సవాల్ విసిరారు. లేఖలో కాంగ్రెస్ పేరు ప్రస్తావించలేదన్నారు. ఈ వివాదం ఇరుపక్షాల మధ్య మరింత వాగ్వాదానికి కారణమైంది. అంబేడ్కర్ రాసిన లేఖను మంత్రి సభలో చదివి వినిపించారు.రాష్ట్రంలో నకిలీ ఔషధాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు చేపడతామని వైద్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు. పరిషత్‌లో ప్రశ్నోత్తరాల వేళ సభ్యుడు ఎస్ రవి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధాన మిచ్చారు. నకిలీ మందులు తయారు చేసిన, విక్రయి స్తున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. 2022-23లో మొత్తం 6 కేసులు, 2023-24లో 10 కేసులు, 2024-25లో 4 కేసులు నమోదయ్యాయని, వెంటనే డ్రగ్ రీకాల్ పాలసీ అమలు చేసి మరింత కఠినచర్యలు చేపడ తామన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదన్నారు.

**కలబురగిలో నిమ్హాన్స్ మాదిరి ఆసుపత్రి: మంత్రి**

కలబురగి జిల్లాలోని మెడికల్ కాలేజీలో నిమ్హాన్స్ మాదిరి ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉద్దే శించిందని వైద్యవిద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ అభిప్రాయపడ్డారు. 2025-26 బడ్జెట్‌లోనూ ప్రక టించారన్నారు. పరిషత్‌లో ప్రశ్నోత్తరాల వేళ సభ్యుడు తిప్పణ్ణప్ప కమకనూరు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. మైసూరు, కలబురగి జిల్లాల్లో మెడికల్ కళాశాలల్లో నిమ్హాన్స్ మాదిరి సంస్థలను రూ.100కోట్లతో తగిన మానవ వనరులు, సౌలభ్యాలతో ఏర్పాటు చేయదలిచామన్నారు.

**సౌరశక్తి కేంద్రాలకు సిద్ధం: మంత్రి జార్జ్**

కలబురగి, రాయచూరు జిల్లాల్లో సౌరశక్తి, పవనశక్తి ఉత్పాదనా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్ పేర్కొన్నారు. పరిషత్‌లో ప్రశ్నోత్తరాల వేళ సభ్యుడు బసవనగౌడ బాదర్లి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ పవన, సౌరశక్తితోపాటు ఇతరత్రా మూలాలతో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కర్ణాటక ఆధునీకరించిన ఇంధన పాలసీ 2022-27ను అమలు చేయనున్నట్టు తెలిపారు. బిడ్ ద్వారా వ్యక్తిగతంగా లేదా గ్రూపులుగా, ప్రైవేట్ పార్కుల ద్వారా విద్యుత్ పథకాలను పంచుకునేలా ఉద్దేశించామన్నారు.

**యూనివర్సిటీల్లో గుణాత్మకత కాపాడతాం**

యూనివర్సిటీలలో బోధనా సిబ్బంది భర్తీ చేపట్టడం ద్వారా గుణాత్మకతను కాపాడుతామని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పేర్కొ న్నారు. పరిషత్‌లో సభ్యుడు ఎస్‌వీ సంకనూరు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ కర్ణాటక యూనివర్సిటీలో బోధన 416, బోధనేతల 849 పోస్టులు, బెంగళూరు యూనివర్సిటీలో బోధన 234, బోధనేతర 780, మైసూరు యూనివర్సిటీలో బోధన 171, బోధనేతర 268 పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. అన్ని పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ మోదం పొందాల్సి ఉందన్నారు. వీటిని సాధ్య మైనంత త్వరలోనే భర్తీ చేస్తామన్నారు.

## ప్రజాస్వామ్య దేశం పోలీసు రాజ్యంలా పని చేయొద్దు..: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:**దర్యాప్తు పూర్తి అయిన ప్పటికీ చిన్న చిన్న నేరాల్లో దిగువ కోర్టులు బెయిల్ నిరాకరించడంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సాధారణ కేసుల్లో సైతం నిందితులకు ఉపశమనం లభించకపోవడం దురదృష్టకరం అని.. అందుకే తాము జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చింది. 20 ఏళ్ల క్రితం ఇలాంటి కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టుకు కూడా చేరలేదని.. కానీ ఇప్పుడు సుప్రీం కోర్టు వరకు వస్తున్నాయని చెప్పింది. ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదని హితవు పలికింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. ఒక చిన్న కేసులో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తిని 2 సంవత్సరాలకు పైగా పోలీసులు కస్టడీలో ఉంచుకున్నారు. ఈ కేసు దర్యాప్తు పూర్తి అయి ఛార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ.. నిందితుడికి బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. దీంతో అతడు సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. సోమవారం రోజు విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం షాకింగ్ కామెంట్లు చేసింది. ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పపని చేయకూడదని హితవు పలికింది.

ఇక్కడ నిజా నిజాలతో సంబంధం లేకుండా చట్టం అమలు చేసే సంస్థలు కొందరు వ్యక్తులను నిర్బంధించేందుకు ఏక పక్ష ధోరణిలో వ్యవహరిస్తారని చెప్పుకొచ్చింది. ఇలా చేయడం ఆమోద యోగ్యం కాదంటూనే.. 20 ఏళ్ల క్రితం ఇలాంటి సాదారణ కేసు బెయిల్ పిటిషన్లు హైకోర్టుల వరకు కూడా వచ్చేవి కావని గుర్తు చేసింది. కానీ ఇప్పుడు నేరుగా సుప్రీం కోర్టుకే వస్తున్నాయని తెలిపింది. ట్రయల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించిన బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పునివ్వడం దిగ్భ్రాంతిని కల్గిస్తోందని చెప్పింది.దిగువ కోర్టులు బెయిల్ ఇవ్వకపోవడంతో.. సుప్రీం కోర్టుకు పెద్ద మొత్తంలో పిటిషన్లు వస్తున్నాయని.. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ఉజ్జల్ భూయాన్ లతో కూడి ధర్మాసనం పేర్కొంది. దీని గురించి అత్యున్నత న్యాయస్థానం ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదని.. చిన్న చిన్న నేరాలకు సంబంధించిన కేసుల్లో బెయిల్ మంజూరు చేయడంలో ట్రయల్ హైకోర్టులు మరింత ఉదారవాద వైఖరితో వ్యవహరించాలని సూచించింది.

అంతేకాకుండా దర్యాప్తు సమయంలో అరెస్టు చేయని, దర్యాప్తులో సహకరించని నిందితుడిని ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన తర్వాత అదుపులోకి తీసుకోకూడదని పేర్కొంది. బెయిల్ మంజూరు ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి కొత్త చట్టాన్ని రూపొందించాలని కూడా కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఇది చాలా అత్యవసరం అని కూడా వ్యాఖ్యానించింది. అలాగే నిందితుడి సాధారణ బెయిల్ దరఖాస్తును సాదారణంగా రెండు వారాల్లోపు, ఆరు వారాల్లోపు ముందస్తు బెయిల్

### మళ్లీ ట్రెండింగ్‌లో సీమా హైదర్...

## ఈ పాక్ మహిళ గుర్తున్నారా?



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆన్ లైన్ లో పరిచయమైన యువకుడి కోసం పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి అక్రమ మార్గంలో అడుగుపెట్టిన సీమా హైదర్ గురించి ఇప్పుడు పెద్దగా పరిచయం అవసరం లేదనే చెప్పాలి. గతకొంతకాలంగా జాతీయ మీడియా, ప్రాంతీయ మీడియా, సోషల్ మీడియా అనే తారతమ్యాలేమీ లేకుండా... ఎక్కడ చూసినా ఈమె గురించిన చర్చే జరిగిందన్నా అతిశయోక్తి కాదు! 2013లో సీమా హైదర్ నలుగురు పిల్లలతో కలిసి పాకిస్థాన్ నుంచి భారత్‌లో ఉన్న ఆన్ లైన్ ప్రేమికుడు సచిన్ మీనా కోసం రావడంతో తీవ్ర సంచలనం సృష్టించింది. అప్పట్లో ఆమె గురించి రకరకాల ప్రచారాలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె మరోసారి నెట్టింట చర్చనీయాంశంగా మారారు. అందుకు కారణం.. ఆమె ఐదో బిడ్డకు జన్మనివ్వడమే! అవును... భారత్ లో ఉన్న ప్రియుడి కోసం నలుగురు పిల్లలతో పాక్ నుంచి వచ్చేసిన సీమా హైదర్ జీవితంలో మరో గుడ్ న్యూస్ కలిగింది! ఇందులో భాగంగా.. సీమా హైదర్- సచిన్ మీనా దంపతులకు ఈ నెల 18 (మంగళవారం) ఆడపిల్ల జన్మించింది. దీంతో.. మరోసారి ఈ జంటకు సంబంధించిన వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. కాగా... ఆన్ లైన్ లో సీమా హైదర్ - సచిన్ మీనా మధ్య పరిచయం కాస్తా ప్రేమగా మారిన సంగతి తెలిసిందే! దీంతో... ప్రేమించినవాడి కోసం సీమ తన నలుగురు పిల్లలను తీసుకుని నేపాల్ మీదుగా భారత్ లో ప్రవేశించేందుకు ప్రయత్నించింది. అయితే.. అప్పటికే వీరిద్దరూ నేపాల్ లోని ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో భారత్ లోకి అక్రమంగా ప్రవేశించిన విషయానికి సంబంధించి కేసులు, బెయిల్ మొదలైన పరిణామాల అనంతరం పరిస్థితులు కాస్త సానుకూలంగా మారడంతో.. వీరిరువురూ ఉత్తరప్రదేశ్ లోని నొయిడాలో నివాసం ఉంటున్నారు. ఇక.. సీమా హైదర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటున్నారని.. ఆమె సంపాదన కూడా బాగుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సీమా హైదర్.. ఐదో బిడ్డకు జన్మనిచ్చిందని ఆమె లాయర్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన సీమా-సచిన్ ల న్యాయ సలహాదారు... మార్చి 18న ఈ దంపతులకు ఆడపిల్ల జన్మించింది.. ఆస్పత్రిలో డెలివరీ అయ్యింది అని తెలిపారు.

## టాస్మాక్ అవినీతిపై బీజేపీ పోరు.. త్వరలో సీఎం ఇంటి ముట్టడి

**చెన్నై-నవభూమి:**రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని టాస్మాక్ సంస్థలో రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తూ నగరంలో సోమవారం ఉదయం ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, రాస్తారోకో, ధర్నాల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మాజీ అధ్యక్షురాలు తమిళిసై, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ సహా పలువురిని అరెస్టు చేశారు. పలు జిల్లాల్లో బీజేపీ నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు చేసే టాస్మాక్ సంస్థ, మద్యం తయారీ కర్మాగారాల్లో ఆకస్మిక తనిఖీల్లో నిర్వహించిన ఈడీ అధికారులు దాదాపు రూ.1,000 కోట్ల మేర అవినీతి జరిగిందంటూ ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇటీవల ప్రకటించారు.ఈ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, బీజేపీ, ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం, పీఎంకే తదితర పార్టీలు టాస్మాక్ సంస్థ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో టాస్మాక్ అవినీతిని ఖండిస్తూ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఎగ్మూర్‌లోవున్న టాస్మాక్ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. దీంతో ఉదయం 6 గంటలకే అక్కడకు చేరుకున్న పోలీసులు టాస్మాక్ కార్యాలయం ముట్టిడికి యత్నించిన బీజేపీ సీనియర్ నేత ఎం.చక్రవర్తి, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్, రాష్ట్ర కార్యదర్శి వినోజ్‌సెల్వం తదితరులను అరెస్టు చేశారు.అదేవిధంగా సచివాలయాన్ని ముట్టడించేందుకు ఎగ్మూర్ రాజరత్నం స్టేడియం నుండి ర్యాలీగా వెళ్ళిన సుమారు వంద మంది కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. సాలిగ్రామంలోవున్న తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై ఇంటిముందు సుమారు 50మందికి పైగా పోలీసులు మోహరించారు. పోలీసులు వారిస్తున్నా లెక్కచేయని తమిళిసై పార్టీ కార్యకర్తలతో కలిసి ఎగ్మూర్‌లోని టాస్మాక్ ప్రధాన కార్యాలయానికి బయల్దేరడంతో వారిని కూడా అరెస్టు చేశారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | బుధవారం | 19 । మార్చి । 2025



# మంగపతికి నాని మరో ఛాన్స్ ఇస్తాడా..?

హీరోగానే కాదు నిర్మాతగా కూడా అదరగొట్టేస్తున్న నాని లేటెస్ట్ గా కోర్ట్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్నాడు. నిర్మాతగా సినిమాలు అందరు చేస్తారు కానీ నాని చేస్తున్న సినిమాలు మాత్రం డిఫరెంట్ గా ఉంటున్నాయి. అందుకే నాని నిర్మాణంలో వస్తున్న సినిమాలకు ఎక్కువ సక్సెస్ రేటు ఉంటుంది. కోర్ట్ సినిమాలో మిగతా పాత్రలన్నీ ఏమో కానీ మంగపతి క్యారెక్టర్ కి శివాజిని తీసుకోవడం సర్ ప్రైజింగ్ థింగ్ అని చెప్పొచ్చు. మంగపతి క్యారెక్టర్‌లో శివాజి నటన ఆకట్టుకుంది. సినిమా హైలెటెడ్ అంశాల్లో శివాజి చేసిన మంగపతి పాత్ర ఒకటి. అంతేకాదు ఈ సినిమా సక్సెస్ తో తన పాతికేళ్ల ఆకలి తీరింది. ఇలాంటి రోజు కోసమే తాను వెయిట్ చేస్తున్నా అంటూ శివాజి చెప్పడం ప్రత్యేకంగా నిలిచింది. ఐతే నాని కోర్ట్ సినిమా తీసేప్పుడు ఈ సినిమా సక్సెస్ అవుతుంది అనుకుని ఉంటాడు కానీ ఇంతగా ప్రజాదరణ పొందుతుంది అని ఊహించి ఉండడు. ముఖ్యంగా మంగపతి రోల్ లో శివాజి ని ఆడియన్స్ బాగా రిసీవ్ చేసుకున్నారు కాబట్టి నాని ఇదే ఊపులో తను చేస్తున్న ప్యారడైజ్ సినిమాలో ఒక ఛాన్స్ ఇస్తే బాగుంటుందని అనుకుంటున్నార్. నాని శ్రీకాంత్ ఓదెల కలిసి రెండో ప్రయత్నంగా చేస్తున్న ప్యారడైజ్ సినిమా సంథింగ్ డిఫరెంట్ గా రాబోతుంది. ప్యారడైజ్ సినిమాలో శివాజి లాంటి యాక్టర్ ని తీసుకుంటే సినిమాకు మరింత ప్లస్ అయ్యేలా ఉంటుందని అంటున్నారు. నాని ప్రొడ్యూసర్ గా శివాజికి హిట్ ఇచ్చాడు కాబట్టి ఇప్పుడు తను హీరోగా చేస్తున్న సినిమాలో కూడా అతనికి ఆఫర్ ఇస్తాడేమో చూడాకి. శివాజి కూడా ఇక మీదట ఛాలెంజింగ్ రోల్స్ చేయాలని ఉత్సాహంగా ఉన్నాడు.



# ఆ స్టార్ హీరోపై రష్మిక ఇంట్రెస్టింగ్ కామెంట్!

నేషనల్ క్రష్ రష్మికా మందన్నా ఏ సినిమాకు పని చేసినా ఆ చిత్ర యూనిట్ తో మమేకం అవుతుంది. హీరో..డైరెక్టర్ తో మంచి ఫ్రెండ్ షిప్ ని బిల్డ్ చేసుకుంటుంది. రష్మిక సక్సెస్ అవ్వడంలో ఇదీ ఒక కారణం. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ తో కలిసి సికిందర్ చిత్రంలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న చిత్రం ప్రచారం పనులు మొదలు పెట్టింది. దీనిలో భాగంగా లిరికల్ సింగిల్స్ రిలీజ్ చేస్తున్నారు. అప్పట్లో బడ్జెట్, కలెక్షన్స్ ఎంత? ఈ సందర్భంగా అమ్మడు సల్మాన్ ఖాన్ గురించి ఆసక్తికర విషయాలు రివీల్ చేసింది. సల్మాన్ ఖాన్ నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ఆయన ఎంతో క్లారిటీతో ఉంటారు. సెట్ లో ఎంతో ఎనర్జీతో ఉంటారు. ఎలాంటి యాక్షన్ సన్నివేశం చేసినా? ఆయనలో ఫ్రెష్ నెస్ మాత్రం తగ్గదు. ఎంతో యాక్టివ్ గా పని చేస్తారు అంది. సల్మాన్ తో కలిసి పనిచేయడం తన కల అని అది ఈ సినిమాతో నెరవేరు తుందని..ఆరోగ్యం సరిగ్గా లేకపోతే షూటింగ్ సమయంలో ఇంటి భోజనం కూడా పంపించేవారని గతంలో



తెలిపిన సంగతి తెలిసిందే. సికిందర్ సక్సెస్ అయితే రష్మిక ఇమేజ్ మరింత రెట్టింపు అవుతుంది. ఇప్పటికే అమ్మడు యానిమల్ సినిమాతో బాలీవుడ్ లో తొలి బ్లాక్ బస్టర్ అందుకున్న సంగతి తెలిసిందే. తొలి సినిమాతోనే తనలో రొమాంటిక్ యాంగిల్ ని బాలీవుడ్ కి పరిచయం చేసింది. అటుపై ఛావాతో మరో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఇందులో ఏసుబాయి పాత్రలో రష్మిక అభినయంతో తనలో మరో గొప్ప నటి ఉందని ప్రూవ్ చేసింది. ప్రస్తుతం హిందీలో థామాలో నటిస్తోంది. అలాగే తెలుగులో ధనుష్ , నాగార్జున నటిస్తోన్న కుభేరలోనూ నటిస్తోంది. ది గర్ల్ ఫ్రెండ్ అనే మరో తెలుగు సినిమా కూడా చేస్తోంది.

మిల్కీ బ్యూటీ తమన్నా ఇటీవల బ్రేకప్ వార్తలతో ఎక్కువగా మీడియాలో నిలిచిన విషయం తెల్సిందే. దాదాపు రెండేళ్ల పాటు నటుడు విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న తమన్నా ఇటీవల విడిపోయిందనే వార్తలు వస్తున్నాయి. వివాహం విషయంలో ఇద్దరి మధ్య భిన్న అభిప్రాయాల కారణంగా విడిపోయారు అనే వార్తలు వచ్చాయి. అసలు విషయం ఏంటి అనేది ఆ ఇద్దరిలో ఏ ఒక్కరూ క్లారిటీ ఇవ్వలేదు. మొత్తానికి ఇద్దరూ మొన్నటి వరకు ప్రేమలో ఉన్న విషయం నిజం, ఇటీవల బ్రేకప్ అయిన మాట వాస్తవం అంటూ జాతీయ మీడియాలోనూ ప్రముఖంగా కథనాలు వస్తున్నాయి. సెలబ్రెటీ లైఫ్ స్టైల్‌ను గమనించే పలువురు మీడియా వారు సైతం తమన్నా, విజయ్ వర్మ బ్రేకప్‌ను ధృవీకరించారు. బ్రేకప్ వార్తలపై తమన్నా, విజయ్ వర్మలు స్పందించలేదు. ప్రస్తుతం ఇద్దరి సన్నిహితులు వీరిని మళ్లీ కలిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే వార్తలు సైతం వస్తున్నాయి. ఇటీవల ఒక సెలబ్రిటీ నిర్వహించిన హెూలీ వేడుకలో విడి విడిగా హాజరు అయ్యారు. ఇద్దరి మధ్య మొహం మొహం చూపించుకోలేనంత గొడవలు జరగలేదని, కనుక ప్యాచప్‌కి అవకాశం ఉందని కొందరు అంటున్నారు. ఇదే సమయంలో తమన్నా ఏమాత్రం బాధ లేకుండా వరుసగా కొత్త ప్రాజెక్ట్‌లకు ఓకే చెబుతూ వస్తోంది.

# తమన్నాకి ఆ బాధ ఏం లేదా?



సాధారణంగా బ్రేకప్ కారణంగా హీరోయిన్స్ కాస్త డిప్రెషన్‌కి గురి అవుతారు. కనీసం ఆరు నెలల పాటు కొత్త ప్రాజెక్ట్‌లపై ఆసక్తి చూపించరని టాక్ ఉంది. కానీ తమన్నా మాత్రం ఇటీవల కొత్త ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాలీవుడ్‌లో అజయ్ దేవగన్‌తో కొత్త సినిమాకు తమన్నా ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. తమన్నా ఇప్పటికే పలు హిందీ సినిమాల్లో నటించింది. హీరోయిన్‌గా మరింత కాలం కొనసాగడం కోసం తమన్నా ప్రయత్నాలు చేస్తుంది. అందుకే వచ్చిన ప్రతి అవకాశంను సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో కమిట్ అవుతూ వస్తోంది. అజయ్ దేవగన్ సినిమాకు ఇటీవలే ఓకే చెప్పింది. బ్రేకప్ అయి కొన్ని వారాలు కూడా కాకుండానే కొత్త సినిమాకు ఓకే చెప్పిన తమన్నా అందరినీ ఆశ్చర్యపరిచింది. బ్రేకప్ బాధ పెద్దగా మనసులో పెట్టుకోకుండా తమన్నా నార్మల్‌గానే తన కెరీర్‌లో ముందుకు వెళుంది. పైగా బ్రేకప్ తర్వాత కెరీర్ విషయంలో మరింత సీరియస్‌గా తమన్నా ఉన్నట్లు తెలుస్తోంది. తెలుగులో తమన్నా ప్రస్తుతం ఓదెల 2 సినిమాలో నటిస్తోంది. గత సంవత్సరం పలు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తమన్నా ఈ సారి మాత్రం ఓదెల 2 మాత్రమే ఇప్పటి వరకు చేస్తుంది. ఇటీవల అజయ్ దేవగన్ సినిమాకు కమిట్ అయింది. మరో వైపు వెబ్ సిరీస్ కి సంబంధించిన చర్చలు సైతం జరుగుతున్నాయని సమాచారం అందుతోంది. మొత్తానికి విజయ్ వర్మ తో బ్రేకప్ విషయంలో తమన్నా తెగ ఇబ్బంది పడి పోకుండా కెరీర్ పరంగా సాఫీగా ముందుకు సాగాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. కొందరు బ్రేకప్ కావడంతో డిప్రెషన్‌లోకి వెళ్లి కెరీర్‌ను నాశనం చేసుకుంటారు. కానీ తమన్నా మాత్రం అలా చేయకుండా మెచ్యూర్డ్‌గా ఆలోచిస్తుందని ఆమె సన్నిహితులు అభినందిస్తూ సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు.

# లండన్‌లో చిరూకి మెగా వెల్‌కమ్



టాలీవుడ్ అగ్ర హీరో, మెగాస్టార్ చిరంజీవి మరో అరుదైన గౌరవం అందుకున్నారు. సినీ ఇండస్ట్రీలో నలభై ఏళ్లకు పైగా ఆయన సేవలను , అతను చేసిన కృషిని యూకే ప్రభుత్వం గుర్తించింది. ఈ సందర్భంగా పార్లమెంట్ లోని హౌస్ ఆఫ్ కామన్స్ లో మెగాస్టార్ పద్మ విభూషణ్ చిరంజీవిని సత్కరించనుంది. ప్రజా సేవల్లో ఎంతో ప్రతిభ కనబరిచినందుకు ఆయనకు మార్చి 19న జీవిత సాఫల్య పురస్కారాన్ని యూకే గవర్నమెంట్ ప్రధానం చేయనుంది. అందులో భాగంగానే చిరంజీవి మంగళవారం లండన్ చేరుకున్నారు. తమ అభిమాన హీరోకు లభించిన ఈ ప్రత్యేక గౌరవంతో మెగా ఫ్యాన్స్ ఆనందానికి అవధుల్లేవు. అయితే లండన్ కు చేరుకున్న తమ హీరో మెగాస్టార్ చిరంజీవికి ఘన స్వాగతం పలికేందుకు మంగళవారం తెల్లవారుజామున లండన్ హీత్రూ ఎయిర్ పోర్టుకు వందలాది మంది మెగా ఫ్యాన్స్ వెళ్లారు. చిరూ ను రిసీవ్ చేసుకుని వారి ఆనందాన్ని తెలిపిన ఫ్యాన్స్ తో మెగాస్టార్ నవ్వుతూ సెల్ఫీలు దిగారు. హీత్రూ విమానాశ్రయంలో చిరూ ఫ్యాన్స్ చేసిన హంగామాకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతు న్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం వశిష్ట దర్శకత్వంలో విశ్వంభర చేస్తున్న మెగాస్టార్ చిరంజీవి, దాని తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమాను చేయనున్నాడు. జూన్ నుంచి అనిల్ రావిపూడి- చిరంజీవి సినిమా సెట్స్ పైకి వెళ్లి సంక్రాంతికి రిలీజ్ కానుంది. అనిల్ తర్వాత దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరూ సినిమా చేయనున్నాడు.

# 'మ్యాడ్ స్క్వేర్' సెన్సార్ రిపోర్ట్ 28న విడుదల



సూపర్ హిట్ అయిన 'మ్యాడ్' సినిమాకు సీక్వెల్‌గా రూపొందిన 'మ్యాడ్ స్క్వేర్' సినిమా విడుదలకు సిద్ధం అయింది. మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు ఓ రేంజ్‌లో జరుగుతున్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నాగ వంశీ ఈ సినిమాను నిర్మించారు. మ్యాడ్ చిన్న సినిమాగా వచ్చి పెద్ద విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే మ్యాడ్ స్క్వేర్ సినిమా పెద్ద సినిమాగా రిలీజ్‌కి రెడీ అవుతుంది. మొదటి పార్ట్‌తో పోల్చితే బడ్జెట్‌తో పాటు అన్ని విషయాల్లోనూ ఎక్కువగా ఉండబోతుంది అంటూ మేకర్స్ చెబుతున్నారు. వారే ముగ్గురు హీరోలు ఈ సీక్వెల్‌లో కంటిన్యూ కావడంతో పాటు పలు కామన్ పాయింట్స్ ఉన్నాయి. మార్చి 28న విడుదల కాబోతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఇప్పటికే సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ అంచనాలు పెంచే విధంగా సెన్సార్ టాక్‌తో పాటు, రన్ టైం ఉంది. సెన్సార్ బోర్డ్ నుంచి ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్ అనే టాక్‌ను సొంతం చేసుకుంది. అంతే కాకుండా ఈ సినిమా మరీ లెంగ్తీగా లేకుండా సింపుల్ అండ్ స్వీట్‌గా ఉండే విధంగా కేవలం 2 గంటల 7 నిమిషాల రన్ టైం మాత్రమే ఉంచారని తెలుస్తోంది. ఆ టైమ్‌లోనే టైటిల్ కార్డ్స్ సైతం పడనున్నాయని తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో కొన్ని సినిమాలు రెండున్నర గంటలు, అంతకు మించి ఉండటంతో బోరింగ్‌గా అనిపిస్తున్నాయి. విడుదల తర్వాత రన్ టైం తగ్గిస్తున్న వారు ఉన్నారు. మ్యాడ్ స్క్వేర్ సినిమా మేకర్స్ ముందుగానే మరీ ఎక్కువ రన్ టైం లేకుండా జాగ్రత్త పడ్డారని తెలుస్తోంది. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో నాగ వంశీ నిర్మించిన ఈ సినిమాకు సాయి సౌజన్య సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మ్యాడ్ సినిమాకు ప్రేక్షకుల నుంచి అనూహ్య రెస్పాన్స్ దక్కడంతో ఎక్కువ ఆలస్యం చేయకుండా వెంటనే సీక్వెల్‌గా ఈ సినిమాను తీసుకు రాబోతున్నారు. భారీ అంచనాల నడుమ విడుదల కాబోతున్న ఈ సినిమాలో నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్‌లు హీరోలుగా నటించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది అంటూ మేకర్స్ మొదటి నుంచి చెబుతూ వచ్చారు. అప్పట్లో బడ్జెట్, కలెక్షన్స్ ఎంత? సంగీత్ శోభన్ కామెడీతో పాటు ఇతర ఇద్దరు హీరోలు మ్యాడ్ స్క్వేర్‌తో మరోసారి ఆకట్టుకోవడం ఖాయం అనే నమ్మకంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. టాలీవుడ్‌లో మ్యాడ్ వంటి యూత్ ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్స్‌కి మంచి స్పందన ఉంటుంది. అందుకే మ్యాడ్ స్క్వేర్ సినిమా కూడా కచ్చితంగా భారీ వసూళ్లు సాధిస్తుంది అనే నమ్మకంను ప్రతి ఒక్కరూ వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురు హీరోలకు ఈ సినిమా మరోసారి కీలకంగా మారింది.

# బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో విష్ణుప్రియ, టేస్టీ తేజకు పోలీసుల నోటీసులు..!



బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో పంజాగుట్ట పోలీసులు విచారణను వేగవంతం చేశారు. యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్న బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోటు చేస్తున్న టీవీ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సహా మంది పోలీసులు సోమవారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ, యూట్యూబర్, కమెడియన్ టేస్టీ తేజకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో ఆదేశించారు. విచారణ తర్వాత మరికొందరికి సైతం విచారణకు రావాలని నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.ఇప్పటికే బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేసిన ఇతర వ్యక్తులపై సైతం పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్స్, టీవీ నటుల్లో పలువురిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. యాంకర్లు విష్ణుప్రియ, శ్యామల, హర్షసాయి, ఇమ్రాన్ ఖాన్, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, రీతూ చౌదరి, సుప్రీత, సుధీర్, అజయ్, సన్నీ యాదవ్ పలువురిపై పలు సెక్షన్లతో పాటు యాక్టుల కింద కేసులు నమోదు చేశారు. ఇప్పటికే సేకరించిన యాప్స్ లింక్స్ ఆధారంగా పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం.

# రాజమౌళి ట్విస్ట్ మాములుగా లేదు.. మహేష్ సినిమాలో ప్రియాంక రోల్ లీక్..



దర్శకధీరుడు రాజమౌళి, మహేష్ బాబు కాంబోలో ప్రస్తుతం ఎస్ఎస్ఎంబి-29 అనే చిత్రం స్లో అండ్ స్టడీగా చిత్రీకరణ జరుపుకుంటుంది. ఒడిశాలో ఈ మూవీ షూటింగ్ జరుపుకుంటున్నట్టు తెలుస్తుండగా, అక్కడ షూట్ ప్రారంభించిన మొదటి రోజే ఓ వీడియో లీక్ అయింది. జక్కన్న తీసిన సీన్స్ అన్ని లీక్ కావడంతో ఆయన షూటింగ్‌లో ఇప్పుడు చాలా స్ట్రిక్ట్ యాక్షన్ అమలు చేస్తున్నట్టు తెలుస్తుంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ వార్త నెట్టింట హల్‌చల్ చేస్తుంది. ఇందులో ప్రియాంక చోప్రా ముఖ్య పాత్ర పోషిస్తుండగా, ఆమెని నెగెటివ్‌గా జక్కన్న చూపించబోతున్నట్టు సమాచారం.ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇంకా అధికారిక ప్రకటన రాని నేపథ్యంలో ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. రాజమౌళి సినిమా అంటే ట్విస్ట్‌లు మాములుగా ఉండవు. ఏది చేసిన కూడా అది సంచలనమే అవుతుంది. ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ వార్తలలో నిజమెంత ఉందనేది తెలియాల్సి ఉంది. ఇక రాజమౌళి తన సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు కేవలం నటన, టెక్నికల్ అంశాల్లోనే కాకుండా సెట్ లో క్రమశిక్షణ పర్యావరణంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారనే విషయం మనకు తెలిసిందే. ఇది మరో సారి వెల్లడైంది.

# ధోని గిఫ్ట్‌కు షాకైన అశ్విన్.. అస్సలు ఎక్స్‌పెక్ట్ చేయలేదంటూ..



**న్యూఢిల్లీ-నవభూమి:** మహేంద్ర సింగ్ ధోని-రవిచంద్రన్ అశ్విన్.. టీమిండియా అభిమానులతో పాటు చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్‌కు ఈ జోడీ అంటే చాలా ఇష్టం. ఇద్దరూ మంచి దోస్తులు. అంతకంటే కూడా వీళ్ల మధ్య గురుశిష్యుల బంధం ఉందని చెప్పొచ్చు. మాహీ సారథ్యంలో భారత జట్టులోకి వచ్చిన అశ్విన్.. అతడితో పాటు కోహ్లీ, అశ్విన్ లాంటి ఇతర సారథులూ అండగా నిలవడంతో ఈ స్థాయికి చేరుకున్నాడు. అశ్విన్ బౌలింగ్-ధోని కీపింగ్.. ఇది బ్లాక్‌బస్టర్ కాంబినేషన్. టీమిండియాతో పాటు ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడుతున్న ప్పుడు ఈ జోడీ అదిరిపోయే ఆటతీరుతో అభిమానుల మనసు దోచుకుంది. మధ్యలో విడిపోయిన అశ్విన్-ధోని.. ఐపీఎల్ కొత్త ఎడిషన్ కోసం మళ్లీ ఒక్కటయ్యారు.తిరిగి సొంతగూటికి..అశ్విన్ తన పాతగూటికి చేరుకున్నాడు. మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్‌తో జతకట్టాడు. కొత్త సీజన్ కోసం ప్రాక్టీస్‌లో చెమటలు కక్కుతున్నాడు అశ్విన్. ధోని, జడేజా లాంటి పాత సీఎస్‌కే సహచరులతో కలసి దుమ్మురేపాలని అనుకుంటున్నాడు. ఈ తరుణంలో అతడు ఆసక్తికర విశేషాలు పంచుకున్నాడు. తన 100వ టెస్ట్ నేపథ్యంలో మాహీ చేతుల మీదుగా మెమొంటో అందుకోవాలని భావించానని.. కానీ కుదరలేదన్నాడు.అశ్విన్ పిలిచినా ఆ మ్యాచ్‌కు వచ్చేందుకు ధోనీకి కుదర్లేదట. ఆ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చిన ధర్మశాలకు వచ్చేందుకు మాహీ ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కాలేదట. అయితే అంతకంటే ధోని తనకు పెద్ద బహుమతి ఇచ్చాడని తాజాగా అశ్విన్ రివీల్ చేశాడు.

# పాకిస్థాన్ ఆల్‌రౌండర్‌కు మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా



**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్థాన్ ఆల్‌రౌండర్ ఖుష్‌దిల్ షా)కు .. మ్యాచ్ ఫీజులో 50 శాతం ఫైన్ వేశారు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో అతను ఉల్లంఘనకు పాల్పడ్డాడు. ప్రవర్తనా నియమావళి లెవల్ 2 ను ఉల్లంఘించినట్లు ఐసీసీ పేర్కొన్నది. మైదానంలో అనుచిత రీతిలో మరో ప్లేయర్‌ను ఢీకొట్టడం వల్ల మ్యాచ్ ఫీజులో కోత విధిస్తున్నట్లు ఐసీసీ తెలిపింది. దీనిపై ప్రకటన రిలీజ్ చేసింది. ఖుష్‌దిల్‌కు క్రమశిక్షణా రికార్డులో మూడు డీమెరిట్ పాయింట్లు కూడా జతకూడాయి. గడిచిన 24 నెలల కాలంలో ఇదే తొలి తప్పుగా చిత్రీకరించారు. ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో.. కివీస్ బౌలర్ జకరీ ఫోక్స్‌ను బ్యాటర్ ఖుష్‌దిల్ ఢీకొట్టాడు. వికెట్ల మధ్య పరుగు తీస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. తప్పును అంగీకరిస్తున్నట్లు ఖుల్‌దిల్ చెప్పాడు. ఐసీసీ విధించిన జరిమానాను ఆమోదించాడు.లెవల్ 2 ఉల్లంఘన ప్రకారం.. ఆటగాళ్లకు 50 నుంచి 100 శాతం వరకు మ్యాచ్ ఫీజులో కోత విధిస్తారు. లేదంటే రెండు సస్పెన్షన్ పాయింట్లు జోడిస్తారు. ఒకవేళ 24 నెలల్లో డీమెరిట్ పాయింట్లు నాలుగుకు చేరితే, అప్పుడు ఆ క్రికెటర్‌ను బ్యాన్ చేస్తారు. రెండు సస్పెన్షన్ పాయింట్లు ఉంటే ఒక టెస్టు లేదా రెండు వన్డేలు, లేదా రెండు టీ20ల నుంచి నిషేధం విధిస్తారు.

# యుద్ధభూమిని వీడొద్దు.. హార్దిక్ మాటలు వింటే గూస్‌బంప్సే



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా స్టైలిష్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కెరీర్‌లో ఒక్క ఏడాదిలో ఊహించని మార్పు వచ్చింది. గతేడాది ఐపీఎల్ సమయం లో అతడ్ని బూ.. అంటూ ఎగతాళి చేశారు అభిమానులు. గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌కు మారడం, రోహిత్ శర్మను తీసేసి అతడికి సారథ్యం ఇవ్వడం చాలా మంది ఫ్యాన్స్‌కు రుచించలేదు. దీంతో పాండ్యాను ట్రోల్ చేశారు. అయితే అటు టీ20 వరల్డ్ కప్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీ విన్నింగ్ టీమ్‌లో కీలకపాత్ర పోషించి తిరిగి అందరి నుంచి ప్రశంసలు అందుకుంటున్నాడు హార్దిక్. ఈ నేపథ్యంలో యుద్ధభూమిని వీడొద్దం టూ అతడు తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పాండ్యా ఇంకా ఏమన్నాడంటే..

**అదే నా సిద్ధాంతం: పాండ్యా**

యుద్ధభూమిని ఎల్లప్పుడూ వీడొద్దనేది నా ఫిలాసఫీ. విజయం ఒక్కటే కాకుండా టీమ్‌లో నా బెర్త్‌ను కాపాడుకోవడం.. ప్లేస్‌ను నిలబెట్టుకోవడం లాంటి ఎన్నో ఫేజెస్‌ను కెరీర్‌లో చూశా. నా జీవితంతో పాటు కెరీర్‌లోనూ ఎన్నో విషయాలు జరుగుతున్నా నేను మాత్రం క్రికెట్ మీద మాత్రమే దృష్టి పెట్టా. ఈ ఆటే నాకు బెస్ట్ ఫ్రెండ్ అని అర్థం చేసుకున్నా. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా, అవాంతరాలు ఇబ్బంది పెట్టినా, సమస్యలు కుంగదీసినా వాటిని దాటుకుంటూ ముందుకు సాగుతున్నా. ఆఖరుకు అనుకున్న ప్రతిఫలం వచ్చింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**